35
జనవరి 1983

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాసపత్రిక

ఏ శిల్పం? ఏసాహిత్యం?
ఏ శాస్త్రం? ఏ గాంధర్వం?
ఏ వెల్గులకీ ప్రస్థానం?
ఏ స్వప్నం? ఏ దిగ్విజయం?
చారిత్రిక విభాతసంధ్యల
మానవకథ వికాసమెట్టిది?
ఏ దేశం ఏ కాలంలో
సాధించినదేపరమార్థం?

అరసంనుంచి విరసందాకా తెలుగు సాహిత్య చరిత్రను ప్రజాదృక్పథంతో పరిశీలించనున్న విరసం సాహిత్యపాఠశాల (జనవరి 13-15, చెరబండరాజు నగర్, విజయవాడ)కు విప్లవాభినందనలు.

నిర్వహణ
'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 20
ఈ సంచిక రు.

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

135 మాసపత్రిక జనవరి 1983

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

సంవత్సర చందా రు. 20 ఈ సంచిక రు. 2

SRJANA is commended for use in Public Libraries in th State by the Director of Public Libraries, Andhra Pradesh, Hyd

Vide Ref. No. 1:2/A4/67, dated 22 9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu

Printed at Navatha Printers J. P. N. Road, Warangal - 506 00

for Venkataramana Mudranalayam, Warangal

విక్రమార్కుని సింహాసనం

ఆంధ్రా జింఖానా క్లబ్బులో ఆటపారేద్దామనుకున్న చంటయ్యకు ఆఖరిష్టకాన జోకరొక్క సేవ్ కావడమే కాదు ఆటకూడా చేయగలిగాడు. అందులోనూ ఇంకేముక్కయినా ఒక్క సెట్టులోనే అతుకుతుందిగాని జోకర్ ఏ సెట్టులోనయితే ఆ సెట్టులో నప్పుతుంది. అయితే ఇందిరా గాంధీవలె జోకర్ అనే మాటను హాస్యగాడని తీసివేయవద్దు (ఆట తెలిసిన వారెవరూ అట్లా తీసేయరు కూడా). ఆమె కూడా రాజకీయాలంటే నాటకం కాదన్నదిగాని సినిమా కాదనలేదు. సినిమా, తెరమీద ఎన్ని అసంబద్ధ విషయాలను చూపినా, ఆత్మగౌరవం గురించీ, ఆదర్శం గురించీ, అవినీతి గురించీ అవమానం గురించీ ఎన్ని బరువైన డైలాగులు చెప్పినా తెరవెనుక దానికొక నిర్దిష్టమైన ఆర్థికవిధానముంది, పెట్టుబడివుంది. ఆ సంగతి ఆమెక్కూడా తెల్సుకనుకనే మాటల్లో ఏందెప్పినా, ఏంచెప్పినా చేతల్లో తెలుగుదేశాన్ని తీసుకోవాల్సినంత సీరియస్ గానే తీసుకున్నది. ఆ మాటకొస్తే ఎన్.టి. రామారావు మొదలుకొని సృజన వరకు ఎవరూ ఊహించనంత బలంతో ఇందిరా వ్యతిరేక ప్రభంజనం వీస్తున్నదని ఆమె సరిగానే ఊహించింది. ఆమె ఆటీన్ ఎక్కానే కావచ్చుకాని పాలకవర్గాలకు ఇంక ఆమె బరువైపోయిన ముక్కైపోయింది. (తాను ఆట చేయడానికి ఉపయోగపడేట్టు లేదు, మిగిలిపోతే పాయింట్లెక్కువైపోయేట్టున్నాయి.) ఆంధ్రప్రదేశ్ ఫలితాలతో పాటు కర్నాటక ఫలితాలను కూడా పరిశీలిస్తే ఈ విషయం మరింత బాగా అర్థంచేసుకోవచ్చు. అయితే ఇక్కడ సమస్య ఇందిరా అపజయం, యన్. టి. రామారావు విజయాలది కాదు. పాలకవర్గాలకు మరికొంత కాలంపాటు ఒక ఆకర్షణీయమైనపార్టీ, నినాదాలు, కార్యక్రమాలు దొరికాయన్నదే.

నిజంగా కాంగ్రెస్ పాలనలోనే కాదు రెండు శతాబ్దాలకుపైగా తెలుగువాళ్ళ ఆత్మగౌరవం ఎంత వికావికలైపోయింది;

"....ఉన్మత్త సామజంబు
కొలను జొరబడి తమ్మితూడలను పెరికి
పైచుట" వలన "తత్ పద్మగర్భ కేసర విమశ్రిమధురసామాగ్రి" నమసిపోయింది

ఒక తెలుగుజాతి ఏమిటీ, బ్రిటిష్ సామ్రాజ్యవాద దుర్మార్గంఫలితంగా భారత ఉపఖండంలోని జాతుల ఆత్మగౌరవాలు జంతుపుపాదాలకింద పుష్పాడిలా నలిగిపోయాయి. '47 తర్వాత ఆ సామ్రాజ్యవాదంకన్నా బలమైన సామ్రాజ్యవాదాలుతోడై పెత్తపెట్టుబడీ, భూస్వామ్యం జోడు గుర్రాలపై దౌడుతీస్తూ జాతిజీవనాన్ని కొంటా

కొసల వినోదాలకు బలిచేస్తున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధిలో 'అప్పు'క్రీడలు నిర్వహిస్తున్నాయి.

కనుక జాతి, భాష, సంస్కృతి దీనిపై కేంద్రంఅమలుచేస్తున్న అణచివేత గురించి మాట్లాడేవాడు హీరో కావడంలో ఆశ్చర్యంలేదు. అయితే అతడి చైతన్య రథం కృష్ణానది తీరంలోని చైతన్యరథంకాగల స్వతంత్రం మనకుందా? అందులోని ప్రతిభాగమూ ఆంధ్రి కాదుగదా కేంద్రంకూడా దిగుమతి చేసుకోవల్సిందే తప్ప తయారు చేసుకోలేము. ఆయన పోషిస్తున్న ఏతెలుగువేషమైనా సామ్రాజ్యవాద సాంకేతికనైపుణ్య సహాయంలేకుండా సాధ్యమయ్యే స్వాతంత్ర్యం మనం అనుభవిస్తున్నామా? (తిరుమల దేవునికి తలనీలాలిచ్చి, నుదుట శబరిమల అయ్యప్పతిలకం దిద్దిన రాముడు మనభద్రాద్రిరాముడేనా! ఈవేలంవెర్రిలో, ఈగోలలో ఈ ప్రశ్నలేవీ రుచించవు.

అధికారంలోకి వచ్చేదాకా అధికారాన్ని ఏసిద్ధాంతమూ లేకుండా విమర్శించడం తాత్కాలికంగా చాలాఅనుకూలంగా వుంటుంది. సిద్ధాంతము ఏర్పడితే అటు నడవడానికి పనికిరాదు, క్రమశిక్షణనూ, త్యాగాన్నీ కోరుతుంది. చరిత్రపునాదిగా నిర్మాణమవుతుంది. దీర్ఘకాలంలోగానీ ఫలితాలనివ్వదు.

పార్లమెంటరీ రాజకీయాలను తమ కుటుంబంపైజ నెహ్రూ ఇందిరలు కత్తిరిస్తే, రాముడూ, రావణుడూ, కృష్ణుడూ, దుర్యోధనుడూ పాత్రలుపోషించగల ఎన్.టి.ఆర్., అసెంబ్లీనీమొత్తంగా తనకు ఆహార్యంగా ప్రదర్శించగలడు. 'ఇందిరే ఇండియా' అంటే అసహ్యించుకోడానికి పదేళ్ళపాలనా, ఎమర్జెన్సీ సాయపడ్డట్లుగా, శంఖాన్నిపూరిస్తూ కురుక్షేత్రంలో నిలిచిన గీతోపదేశకుడిగా రాకెట్ యుగంలో ఎన్నికల పోస్టర్లమీద ఒకమనిషికన్పిస్తే అసహ్యించుకోవడానికి ఎన్నికల జూదంఅంటూనే తలతాకట్టుపెట్టి, ఆలోచించటంకదా ఎట్లాసాధ్యం! పైగా అతడు చరిత్రకాదు అవతారం. దేవుడు అన్నిఅవతారాల్లో ఏమిసాధించాడో ఆయన అన్నీ సాధించగలడు. (నర్సింహావతారం మాత్రమే ఎత్తినట్లులేదు).

ఆయన నక్సలైట్ల ఫ్యాన్‌గాని నక్సలైట్ కాదు. ఆయనకు ఎన్నికలద్వారా వచ్చే విప్లవంమీదే నమ్మకముంది. మాజీ పోలీస్‌అధికారితోసహా, రాజీనామాచేసిన అధికారపార్టీమంత్రులు మొదలు అందర్నీ తనలోచేర్చుకోగలడు. ఆయన క్యాబినెట్ ఆపోజిషన్‌కంటే చిన్నదేగాని, ఆయన పార్టీమాత్రం ఆర్ఎస్ఎస్ మొదలుకొని

అతివాములదాకా అందరికీ అచ్చివచ్చింది. అదొక మినీవిశ్వరూపం. అదే యంత్రాంగంతో మాత్రమేకాదు అదే మనుషులతో ఆయన అవినీతిని అరికట్టగలనని హామీఇస్తున్నాడు. ఇదంతా అన్నిధర్మాలు పరిత్యజించి తనకుశరణుజొచ్చితే ఏ పాపమూ, చేసినవాళ్ళకంటదని కృష్ణపరమాత్ముడుచేసిన బోధలకనుగుణంగానే ఉన్నది.

అయితే సమస్య ప్రజలసమస్యలు ప్రజలుగానో, ప్రాతినిధ్యం వహించే పార్టీలద్వారానో కాకుండా హీరోలద్వారా పరిష్కారమవుతాయనే ఫ్యూడల్ భావజాలాన్ని పాలకవర్గాలు కాలానుగుణంగా వాడుకుంటున్నాయి. ఈసారి ఆంధ్రప్రదేశ్‌లో బతికిబట్టకట్టడానికి కేంద్రంమీదికీ, ఇందిరమీదికీ ప్రజల అసంతృప్తిని ఉసిగొల్పాయి. బావుంది. ఫలితాన్నిచ్చింది. తెలుగుప్రజల ఆత్మగౌరవాన్ని నిల్పడానికి ఆంధ్రప్రదేశ్ 'తెలుగునాడు' అవుతుంది. కాని రెండురూపాయలకే కిలో బియ్యం ఇవ్వడమైనా ఎన్‌టిఆర్‌కు కేంద్రంనుండి సబ్సిడీతెచ్చుకోకుండా సాధ్యమేనా? ఢిల్లీదాస్యంవల్ల ఆంధ్రప్రదేశ్‌గామారిన ఈ తెలుగునాడు వనరులు టాటాలకూ, బిర్లాలకూ చెందకుండా ఆయన చేయగలడా? ఆదిలాబాద్ అడవుల్లోని పోడు భూములూ, వెదురుసంపదా అక్కడి ఆదివాసులకే చెందేట్టు చెయ్యగలడా? కొండ మొదలు గిరిజనులను కాల్చేసిన దుర్మార్గులను శిక్షించగలడా? మంత్రివర్గ నిర్మాణం కొరకు కేంద్రాన్ని సంప్రదించకపోవచ్చు. నాలుగుసార్లు ఢిల్లీకి తిరుగకపోవచ్చు. కానీ పల్లెల్లో భూమికొరకు, పట్టణాల్లో పనికితగిన వేతనంకొరకు, అంతటా న్యాయమైన హక్కులకొరకు పోరాడుతున్న ప్రజల్ని అణచివేయడానికి, కేంద్రంచేసిన నల్లచట్టాల, కేంద్రంచేతిలోని రిజర్వుపోలీసుల సహాయంతెచ్చుకోకుండా ఉండగలడా? రాజకీయఖైదీలను విడుదలచేసి 'కల్లోలితప్రాంతాల' ప్రకటనను రద్దు చేయగలడా? ఇంతవరకూ భూస్వామ్యవర్గాలకు వ్యతిరేకంగా ఆయన ఒక్కమాట మాట్లాడలేదు. భూసంస్కరణలకు వ్యతిరేకంగా తనసినిమాద్వారా ఇదివరకే సందేశమిచ్చివున్నాడు. పెట్టుబడిదారీ విధానానికి ఆయన వ్యతిరేకం కావడానికి వీలేలేదు. పెట్టుబడినే నిన్నటిదాకా కళగానూ, ఇవాళ రాజకీయంగానూ చలామణీచేసి ఆయన అధికారంలోకి వచ్చాడు. పట్టణ పరిమితఆస్తుల చట్టాన్నిచేయాల్సివస్తే ఆ పరిమితి ఎంత అపరిమితమైందైనా అందుకు ఆయన ఆస్తులు అతీతంగానే వుంటాయి. కనుక ఆయన ఇప్పుడు చెప్పుతున్నట్లా 'తెలుగునాడు'లోని పెట్టుబడీదారులు, భూస్వాములు మాత్రమే తెలుగుప్రజలనూ, తెలుగువనరులనూ దోచుకోవాలిగాని కేం[illegible] దోచుకోవడానికని.

తెలుగునాడైనా, తెలుగుదేశమైనా, తెలుగుజాతైనా దీనికో చరిత్ర సంస్కృతీ గౌరవమూ ఉన్నాయి. ఇవి నిలుపుకోవాలంటే తనఇష్టంగా ఒక సమాఖ్యలో చేరడం మొదలుకొని ఇష్టంలేకపోతే విడిపోయేదాకా దీనికి హక్కువుండాలి. జాతి ఆత్మ గౌరవాన్ని గుర్తించేవానికైనా నిలబెట్టేవానికైనా ఈ మాట చెప్పే గుండెబలం వుండాలి. అప్పుడే ఎన్.టి.ఆర్ కేంద్రంతో సామరస్యం గురించి మాట్లాడుతున్నాడు; ఎందుకంటే ప్రజల్నుంచి ఓట్లు తెచ్చుకునే పనైపోయింది. ఇంక రిజర్వు బ్యాంక్ నుంచి నోట్లు తెచ్చుకోవాల్సిఉంది. సినిమాకు ముడిఫిల్ముకైనా గుత్తపెట్టుబడుల ప్రమేయం లేకుండా చక్రంఅడ్డేసి రామారావు తేగలడేమో ఎవరికి తెలిసినా తెల్వకున్నా ఆయనకే బాగాతెలుసు. డైలాగులు ఎన్నైనా చెప్పొచ్చు ప్రింటింగ్‌కు కొదువవుండదు.

ఏ మాటా, ఏ గాలీ ఆర్థికపునాది లేకుండా వచ్చేవికావు. సామ్రాజ్యవాదానికి ఊడిగం చేస్తున్న గుత్తపెట్టుబడిదారులూ, వాళ్ళతో మిలాఖత్ అయిన భూస్వాములూ కేంద్రంలో పెట్టుకున్న ఏజెంట్ ఇందిరా గాంధీ. ఆమెను జాతీ సంస్కృతీ వంటి మాటలతో కాకుండా ఏ భిన్నమైన స్వతంత్ర ఆర్థిక పునాదితో ఎన్.టి. రామారావు ప్రశ్నించగలడో ప్రశ్నించి నిలదొక్కుకోగలడో- అదీ తేలాల్సివున్నది.

అయితే ఆ వర్గాల ప్రయోజనాలను ఎమర్జెన్సీపెట్టో, ఇరవైసూత్రాలుచెప్పో, ముఖ్యమంత్రులను మార్చో, సబ్సిడీలు ఇచ్చో, ఇరవై అయిదు సూత్రాలు చెప్పో, మధ్యాహ్నభోజనాలు పెట్టో, సుస్థిర ప్రభుత్వాల గురించి చెప్పో, కరెన్సీనోట్లూ కల్లు సారాలు తరలించో, పోలీసులను దించో, అధికార యంత్రాంగాన్ని కదిలించో కూడా ఆమె నెరవేర్చగల శక్తికోల్పోయింది. ప్రజల్ని మాయచేయగల నేర్పు ఆమెలో అరిగిపోయింది. ఇవేవీ అవసరం లేకుండా పాలకవర్గాల ప్రయోజనాల్ని నెరవేర్చడానికి సరికొత్త వేషగాడు, సరికొత్త భాషతో రంగంమీదికి వచ్చాడు. అంతకంటే దోపిడీ వర్గాలకు కావల్సిందేమున్నది! శస్త్రచికిత్స అవసరం లేకుండా ఈ వ్యవస్థ మరో కంపెనీ పార్లమెంటరీ డ్రగ్గును వాడవచ్చునని మందుల కంపెనీలు ప్రకటిస్తున్నాయి. ఈ కొత్త కంపెనీల మీద కంట్రోలు కూడా బహుళజాతి కంపెనీలకే ఉన్నదని గ్రహించేదాక చేదునిజం చెప్పకుండా ఊరుకొందామా- చరిత్ర క్షమించదు.

9-1-83 — సంపాదకుడు

దేశభక్తి

కె. బాలగోపాల్

'దేశభక్తి' అనేది కమ్యూనిస్టులకు సులభంగా మింగుడుపడనిమాట. శ్రామిక వర్గ అంతర్జాతీయత ప్రాతిపదికగాగల దృక్పథానికి దేశభక్తి సహజంగానే సంకుచితంగా కనిపిస్తుంది. దేశంఅనేది అవిభక్తమయిన ఏకశిలానిర్మాణం (monolith) అనే ఆలోచన 'దేశభక్తి' అనే భావనలో అంతర్లీనంగావుంది కాబట్టి శ్రామికవర్గ పక్షపాతం ఉన్నవాళ్ళకు అది సహజంగానే దోపిడీవర్గాలకుట్రగా అనిపిస్తుంది. పైగా 'భ ' అనే ఫ్యూడల్‌మాట అంతసహజంగానూ శాస్త్రీయదృక్పథం ఉన్నవారెవ్వరికైనా కంపరంపుట్టిస్తుంది. 'భక్తి' అనగానే గుడ్డివిశ్వాసం, మూఢఆరాధన, స్ఫురిస్తాయి.

కాని, కమ్యూనిస్టులకు ఇష్టంఉన్నా లేకున్నా, వాళ్లు ఈ మాటను తరచు ఎదుర్కోకతప్పదు. వలస, అర్ధవలస దేశాలలో జాతీయతత్వం బలంగావుంటుంది. కాబట్టి ఫలానా వారికి 'దేశభక్తి' లేదనే ఆరోపణ చాలా తీవ్రమయినది. మూడవ ప్రపంచ దేశాలలో తిరోగామి శక్తులు కమ్యూనిస్టులమీద, ఇతర ఆధునిక భావాల ప్రతినిధులమీద (ఉదాహరణకు, విజ్ఞానశాస్త్రం) ఈ ఆరోపణవేసి ప్రజలలోని జాతీయతత్వాన్ని తమ ప్రయోజనాలకోసం వాడుకోవడం సర్వసాధారణంగా జరుగుతూన్న విషయం. ఇండొనేషియాలో సుకర్ణోనుండి ఇరాన్‌లో ఖొమైనీవరకు ఎవ్వరూ దీనికి మినహాయింపుకాదు. అట్లాగని వీళ్ళు మనస్ఫూర్తిగా కమ్యూనిస్టులను దేశద్రోహులుగా నమ్ముతారాఅంటే అదీలేదు. తమ ప్రయోజనాలకోసం కమ్యూనిస్టులతో కావలసినంతకాలం సఖ్యంగావుండి ఆ అవసరంతీరిన తరువాతే వీళ్ళలో ఎవ్వరికైనా కమ్యూనిస్టులలో దేశభక్తి రాహిత్యం కనబడింది. ఇందిరాగాంధీకి 1968లో కాంగ్రెస్‌ను చీల్చిననాటినుండి 1971లో అత్యధిక మెజారిటీతో గెలిచేదాకా సిపిఐ, సిపిఐ(ఎం)ల మద్దతు పార్లమెంటులో తనమనుగడకోసం అవసరమయింది. 1973 తరువాత గుజరాత్ బీహార్‌లలో చెలరేగిన తిరుగుబాట్లను 'ఫాసిస్టు' మూకలదాడులుగా చిత్రికరించడానికి సిపిఐ మహామేధావుల సిద్ధాంతచాతుర్యం అవసరమయింది. ఈ అవసరాలన్నీ తీరినతరువాతే ఆమెకు కమ్యూనిస్టులు ఇవ్వాళేకాదు, 1942 నుండి గూడ దేశద్రోహులేనని గుర్తుకొచ్చింది.

ఇట్లాంటి వాతావరణంలో 'కమ్యూనిస్టులకు దేశభక్తి లేదు' అనే ఆరోపణను కమ్యూనిస్టులు ఎదుర్కోక తప్పడంలేదు. ఎందుకంటే అది తమ రాజకీయ మను

గడకు సంబంధించిన విషయం. ఏనాడో రాజకీయాలుకోల్పోయిన సిపిఐకి, ఇందిరా గాంధీ 'దేశద్రోహ' నేరం ఆపాదించిన తరువాత, బేవార్సుగా దొరికే నాలుగువోట్లు మాత్రమే పోయాయిగానీ; ఇండొనీషియాలో కమ్యూనిస్టుపార్టీ 30 వేలమంది కేడర్ల ప్రాణాలను కోల్పోయింది. ఇరాన్‌లో ఇవ్వాళ కమ్యూనిస్టులేకాదు, పెటీబూర్జువా సోషలిస్టులయిన 'ముజాహిదీన్' లుగూడ ఈ నేరానికే వేలసంఖ్యలో చంపబడు తున్నారు.

ఎదుర్కోకతప్పదని గుర్తించి 'దేశభక్తి' లేదనే ఆరోపణను కమ్యూనిస్టులు ఎదుర్కొంటూనేవున్నారుగాని, మామూలుగా అందుకు సమాధానంగా చెప్పేమాటలు సంతృప్తికరమయినవికావు. దేశమంటే మట్టికాదు, అక్సాయ్‌చిన్‌లోని బండరాళ్లు కావు, దేశమంటే గురజాడ చెప్పిన వర్గరహితులయిన మనుషులుగూడకాదు, దేశమంటే పీడితప్రజలు, కాబట్టి దేశభక్తి అంటే పీడితప్రజాపక్షపాతం, అనేదితరచుగా వినబడే సమాధానం. ఇది వేదికలమీదినుండి ఇచ్చేఉపన్యాసాల పరిమితులకు లోబడి పుట్టిన వాదన. 'భక్తి' అనే ఫ్యూడల్ మాటకు వర్గపక్షపాతం అనే అర్థం ఇవ్వడం ఎంతతప్పో, నిజమైన 'దేశం' అంటే పీడితప్రజలు మాత్రమేననే భాష్యం అంత సంశయాస్పదం. నిజానికి, మనిషన్నవాడికి దేశభక్తి ఉండాలనే ఆలోచననూ వదుల కోలేక, శ్రామికవర్గపక్షపాతాన్నీ శాస్త్రీయవర్గదృక్పథాన్నీ కాదనలేక, రెంటికీఎలాగయినా సమన్వయం సాధించాలనే పెటీబూర్జువా రాడికలిజం నుండి పుట్టిన వాదనఇది. దేశంవలసగానో అర్ధవలసగానో ఉన్నంతకాలం, పెటీబూర్జువావర్గానికి కొంత విప్లవ కర లక్షణం ఉన్నంతకాలం, ఈ ప్రయత్నం కొనసాగుతూనే వుంటుంది. దాన్ని కాదనవలసిన అవసరంలేదుగాని, విషయాన్ని శాస్త్రీయంగా (అంటే దాని చారిత్రిక నేపథ్యంలో) అర్థంచేసుకోవడం అవసరం.

బూర్జువా జాతీయవాదం

'దేశభక్తి' అనేది జాతీయతత్వపు అతితీవ్రరూపం. ఇష్టముంటే అత్యున్నత రూపం అనొచ్చు. ఇష్టం లేకుంటే అతివాదరూపం అనొచ్చు. జాతులు చరిత్రలో చాలా ప్రాచీనమయినవిగాని, జాతీయతత్వం యూరప్‌లోని బూర్జువా విప్లవాలతో పుట్టింది. పెట్టుబడిదార్లకు సురక్షితమయిన మార్కెట్లుకావాలి. వీలయితే ప్రపంచవ్యాప్తంగా కావాలిగాని, అది సామ్రాజ్యవాదయుగం వచ్చేదాకా వీలుకాదుకాబట్టి, అంతవరకు కనీసం ఒకజాతి నివసించే

ప్రాంతంలోనయినా కావాలి. అంటే ఆ జాతి ఒక దేశంగాఏర్పడి ఒకేరాజ్యం (State) కిందవుంటూ, దేశవ్యాప్తమయిన ఒకేచట్టానికి లోబడివుండాలి. ఆ చట్టం గూడ 'దైవదత్తం' కాక మనుష్యులు ఏర్పరచుకునేది, మనుష్యులు మార్చుకోగలిగేది, కావాలి. అంటే లౌకికం (secular) కావాలి. లేకుంటే నిరంతరం మారేపెట్టుబడిదార్ల అవసరాలకు అనుగుణంగా దాన్ని మార్చడం సాధ్యంకాదు.

ఈ అవసరం ఒక్కొక్క పాశ్చాత్యదేశంలోనూ ఒక్కొక్క రూపంతీసుకుంది. అందుకే అన్ని పాశ్చాత్యదేశాలలోనూ జాతీయతత్వం ఒకేలాగలేదు, ఆయా దేశాల చారిత్రిక పరిస్థితులనుబట్టి మారుతుంది. ముఖ్యంగా రెండురకాలు కనిపిస్తాయి:

ఒకజాతి, ఒకదేశం, ఒకే లౌకికంఅయిన చట్టంకింద జీవించాలంటే ప్రదేశాంతర (extra-territorial) మతాధికారంగాని, అభిమానంగాని, కూడదు. అటువంటి అధికారంవుంటే బూర్జువావర్గం తనఅవసరాల్ని అనుసరించి చట్టాన్నీ, పరిపాలనా పద్ధతులనూ, ముఖ్యంగా విదేశాంగనీతినీ మార్చుకోలేదు. ఆ మతాధికారం గూడ కేవలం 'ఆధ్యాత్మిక' రంగానికే పరిమితంకావాలి, మిగిలినరంగాలను బూర్జువావర్గానికి వదిలేయాలి. అంటే లౌకికంకావాలి. అందుకే మొట్టమొదటి పెట్టుబడిదారీ దేశమయిన ఇంగ్లండులో జాతీయతత్వం కాథొలిక్ మతాన్ని వ్యతిరేకించి ఆంగ్లజాతికి పరిమితమయిన ఆంగ్లికన్‌చర్చి (Anglican Church) రూపంతీసుకుంది. కాథొలిక్‌మతం అంతర్జాతీయంగా ఒకే మత కేంద్రాన్నీ ఒకే మతాధికారినీ గుర్తిస్తుంది. పైగా మతం మనిషి 'ఆధ్యాత్మిక' వ్యవహారాలకు సంబంధించిన విషయం మాత్రమేననే బూర్జువా లౌకికవాదాన్ని ఆమోదించదు. మతం జీవితంలో అన్నిరంగాలకూ వర్తిస్తుందనే ఫ్యూడల్‌తత్వం దానిది. ఆ అధికారాన్ని పురస్కరించుకొని క్రిశ్చియన్‌దేశాల ఆంతరంగిక వ్యవహారాలలోనూ వాటిమధ్యజరిగే తగవులలోనూ మతాధికారులు తరచుగా తలదూర్చేవారు. ఈ జోక్యం బూర్జువావర్గం అవసరాల దృష్ట్యా అభ్యంతరకరమయినది. ఎందుకంటే ఆంతరంగిక వ్యవహారాలలో మతాధికారులు ఫ్యూడల్‌ప్రభువులపక్షం వహించేవారు. విదేశీవ్యవహారాలలో బూర్జువా విదేశాంగనీతికి ప్రాతిపదికఅయిన పోటీకి ఈ జోక్యంవల్ల ఇబ్బందికలిగేది. అందుకే ఎనిమిదవ హెన్రీరాజు కాలంనుండి బ్రిటిష్ బూర్జువావర్గం కాథొలిక్ మతానికి వ్యతిరేకంగా పోరాడి తమదేశంలోని కాంటర్బరీచర్చి కేంద్రంగాగల ఆంగ్లికన్ శాఖను ఏర్పరచుకున్నారు. తరువాతికాలంలో ఇదేరకమయిన పరిణామం ఫ్రాన్స్, జర్మనీ, తదితర యూరప్‌దేశాలలోజరిగి వివిధ ప్రొటెస్టంట్ శాఖలు

ఏర్పడ్డాయి. చివరికి, సిద్ధాంతంఎలాగున్నా, వాస్తవంలో తనపరదేశాంతర అధికార స్వభావాన్ని, లౌకికవ్యతిరేకతనూ కాథొలిక్‌మతం చాలామేరకు తగ్గించుకున్న తరువాతే ఈ వెల్లువ ఆగిపోయి, కాథొలిక్‌మతం ఆలస్యంగా బూర్జువా విప్లవాలుజరిగిన స్పెయిన్, ఇటలీ, పోలండ్ వంటి వెనుకబడ్డ దేశాలలో మిగిలిపోయింది.

అయితే దేశవ్యాప్తంగా వర్తించే ఒకేచట్టం వుండాలంటే పరదేశాంతర అధికార కేంద్రాలను దెబ్బతీస్తేచాలదు, అంతర్గతమయిన స్థానిక అధికారకేంద్రాలను గూడ దెబ్బతీయాలి. ఫ్యూడల్ సమాజం 'భగవంతుడి ఆదేశాలకు' ఎంతగాలోబడి వుంటుందో, ప్రతీ గ్రామంలోనూ ఇలాఖాలోనూ ప్రాదేశికమయిన దొరల అధికారానికీ అంతగా లోబడివుంటుంది. అది బైబిల్‌భాషలో- 'యెహోవా సామ్రాజ్యం' మాత్రమేకాదు, ప్రతీచిల్లరదేవుడి సామ్రాజ్యంగూడ. ఈ రెండింటినీగూడ దెబ్బతీస్తుంది బూర్జువా జాతీయతత్వం. ఒకవైపు తనకు అందుబాటులోవున్న ప్రాంతాన్ని తక్కిన ప్రపంచంనుండి వేరుచేసి ఒక సర్వసత్తాక (sovereign) రాజ్యాన్ని ఏర్పరుస్తుంది; అదేసమయంలో ఆ ప్రాంతానికి అంతర్గతమయిన సంస్థానాలన్నింటినీగూడ పడగొట్టి ఒకేఒక దేశవ్యాప్తమయిన శాసనకేంద్రాన్ని ఏర్పరుస్తుంది. లేకపోతే, ప్రతీ జాగీర్దారూ జమీందారూ తన ఇష్టంవచ్చిన ఆంక్షలుపెడుతూ తన ఇష్టంవచ్చినట్టు పన్నులు విధించడం, సుంకాలు సేకరించడం, మొదలుపెడితే వ్యాపారం నడవదు. శాసన వికేంద్రీకరణను బూర్జువాతత్వం ఎన్నడూ సహించదు.

ఈ రెండవ అవసరం నుండి పుట్టింది రెండవరకం జాతీయతత్వం. ఇది మనకు ఇటలీలోనూ జర్మనీలోనూ కనబడుతుంది. 19వ శతాబ్దిపు మొదటి భాగంలో ఈ రెండుదేశాలూ 30-40 సంస్థానాల కలయికగా వుండేవి. ఇటలీ గురించి అయితే 'అది ఒక దేశంకాదు, భౌగోళిక వ్యవహారం మాత్రమే' (Italy is not a nation, but a geographical expressi·n) అనే వేళాకోళం వుండేది. అటువంటి ఫ్యూడల్ సంస్థానాలను జర్మనీ ఇటలీ దేశాలుగా మలచి, శాసన వికేంద్రీకరణను పోగొట్టి, ఒకేరాజ్యాంగాన్ని రూపొందించిన విప్లవాలు అక్కడి బూర్జువా విప్లవాలు. ఇటువంటి విప్లవాలలో 'జాతీయఐక్యత' (national intigrati n) అనే భావన బలంగాముందుకొస్తుంది.

ఈ రెండవది - అంతర్గతమయిన కేంద్రాలను వ్యతిరేకించే 'జాతీయఐక్యత' అనేభావన - మనదేశ బూర్జువా వర్గానికి చాలా ప్రధానమయినదిగా కనబడింది. ఇటలీ

లోనూ జర్మనీలోనూ ఉన్న సంస్థానాలకంటే ఏపదిరెట్లో ఎక్కువ మనదేశంలో ఉండేవి. అంతకంటే ముఖ్యంగా, భిన్నజాతులూ భాషలూ మతాలూ ఉండేవి, ఉన్నాయి. వాటన్నింటినీ ఐక్యపరిచే కర్తవ్యాన్ని భారత బడాబూర్జువావర్గం చాలా ప్రాధాన్యంగా తీసుకుంది. అందుకే గాంధీకి యూరప్‌లోని సకలజాతీయ నాయకులలోకీ ఇటలీ నాయకులయిన గారిబాల్డీ, మాజినీలు నచ్చారుగాని, ఎనిమిదవ హెన్రీకాదు. ఈ 'జాతీయఐక్యత' ప్రాతిపదికగాగల జాతీయతత్వానికి చాలా బలమయిన వ్యక్తీకరణ రాష్ట్రీయ స్వయంసేవకసంఘ (ఆర్. ఎస్. ఎస్.) అందుకే ఆర్.ఎస్.ఎస్ మొదటి నుంచీగూడ పాకిస్తాన్ ఏర్పాటునేకాదు, భాషారాష్ట్రాలనూ, ప్రాంతీయ భాషలలో విద్యాబోధననూ, ఫెడరల్ రాజ్యాంగాన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. ఫెడరలిజాన్ని గోల్వాల్కర్ 'విషబీజం' (Poisonous seed) అన్నాడు. ఆర్. ఎస్. ఎస్ మన్ననలు పొందిన ఏకైక ప్రాంతీయ ఉద్యమం అస్సాం ఉద్యమం. దానికి కారణం ఆ సంస్థ తన చారిత్రిక పాత్రను వదులుకుందనికాదు, అస్సాం ఉద్యమాన్ని ముస్లిం వ్యతిరేక ఉద్యమంగా మలచి, బహుశా 1947 లో కోల్పోయిన 'జాతీయ ఐక్యత'ను మళ్లీపునరుద్ధరించవచ్చుననే దురాశ మాత్రమే. వేరే ఎక్కడా (కాశ్మీర్ నుండి నాగాలాండ్ వరకు) ప్రాంతీయ ఉద్యమాలు - ఎంతన్యాయమయినవి గూడా - ఆర్. ఎస్. ఎస్ మద్దతు పొందలేదు.

ఆర్. ఎస్. ఎస్.

ఈ మేరకు ఆర్. ఎస్. ఎస్ కూ కాంగ్రెస్‌కూ పెద్దగా తేడాలేదుగాని, ఆర్. ఎస్. ఎస్‌కు ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, వెనుకబడ్డ దేశాల బూర్జువా వర్గాలకు కేవలం శాసనసంబంధమయిన జాతీయఐక్యత చాలదని గుర్తించడం. జాతీయతాభావం ప్రజల నరనరాల్లోనూ 'జీర్ణించుకుపోయి 'విశుద్ధజాతీయతత్వం' (ఇది 'నవభారతి' పరిభాష, నాదికాదు) అధికారతత్వమయితేనే రెండు శతాబ్దాలు ఆలస్యంగా అధికారంలోకి వచ్చిన టాటాబిర్లాలు రాక్‌ఫెల్లర్, ఫోర్డులతో పోటీపడగలరు. పెట్టుబడిదార్ల పోటీలో ముందున్నవాడు కొంత ఉదారంగా వుండగలడు. కార్మికులు 'జాతి' శ్రేయస్సును మరిచిపోయి తమ వర్గశ్రేయస్సుకోసం సమ్మెచేస్తే ఒకసారి కాకుంటే ఒకసారి సహించగలడు. కాని వెనకబడ్డ బూర్జువా వర్గానికి ఈ ఔదార్యం సాధ్యం కాదు. 'జాతి'పేరిట ప్రజల అవసరాల్ని తన అవసరాలకు లోబరుచుకుంటేనేతప్ప తనకంటె ముందున్న పెట్టుబడిదార్లతో తాను పోటీపడలేనని గుర్తిస్తుంది. దానినే ఫాసిజం అంటాము. మొదటి ప్రపంచయుద్ధంలో ఘోరంగా పరాజయంపొందిన

జర్మనీ బూర్జువావర్గం మళ్లీ బలంపుంజుకోవాలంటే ముందు కార్మికులను అణచాలని
గుర్తించి హిట్లర్ 'జర్మన్ జాతి' పేరిట సోషలిస్టులనూ కమ్యూనిస్టులనూ కార్మికవర్గ
కార్యకర్తలనూ ఫాసిస్టుదాడికి గురిచేసాడు. ఫాసిజం ఎప్పుడూగూడ 'జాతి' పేరిట
బూర్జువావర్గం అవసరాలను సంరక్షిస్తుంది. ఈ దృష్టితో ఆర్. ఎస్. ఎస్ సిద్ధాంత
కర్త గోల్వాల్కర్ ఆలోచనలను పరిశీలిస్తే ఆసంస్థ స్వభావమేమిటో స్పష్టమవుతుంది.
ఆర్. ఎస్. ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గెవార్ గురించి చెప్తూ గోల్వాల్కర్ ఈవిధంగా
అంటాడు.

"డాక్టర్ హెడ్గెవార్ చిన్నతనం నుండిగూడా దేశసేవకు అంకితమయి, మాతృ
భూమి విముక్తికోసం అప్పట్లో నడుస్తూవుండిన వివిధ ఉద్యమాలలో పాల్గొన్నాడు.
కొంతకాలం విప్లవ ఉద్యమం*లో పాల్గొని తరువాత కాంగ్రెస్ పార్టీ ఉద్యమాలలోకీ
నిర్మాణకార్యక్రమాలలోకీ దిగాడు.

అయితే, ఈ ఉద్యమాలన్నీ గూడ కేవలం బ్రిటిష్ వాళ్ళను తరిమివేయడం
తమలక్ష్యంగా పెట్టుకున్నాయనీ, దానినే జాతీయతా భావంతో సమంగా పరిగణిస్తున్నా
యనీ, గుర్తించాడు. అప్పటి నాయకులు చాలమంది దృష్టిలో 'బ్రిటిష్ వ్యతిరేకత',
'జాతీయతాభావం', సమభావాలు. ఇటువంటి పైపై ఆలోచన మన వ్యవస్థాపకుడికి
అసంతృప్తికలిగించింది. 'జాతి' అన్నది అనుకూల (positive) భావన అనీ, ఒక
రిని వ్యతిరేకించడం పైన ఆధారపడ్డదికాదనీ, మనజాతి చరిత్రతో ఆయనకున్న లోత
యిన పరిచయంవల్ల ఆయన తెలుసుకున్నాడు. అంతే కాకుండ మనజాతి లక్ష్యంగా
ఆదినుండి భావించబడుతూన్న దానిని ఏమాత్రం సడలించినా ఉపద్రవానికి దారి
తీస్తుందని గూడ ఆయనకు తెలుసు."

ఇందులో చివరివాక్యం చాలా ముఖ్యమయినది. అందులో పేర్కొన్న ఉప
ద్రవాన్ని వారించేప్రయత్నం నిర్వచనాలనుండి నిర్మాణందాక సాగుతుంది. గోల్వా
ల్కర్ దృష్టిలో ఒకజాతికి చెందడంఅంటే కేవలం ఒకేప్రాంతంలో నివసించడమో
ఒకేభాష మాట్లాడడమో కాదు. ప్రాదేశికజాతీయతావాదాన్ని (territorial nationa
lism) ఆయన నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తాడు. ఒకేప్రాంతంలో నివసిస్తేచాలదు.
ఒకేదృక్పథాన్ని ఆమోదించాలి, ఒకే "జీవితాశయం, సంస్కృతి, భావాలు, సమ్మ

*ఇక్కడ విప్లవ ఉద్యమం అంటే బెంగాల్‌లో జరిగిన 'టెరరిస్టు' ఉద్యమం
లాంటి సాయుధ తిరుగుబాటని అర్థం.

కాలు, సంప్రదాయాలు" కలిగివుండాలి. అందరికీ ఒకే మిత్రభావం, శత్రుభావం, ఒకే సంప్రదాయం, జీవితాశయం, ఉండి అందరి ఆశలూ అవసరాలూ ఒకే అవిభాజ్యమయిన మొత్తంగా రూపొందివుంటే, అప్పుడే అది ఒక 'జాతి' అవుతుంది. అటువంటిజాతి హిందూజాతి, అదే గోల్వాల్కర్ దృష్టిలో భారతజాతి. ఆ భారత జాతికి ముస్లింలూ క్రిశ్చియన్లూ చెందదల్చుకుంటే వాళ్ళు ఇక్కడి నివాసులయితే చాలదు, వాళ్ళపూర్వీకులు ఆదినుండిగూడ ఇక్కడి నివాసులయివుండినాచాలదు, వాళ్ళు హిందూ సంప్రదాయాలనూ దృక్పథాన్నీ ఆశయాలనూ అంగీకరించాలి. రాముడినీ కృష్ణుడినీ వేదాంతాన్నీ ఆమోదించాలి. హిందువులందరి జీవితాశయంగా వేదాంతులు (ఏకపక్షంగానే కానివ్వండి) తీర్మానించిన మోక్షాన్ని, లేక బ్రహ్మజ్ఞానాన్ని, తమ జీవితాశయంగా అంగీకరించాలి. వాళ్ళు అల్లానూ మరియమ్మనూ ఆరాధిస్తే ఫరవా లేదు. శివుడికీ విష్ణువుకూ పోలమ్మకూ మైసమ్మకూ సరసన మరొక ఇద్దరు దేవతలుగా; కాని తమది వేరేమతంఅనీ వేరే ప్రాపంచిక దృక్పథమనీ అనడానికి వీలు లేదు.

ఇదంతా ఎందుకోసం? తమ వ్యక్తిగతమయిన అవసరాలన్నింటినీ జాతి అవసరం అనే పగుళ్లలేని ఘనగిరి గుట్టగాపోగేసి, జాతిహీరోలనేభజిస్తూ (తిండి లేకుంటే ఆ భజనాలనే భుజిస్తూ), అందరూ గూడ జాతిలక్ష్యమయిన బ్రహ్మజ్ఞానాన్ని సాధించడంకోసం ఎందుకు పాటుపడాలి? సమాధానం విచిత్రమయినది: ఒక బలమయినజాతిగా రూపొందడానికి. బలహీనులను ఈ ప్రపంచంలో ఎవ్వరూ గౌరవించరు, బలవంతులనే గౌరవిస్తారు. "అప్రతిహతమయిన జాతీయశక్తి" (nvincible national strength) జాతి జీవితానికి పునాది కావాలి. వేదాంతులు చెప్పిన బ్రహ్మజ్ఞానమే నిజంగా జాతిలక్ష్యమయితే ఇంత గట్టిపునాది అనవసరం కాబట్టి ఆ అప్రతిహతమయిన జాతీయశక్తే అసలు లక్ష్యమనుకోవాలి. మరొకలాగ చెప్పాలంటే, చరిత్రలోకి రెండువందల సంవత్సరాలు ఆలస్యంగా వచ్చిన భారత బూర్జువావర్గం తమకంటే కొన్నివందలరెట్లు బలంగావున్న అమెరికా గుత్తపెట్టుబడిదార్లతో సమానంగా నిలవడం అసలు లక్ష్యమనుకోవాలి. ఇది గోల్వాల్కర్ ఉద్దేశ్యపూర్వకంగా కాంక్షించినదని నమ్మవలసినవసరంలేదు. హెగెల్ అన్నట్టు మనుష్యులు తమ ఆచరణద్వారా తాముకలలోగూడ ఉద్దేశించని ఫలితాలను సాధిస్తారు. సమాజాన్ని గురించి శాస్త్రీయ దృక్పథం లేకపోతే (ఈ సవరణ హెగెల్‌ది కాదు, మార్క్స్‌వాదిది). వెనకబడ్డ బూర్జువా వర్గాలకు ఫాసిజం అవసరం. ఆ ఫాసిస్టు సిద్ధాంతాలను

రూపొందించే వాళ్లు మతోన్మాదంతో చేయవచ్చు, లేక మూర్ఖత్వంతో చేయవచ్చు. అంటే ఆర్.ఎస్.ఎస్ రూపమాత్రంగానే మతోన్మాదసంస్థ. సారాంశంలో ఫాసిజం దాని తత్వం.

అయితే జాతియావత్తూ ఒకేలక్ష్యంతో నడవాలని ప్రకటించి ఊరుకోలేదు గోల్వాల్కర్. ఊరుకుంటే ఆయనకూ ఇందిరాగాంధీకీ తేడాలేకపోవు. ఆమెగూడ 'జాతిశ్రేయస్సు' పేరిటేగదా జాతీయభద్రతాచట్టాన్ని జారీచేసి దానికింద కార్మిక నాయకులను అరెస్టు చేయించింది. గోల్వాల్కర్ అక్కడితో ఆగిపోకుండ ఒక సమగ్రమయిన భావజాలాన్ని రూపొందించాడు. ఆ భావజాలానికి ఆయనపెట్టు 'హిందూధర్మం'. ధర్మంఅనేభావన హిందువులలో చాలాప్రాచీనమైనదేగాని, గోల్వాల్కర్ ప్రయోగించిన అర్థంలో అది ఫ్యూడల్‌యుగానికి చెందినది. అంటే భగవద్గీతలోను. మనుధర్మశాస్త్రంలోను, చెప్పబడ్డది. దాన్ని ఆధునికభాషలో గోల్వాల్కర్ వంటి పిదపకాలపు బ్రాహ్మణులు వివరించే తీరుఇది.

ప్రతివ్యక్తి పూర్వజన్మ కర్మలననుసరించి సమాజంలో ఒక స్థానం వుంటుంది. ఆస్థానాన్నే శ్రీకృష్ణపరమాత్మ మనువూ వర్ణం అన్నారు. తరువాతి కాలంలో కులంఅన్నారు. ఆమాటలు గట్టిగాఅనేధైర్యం గోల్వాల్కర్‌కు లేదుగాని భావంఅదే. ఆస్థానానికి ప్రాతిపదిక ఆయావ్యక్తుల ప్రావీణ్యం, లేకప్రజ్ఞ. ఈ ప్రావీణ్యాన్ని జన్మజన్మల కర్మలు నిర్ణయిస్తాయి. కొందరికి భూస్వామ్యంలో ప్రావీణ్యంవుంటుంది, కొందరికి క్షతముండటంలో వుంటుంది. కొందరికి హౌసింగ్ సొసైటీలపేరిట ఇళ్ళస్థలాల వ్యాపారం చేయటంలో ప్రజ్ఞవుంటుంది, కొందరికర్మ వాళ్ళకు ఇళ్లుకట్టడంలో తట్టలుమోసే ప్రజ్ఞనుమాత్రమే ఇస్తుంది. ఆ ప్రావీణ్యాన్ని అనుసరించి ఆవ్యక్తికి సమాజంలో స్థానంకలిగించబడుతుంది. భూస్వామ్యంలో ప్రావీణ్యంఉన్నవాడికి భూమిఇవ్వబడుతుంది. రిక్షాతొక్కడంలో ప్రావీణ్యం వున్నవాడికి రిక్షా తొక్కేఅనుమతి యివ్వబడుతుంది భూమి సంక్రమించిన తరువాతే భూస్వామ్యంలో ప్రావీణ్యం లభిస్తుందనీ, రిక్షాతొక్కడంతప్ప గత్యంతరం లేకపోతే చచ్చినట్లు రిక్షాతొక్కడంలో ప్రవేశం వస్తుందనీ మనబోటి వాళ్ళకు అనిపించవచ్చు పదార్థం నుండి చైతన్యం పుడుతుందని నమ్మేవాళ్ళకు అట్లాంటి అనుమానాలురావడం సహజం. కాని ఆ విచికిత్స అనవసరం. ఎందుచేతనంటే ఇందులో హెచ్చుతగ్గుల ప్రసక్తి లేదు, అందరూగూడ జాతిఅనే 'విరాట్ పురుషుడి' [illegible]లలో ఒకటి ఎక్కువా ఒకటి

తక్కువకాదు. ఆ విరాట్ పురుషుడిలో ఒకఅంగంగానే ప్రతీఒక్కడూ తన జన్మ జన్మల సహజపరిణామాన్ని సాధిస్తాడు. మనధర్మం కమ్యూనిస్టులుచెప్పే సమానత్వం (equality) కాదు, సామరస్యం (harmony). ప్రతివాడూ తనస్వధర్మాన్ని (అవి కట్టెలుమోయడంగానీ కారులో షికార్లుకొట్టడంగానీ) నిర్వహిస్తూపోతే అంతా ప్రశాంతంగా సామరస్యంగా వుంటుంది. ఈ స్వధర్మనిర్వహణే బ్రహ్మజ్ఞానానికి మార్గమని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. నా స్వధర్మం నాకు అన్యాయంగా కనిపిస్తోందని మొరాయించిన అర్జునుడితో "కౌంతేయా, సహజకర్మ దోషసహితమయినా త్యజించకూడదు" అంటాడు. గోల్వాల్కర్ మాటలలో : "బ్రాహ్మణుడు విద్యఇవ్వడంద్వారా గొప్పవాడయితే, క్షత్రియుడు శత్రువులను నాశనం చేసినందుకు కొనియాడబడ్డాడు. వ్యవసాయంద్వారా, వ్యాపారంద్వారా, సమాజాన్ని పోషించిన వైశ్యులుగాని, తమ వృత్తిపనులద్వారా సమాజానికి సేవచేసిన శూద్రులుగానీ బ్రాహ్మణ క్షత్రియులకంటే తక్కువేమీకాదు". కాని బ్రాహ్మణులు విద్య ఇచ్చింది రెండు అగ్రవర్ణాలకుమాత్రమే; ఆ విద్యగూడ తమకు ఉన్నతస్థానాన్ని ఇచ్చిన వర్ణధర్మాన్ని సమర్థించడంకోసమే క్షత్రియులు 'శత్రువును' నాశనం చేసింది తమ ఖజానాలు నింపుకోవడం కోసం, తమ రాజ్యాలు విస్తరించుకోవడం కోసం మాత్రమే శ్రామిక వర్గా(ర్ణా)లది ఆయుద్ధాలలో మందుగుండుపాత్ర. వ్యవసాయం, వృత్తిపనులూచేసిన వారుమాత్రమే తమకోసమే కాకఇతరులకోసంగూడ శ్రమించారు. దోచుకోవడమూ దోచుకోబడడమూ రెండూగూడ వారివారి స్వధర్మాన్ని అనుసరించి భగవంతుడిని ఆరాధించడానికి రెండు భిన్నరూపాలేనని ప్రకటిస్తే అందులోని అంతరార్థం స్పష్టమే, ఆజాతి చరిత్రలో 'ధర్మం అనేమాటకు అర్థమేమిటో, ఆ 'భగవంతుడి' పాత్రఏమిటో గూడ స్పష్టమే.

అయితే హిందూ ధర్మం గోల్వాల్కర్ సిద్ధాంతాలకు ఆయువుపట్టుమాత్రమే. మనువు చేతిలోనూ శ్రీకృష్ణుడి చేతిలోనూ 'హిందూ ధర్మం' భూస్వామ్య (ఫ్యూడల్) దోపిడీని సమర్థించడానికి ఉపయోగపడింది. భూస్వామ్యభావజాలంలో పారలౌకికత కీలకపాత్ర నిర్వహిస్తుంది. అందుకే ధర్మశాస్త్రాలలోనూ భగవద్గీతలోను ధర్మవర్తనకు ప్రతిఫలం బ్రహ్మజ్ఞానం, లేక మోక్షం. ఆ మరణానంతర ప్రతిఫలాన్ని మాటమాత్రంగా ఎరచూపుతూనే గోల్వాల్కర్ దాని స్థానంలో వేరేలక్ష్యాన్ని ప్రవేశపెడతాడు. అది 'అప్రతిహతమయిన జాతీయశక్తి'. ఎందుకంటే గోల్వాల్కర్ చేస్తున్నది భూస్వామ్య భావజాలమయిన హిందూధర్మాన్ని ఉన్నదున్నట్టుగా పునరుద్ధరించడం. దాన్ని బూర్జువా ప్రయోజనాల కోసం పునరుద్ధరించడం

నిజానికి ఒక గోల్వాల్కర్ మాత్రమే కాదు, భారతబూర్జువావర్గ నాయకు లంతా- గాంధీగాని తిలక్‌గాని రాధాకృష్ణన్‌గాని- చేసింది ఇదే: భగవద్గీతను బూర్జువా వర్గ అవసరాలకు అనుగుణంగా వ్యాఖ్యానించడం. గాంధీ చేతిలోనయితే ఆ ప్రయత్నం చాలా వింతరూపం తీసుకుంది. రణరంగం మధ్యనిలబడి, యుద్ధం చేయడానికి వెనకాడుతున్న అర్జునుడిని యుద్ధం చేయమనీ, శత్రు సంహారం క్షత్రియుడిగా తన ధర్మమనీ, కృష్ణుడు చేసే బోధ భగవద్గీత. అందులో గాంధీకి అహింసాతత్వం కనబడిందంటే విడ్డూరమేనని కోశాంబి అంటాడు.

గోల్వాల్కర్ ఏమంటాడో విందాం. వర్ణధర్మాన్ని గురించి మాట్లాడుతూ, "ధర్మం అంటే సమాజంలో ప్రతివ్యక్తీ మిగిలిన అందరు వ్యక్తులతోనూ ఏకత్వాన్ని సాధించి ఇతరుల భౌతిక జీవితాన్ని సుసంపన్నం చేయడానికి అవసరమయిన త్యాగ గుణం కలిగివుండడం" అంటాడు. ఇది చాల నిర్మొగమాటమయిన ప్రకటన. భూస్వామ్య బూర్జువా వర్గాలు ఒకరి కోసం త్యాగం చేసేది ఉండదు కాబట్టి, శ్రామిక జనం దోపిడీవర్గాల భౌతిక జీవితాన్ని సుసంపన్నం చేయడంకోసం తమ శ్రమను త్యాగంచేయడమే 'ధర్మం' అని దీని అర్థం. చేస్తే ఏంవస్తుందంటే బహుశా రాబోయేజన్మలో భూస్వాములయి పుడతారో లేకపోతే బ్రహ్మజ్ఞానం సాధించి పరమాత్మలో లీనమవుతారో- తెలీదు. వాస్తవానికి ఈ 'ఆధ్యాత్మిక' ప్రయోజనాలు గోల్వాల్కర్ పోజుమాత్రమే. ఆయన సిద్ధాంతం 'ఆధ్యాత్మికం' కావచ్చునుగాని, లక్ష్యం చాలా లౌకికం. ఆ లౌకిక ప్రయోజనమేమిటంటే, "మనందరి తల్లిగా మనం పరిగణించే ఈ సమాజం చాలా గొప్పదిగానూ శక్తివంతంగానూ తయారయ్యేలాగ చూడడం". ఇది మనందరి 'ధర్మం' అన్న సరికొత్త ఆలోచనను గూడ ప్రవేశపెడతాడు. అది మనుధర్మశాస్త్రంలోగానీ భగవద్గీతలోగాని లేదు, ఉండడానికి ఆస్కారం లేదు. బ్రహ్మజ్ఞానం సంపాదించడానికి జాతీయశక్తి అపరిమితం కావలసిన అవసరం లేదు. అసలు జాతీయశక్తి అన్న ఆలోచనే ధర్మశాస్త్రాలుపుట్టిన భూస్వామ్యసమాజానికి చెందదు. అది ఆధునిక బూర్జువా జాతీయవాదంలోనే పుట్టింది. అది అపరిమితం కావడం అంటే భారత పాలకవర్గాలు ప్రపంచ దోపిడీవర్గాల అగ్రశ్రేణిలో చేరడం అని అర్థం. దానికోసం అందరూ తమ సహజకర్మను అనుసరించి గొడ్డుచాకిరీచేయాలి. గోల్వాల్కర్ చేతిలో హిందూ ధర్మం తీసుకున్న బూర్జువా రూపంఇది. ఏ ధర్మాన్నయితే శ్రీకృష్ణుడూ మనువూ 'మోక్షాన్ని' ఎరగా చూపి భూస్వామ్య సమాజంలో వర్గసామరస్యాన్ని సాధించడానికి ఉపయోగించారో ఆ ధర్మాన్నే ఆ పాత ఎరలసరసనే 'జాతిఉన్నతి' అనే కొత్త ఎరను చేరుస్తూ పెట్టు

బడిదారీ వర్గానికి అవసరమయిన వర్గసామరస్యాన్ని సాధించడానికి గోల్వాల్కర్ ఉపయోగించాడు. ఆ ప్రయత్నాన్ని క్లుప్తీకరించి ఈమధ్య ఇందిరా గాంధీ ఇస్తూన్న నినాదం: "శ్రమయేవజయతే" శ్రామికులు శ్రమిస్తే, శ్రమించడం తప్పవేరే ఆలోచనలేకుండ జీవిస్తే, అంతమేరకు బూర్జువావర్గానికి అంతర్జాతీయంగా తన ఘనతను నిలుపుకునే ప్రయత్నంలో విజయం లభిస్తుంది. నమ్మకం కుదరకపోతే 'జాతికి చాలాఘనతను సంపాదించిపెట్టిన ఏసియాడ్ కోసం కట్టుబానిసలుగా శ్రమించిన బీహార్ ఒరిస్సా కూలీలనడిగితే చెప్తారు.

ఈ మాటలంటేనే ఇందిరా గాంధీకీ గోల్వాల్కర్‌కూ గూడ మంటపుడుతుంది. వర్గసిద్ధాంతం భారతీయం కాదంటారు. కాకపోతేఏం అని సమాధానంచెబితే అసలు వర్గాలు లేనేలేవంటారు. ఒక 'నవభారతి' ప్రచురణ నుండి ఉటంకించాలంటే, ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు, అనేది స్థితిమాత్రమే, వర్గంకాదు. సంతోషం. మార్క్సిజం గూడ ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు అనేవి వర్గాలనడంలేదు. శ్రమచేసేవాళ్ళు, ఆ శ్రమను దోచుకునేవాళ్ళు, అనేవే ప్రధానవర్గాలు. శ్రమచేసేవాళ్ళు సాధారణంగా లేనివాళ్ళు, శ్రమనుదోచుకునేవాళ్ళు అనివార్యంగా ఉన్నవాళ్ళు, కావచ్చు. అయినా ఉన్నవాళ్ళు - లేనివాళ్ళు అనేది శాస్త్రీయమయిన విభజనకాదు, ఎందుకంటే అది వర్గవిభజనయొక్క మూలాన్ని తాకదు.

శాస్త్రీయమో అశాస్త్రీయమో- ఏరకమయిన వర్గవిభజననూ ఆర్.ఎస్.ఎస్‌తత్వం సహించదు. ప్రపంచంలో ఉన్నది కేవలం జాతులే. ప్రతిజాతికీ తన సంప్రదాయాలు వగైరా వుంటాయి. జాతిలోపల ఏరకమయిన వర్గపోరాటాన్నీ సహించనట్టే జాతులమధ్య ఏరకమయిన సామరస్యాన్నీ గోల్వాల్కర్ సహించడు. హిందూ సంస్కృతే అన్నిటికన్నా ఉన్నతమయినది. ఆ సంస్కృతిని ప్రపంచానికంతా పంచిపెట్టడం (అంటే ప్రపంచాన్ని జయించి తనకు లోబరచుకోవడం) హిందూజాతి 'పవిత్ర కర్తవ్యం'. దేశంలోపల ధర్మం రాజ్యంచేస్తేనే, అంటే అందరూగూడ కిమ్మనకుండ తమ సహజకర్మలు నిర్వహించుకుంటూపోతేనే, ఈ 'పవిత్రకర్తవ్యాన్ని' దేశపాలకవర్గాలు నిర్వహించగలుగుతాయి.

గోల్వాల్కర్ చాలా స్థూలంగా వివరించిన ఈ సిద్ధాంతాన్ని వివిధ రంగాలకు అన్వయించి నిర్దిష్టరూపం ఇచ్చారు ఆయనగారి అనుచరులు. శ్రమచేయటం శ్రామికుల స్వధర్మం కాబట్టి సమ్మెల వంటివి ధర్మవిరుద్ధం. అయితే అసలే సమ్మెలు వద్దంటే వినేవాళ్ళు ఉండరు కాబట్టి దత్తోపంతో ఠేంగ్డీగారు సమ్మె పవిత్రయుద్ధంలాంటి

దంటే మరొకరు పాశుపతాస్త్రం లాంటిదన్నారు. శివుడి మూడవకంటి లాంటిదని ఇంకెవరయినా అంటే ఆశ్చర్యంలేదు. వజ్రాయుధాన్నీ పాశుపతాస్త్రాన్నీ చీటికీ మాటికీ ప్రయోగించలేదుగా, అట్లాగే సమ్మెలుగూడ చీటికీమాటికీ చేయకూడదు. బుడుగు భాషలో చెప్పాలంటే ఎప్పుడయినా చెయ్యాలన్నమాట. వజ్రాయుధంలాంటి ఆయుధాల్ని ప్రయోగించేముందు చిన్నపాటిజపం చేయడం సినీమాల్లో చూస్తూంటాం. బహుశా సమ్మె చేసేముందు గూడా సమ్మెదేవుడిని ఒకసారి జపించిచేయాలేమో, నాకుతెలీదు. విషయాన్ని మరింత విపులీకరించిన మరొక 'నవభారతి రచయిత, వర్క్-టు-రూల్ సరేగానీ గో-స్లో కూడదనీ, ధర్నా పర్వాలేదుగానీ ఘెరావ్ చేయకూడదనీ, పంచాంగం పంతుళ్లు బల్లిశకునాలు పిల్లిశకునాలూ చెప్పినట్టు చెపుతాడు. మరొక రచయిత యువకులకు నిర్మాణాత్మకమయిన కార్యక్రమాలే తప్ప రాజకీయాలు వద్దంటాడు. మరి ఆర్.ఎస్.ఎస్ ప్రజాసంఘాలయిన భారతీయ మజ్దూర్ సంఘంగానీ అఖిలభారతీయ విద్యార్థి పరిషత్‌గానీ ఈ నీతి సూత్రావళిని ఎన్నడయినా అనుసరించాయా అంటేలేదు. అందులో ఆశ్చర్యమూలేదు. ఫాసిజానికీ ప్రజాసంఘాలకూ చుక్కెదురు. అవసరంపడి ఫాసిజం ప్రజాసంఘాలు పెట్టుకోవలసివస్తే సిద్ధాంతానికి నీళ్లువదులుకోక తప్పదు. సమాజంలో సామరస్యమే తప్ప వైరుధ్యాలులేవని గోల్వాల్కర్ తన బ్రాహ్మణ పూర్వీకుల ధర్మశాస్త్రాలను పునరుజ్జీవింపజేసి ప్రవచించవచ్చునుగాని, భారతీయ మజ్దూర్ సంఘం దాన్ని పాటిస్తే ఒక్కరోజు గూడ కార్మిక రంగంలో నిలవదు. శ్రమచేయడం శ్రామికుల స్వధర్మం అని భగవద్గీతలోనూ ధర్మశాస్త్రాలలోనూ చాలా తెలివిగా సిద్ధాంతం చేసారుగాని దాన్ని ఎన్నడయినా శ్రామికులలో ఎంతమంది ఆమోదించారో అనుమానమే. ఫ్యూడల్ కాలంలో ఎట్లాగున్నా, ఇవ్వాళ గ్రామాలలో గూడ నమ్మడంలేదు, ఇకపట్టణాల కార్మికుల సంగతి చెప్పనవసరంలేదు.

అయినా ఆర్. ఎస్. ఎస్ ప్రజాసంఘాలున్నది తమ వర్గసామరస్య సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడానికికాదు, తాముశించే 'జాతిఐక్యత కు ప్రధానశత్రువులుగా కనబడే ముస్లింలనూ కమ్యూనిస్టులనూ అణగదొక్కడంకోసమే. ఆర్. ఎస్. ఎస్‌ను కేవలం మతోన్మాదసంస్థగా రివిజనిస్టులు ప్రచారంచేయడంవల్ల దాని ముస్లిం వ్యతిరేకత ప్రాచుర్యంపొందిందిగాని, దానిది ఫ్యూడల్ హిందూతత్వంకాదు, ఫాసిస్టు హిందూ జాతీయవాదంఅని గుర్తిస్తే, అది అన్యమతస్థులయిన ముస్లింలకు ఎంతటి శత్రువో, అంతర్జాతీయతావాదులు, అంతకంటేముఖ్యంగా వర్గపోరాట సిద్ధాంతాన్ని ఆమోదించేవాళ్ళు, అయిన కమ్యూనిస్టులకుగూడ అంతశత్రువని అర్థమవుతుంది.

ముస్లింలగురించి ఆర్, ఎస్. ఎస్. అభిప్రాయాలను కొత్తగా వివరించనక్కరలేదు. జాతీయోద్యమంలో ముస్లింలపాత్రను చర్చిస్తూ గోల్వాల్కర్ ఈ విధంగాఅంటాడు. "వాళ్లు ఈదేశంమీదికి దండెత్తి వచ్చారు, గత 1200 సంవత్సరాలుగా తమ్మతాము విజేతలగాను పాలకులగాను పరిగణించుకుంటున్నారు. ఆభావన వాళ్ళ ఆలోచనలలో ఇంకా చెరిగిపోలేదు.... హిందువులపట్ల వాళ్ళ వ్యతిరేకత ఎంత లోతయినదంటే: మనం దేన్నివిశ్వసిస్తే ముస్లింలుదాన్ని సంపూర్ణంగా ద్వేషిస్తారు. మనం గుడిలో ఆరాధిస్తే వాళ్లు ఆగుడిని అపవిత్రంచేస్తారు, మనం భజనలుచేసినా రథోత్సవాలు నిర్వహించినా వాళ్ళకు అసహనం కలుగుతుంది. మనం గోవునుపూజిస్తే వాళ్ళకు దానిని తినాలని కోరికపుడుతుంది. మనం స్త్రీని పవిత్రమయిన మాతృత్వానికి సంకేతంగా ఆరాధిస్తే వాళ్ళకు ఆమెను చెరచాలని కోరికపుడుతుంది". చివరికి ఎంతదూరం పోతాడంటే, దేశంలోని ముస్లింలు తమతాత ముత్తాతల కాలంనుండీ ఇక్కడే ఉంటున్నా వాళ్ళను భారతీయులుగా పరిగణించగూడదని చెబుతూ ఒకకథచెపుతాడు. ఒక జర్మన్‌కుటుంబం ఇంగ్లండుకు వలసపోయి 19వ శతాబ్దం మొదట్లో స్థిరపడ్డారట. మూడుతరాల తరువాత ఆ వంశానికి చెందిన ఒకవ్యక్తి బ్రిటిష్ అధికారిగా భారత దేశంలో పనిచేయడానికి వచ్చాడు. ఇంతలో ఇంగ్లండుకూ జర్మనీకీమధ్య మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమయింది. బ్రిటిష్ ప్రభుత్వం వెంటనే ఆ ఉద్యోగిని తొలగించి యుద్ధంఅయిపోయేదాకా ఖైదుచేసింది. 100 సంవత్సరాలుగా బ్రిటన్‌లో జీవిస్తున్నప్పటికీగూడ జర్మనీతో యుద్ధంరాగానే జర్మనీకి గూఢచారిగా పనిచేస్తాడేమో నన్న అనుమానంతో అతన్ని ఖైదుచేసిన బ్రిటిష్ ప్రభుత్వాన్ని అనాగరికమని అసహ్యించుకోవడానికి బదులు మెచ్చుకుంటూ, "వాళ్ళకు అర్థమయింది, అసలుజాతీయ వాదమంటే ఏమిటో" అంటాడు. దీనితాత్పర్యం ఏమిటంటే, పాకిస్తాన్‌తో యుద్ధంవస్తే దేశంలోని కోట్లాదిముస్లింలను జైళ్ళలోవేయాలని.

ఈ ముస్లింద్వేషంతో సమంగా, నిస్సిగ్గుగా, ప్రదర్శించుకున్నది సోషలిస్టు ద్వేషం. చివరికి వినోభావేనడిపిన 'భూదాన్' ఉద్యమం అనబడే ఫార్సునుగూడ 'దున్నేవాడికే భూమి' అనే కమ్యూనిస్టునినాదాన్ని ప్రచారంచేస్తోందని గోల్వాల్కర్ వ్యతిరేకిస్తాడు. "సోషలిజం ఈ గడ్డన పుట్టిందికాదు, అదిమన రక్తంలోగాని మన సంప్రదాయంలోగాని లేదు.... ఇక్కడున్న కోట్లాదిప్రజల ఆలోచనలకు అది పూర్తిగా భిన్నమయినది. కాబట్టి మన హృదయాలను కదిలించేశక్తిగాని, నిమగ్నతతో పనిచేసే ఉత్తేజాన్ని-ఇచ్చేశక్తిగాని, దానికిలేవు". కావలసింది సోషలిజంకాదు,

శ్రమను గౌరవప్రదంగా భావించడం (dignity of labour). శ్రమచేయడం తక్కువ అని భావిస్తేనేగదా, చేయనివాళ్ళనుచూసి ఈర్ష్యపడడంగాని ద్వేషించడంగాని జరిగేది? శ్రమను గౌరవించడం నేర్చుకుంటే, కూర్చునితినడమే కాదు, శ్రమించడం గూడ (వారివారి స్వధర్మాలకు అనుసరించి) భగవంతుడిని భిన్నరూపాలలో ఆరాధించడమేనని గుర్తిస్తే, ఇక సోషలిజందేనికి? Dignity of labour అనే మాటకు ఇంత వక్రీఅర్థం ఇవ్వడం చాలా ఘనమయినవిషయం. కనీసం అందుకయినా గోల్వాల్కర్‌కు జోహార్లు చెప్పాలి!

గోల్వాల్కర్ ఏమనుకున్నా, ఈ దేశంలో ప్రజలు మాత్రం శ్రమచేయడం తమ ధర్మమనీ, తమశ్రమను దోచుకోవడం ఇతరుల ధర్మమనీ అనుకోవడంలేదు. అదిగుర్తించే, సోషలిజం మనరక్తంలో లేదనిప్రకటించిన గోల్వాల్కర్ శిష్యులు ఇవ్వాళ 'గాంధియన్ సోషలిజం' గురించి మాట్లాడుతున్నారు. సమ్మెను పాశుపతాస్త్రంగా పరిగణిస్తే భారతీయ మజ్దూర్‌సంఘానికి మనుగడలేనట్టే. సోషలిజం ఈ దేశప్రజల ఆలోచనకు చాలాదూరమని అనుకుంటే అటల్‌బిహారీ వాజ్‌పేయీకి ఈ దేశరాజకీయాలలో మనుగడవుండదు. అందుకే ఆర్. ఎస్. ఎస్. చెప్పేది ఒకటీ, ఆర్. ఎస్. ఎస్ అనుచరులు చేసేది మరొకటీనూ.

విప్లవ జాతీయవాదం

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన జాతీయోద్యమంలో బూర్జువా జాతీయవాదమే కాకుండ విప్లవజాతీయవాదం గూడ వుంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదపు ప్రత్యక్షపాలనను తొలగించి బడాబూర్జువావర్గం చేతిలో పాలనను పెట్టడం బూర్జువా జాతీయవాదమయితే, స్థానిక దోపిడీకి వ్యతిరేకంగా కదిలిన ప్రజలే సామ్రాజ్యవాదాన్ని సహితం తొలగించగలరన్నది విప్లవ జాతీయవాదం. 'దేశభక్తి' పేరిట వర్గవిభేదాలనూ వైషమ్యాన్నీ మరుగుపరచి బలవంతపు 'జాతీయఐక్యత'ను సాధించడం బూర్జువా జాతీయవాదమయితే, జాతిలో శ్రమదోపిడీ అంతమయిన తరువాతే జాతీయఐక్యతగానీ దేశభక్తిగానీ సాధ్యమన్నది విప్లవజాతీయవాదం. భూస్వాములూ మన సజాతీయులే కాబట్టి వాళ్ళను వ్యతిరేకించవద్దన్నది బూర్జువా జాతీయవాదమయితే, భూస్వామ్యవ్యతిరేక పోరాటం చేయనిదే ఈ జాతికి దాస్య సంకెళ్లు విడవని గుర్తించింది విప్లవ జాతీయవాదం. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం శ్రమదోపిడీని అంతంచేసే పోరాటంలో ఒకభాగం మాత్రమే. ఇది విప్లవ జాతీయవాదపు సారాంశం. తద్విరుద్ధంగా, విదేశీపాలనను అంతంచేసి నల్లదొరలను పీఠం ఎక్కించేది బూర్జువా జాతీయవాదం.

బూర్జువా జాతీయవాదానికి కాంగ్రెస్ నుండి ఆర్.ఎస్.ఎస్ వరకు అన్నిసంస్థలూ ప్రాతినిధ్యంవహించాయి. ఇందులో కాంగ్రెస్‌కూ ఆర్.ఎస్.ఎస్‌కూ తేడాస్వల్పం. 1946లో నావికాసిబ్బంది బొంబాయిలో తిరుగుబాటు చేసినప్పుడు కాంగ్రెస్ నాయకుడు మౌలానా ఆజాద్, "ఇది సమ్మెలకూ తిరుగుబాట్లకూ సమయంకాదు" అన్నాడు. అధికారం కొంత అప్పటికే చేతికివచ్చి ఇంకా ఎక్కువ త్వరలో రాబోతున్న భారత బూర్జువా వర్గానికి అది సమ్మెలకూ తిరుగుబాట్లకూ సమయంకాదు, 'దేశభక్తి'కి మాత్రమే సమయం. బ్రిటిష్ ప్రభుత్వం విధించినపన్ను కట్టవద్దని అడపాదడపా కాంగ్రెస్ పార్టీ రైతులకు నినాదం ఇచ్చిందిగానీ భూస్వాములకు కౌలు చెల్లించవద్దనో వెట్టిచాకిరీ చేయవద్దనో ఎన్నడూ పిలుపునివ్వలేదు. 1936 వరకు కాంగ్రెస్ పార్టీ తన తీర్మానాలలో కౌలు తగ్గింపు గురించికూడ ఎన్నడూ మాటాడలేదు. బ్రిటిష్ ప్రాంతంకాక 'భారతీయ' రాజ్యాలలోవున్న ప్రజలలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ చైతన్యాన్ని కలిగించడంలో చాలా ఉదాసీనంగావుంది. ఎందుకంటే మైసూర్‌మహారాజా భోపాల్‌నవాబూ 'మనవాళ్లే' కాబట్టి.

విప్లవ జాతీయవాదానికి ఎవరు ప్రాతినిధ్యం వహించారంటే చెప్పడంకష్టం. కమ్యూనిస్టులు ప్రాతినిధ్యంవహించారని చెప్పడం రెండురకాలుగా చరిత్రను వక్రీకరించడం అవుతుంది. కమ్యూనిస్టుపార్టీ పత్రికలలోనూ తీర్మానాలలోనూ నాయకుల ఉపన్యాసాలలోనూ విప్లవ జాతీయవాదం మెండుగా లేకపోలేదుగాని, ఆచరణలో ఒక బెంగాలులోనో ఒక తెలంగాణాలోనో ఒక వర్లీలోనో ఒక కాసరగోడ్‌లోనో తప్ప దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీ వ్యూహంలో అది ఛాయామాత్రంగానే కనబడుతుంది. అంతకంటే ముఖ్యంగా, భారతదేశంలో విప్లవ జాతీయవాదానికి బీజాలు కమ్యూనిస్టు పార్టీ పుట్టుకకు ఏడెనిమిది దశాబ్దాలు పూర్వమే ప్రజాపోరాటాలలోపడ్డాయి. నీలిమందు ఎస్టేట్ యజమానులమీద తిరగబడ్డ తూర్పుబెంగాల్ ముస్లిం రైతాంగం, రంగ్‌మహాల్ కొండలోయల్లో జమీందారు మీద తిరగబడ్డ సంథాల్ గిరిజనులు, బ్రిటిష్ ప్రభుత్వ అధికారాన్నే ఎదిరించిన బాఘ్‌రాజ్యపు కామందులూ, బ్రిటిష్ రెవెన్యూ పద్ధతి ప్రవేశపెట్టిన దోపిడీపై తిరగబడ్డ రంపప్రాంతపు గిరిజనులూ- వీళ్ళందరి ఆచరణలోనూ విప్లవ జాతీయవాదానికి (ఎంత అస్పష్టంగానయినా కానివ్వండి) బీజాలు ఏర్పడ్డాయి.

తూర్పుబెంగాల్‌లో 1831లో 'వహాబీ' తిరుగుబాటులో పాల్గొన్న ముస్లిం రైతాంగం జమీందార్లకూ బ్రిటిష్ ప్రభుత్వానికీ తేడాచూపలేదు, జమీందార్లు 'భార

తీయులే గదాలని వదిలిపెట్టలేదు. అలాగని ఆ జమీందార్ల మనుగడకూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికీ ఉన్న సంబంధాన్ని విస్మరించలేదు. విపరీతమయిన శిస్తువసూలు చేయడమే కాకుండ హిందూపండుగలకు ముస్లింరైతులనుండి బలవంతపు కానుకలు వసూలుచేయడం అలవర్చుకున్న జమీందార్లపై తిరగబడి, ఆ తిరుగుబాటుకు కొనసాగింపుగా కొందరు బ్రిటిష్ నీలిమందుఎస్టేట్ యజమాన్ల కారానాలను ఆక్రమించుకోవడమే కాకుండ, నార్కేల్‌బారియాను కేంద్రంగా ఒక విముక్తప్రాంతాన్ని ఏర్పరిచి (చాలా తాత్కాలికంగానే కానివ్వండి), బ్రిటిష్‌పాలన ఇకచెల్లదనీ, ఏ ముస్లింల నుండయితే బ్రిటిష్‌వాళ్లు పరిపాలనను చేజిక్కించుకున్నారో ఆ ముస్లింల పాలన తిరిగి నెలకొల్పబడాలనీ ప్రకటించారు. ఇది కొంతమేరకు తిరోగామి ఆలోచనే. కాని విప్లవ జాతీయవాదంనుండి పుట్టింది. దోపిడీని వ్యతిరేకించే పోరాటమూ జాతి విముక్తి కోసం జరిగే పోరాటమూ విడదీయరానివన్నది విప్లవ జాతీయవాదానికి పునాది. ఆ అర్థంలో వహాబీ తిరుగుబాటు భారతదేశపు విప్లవ జాతీయోద్యమంలో మొదటి మెట్టులాంటిదనవచ్చు. ఆ తరువాత జరిగిన రైతాంగ, గిరిజన, కార్మిక ఉద్యమాలన్నింటిలోను ఈ వైఖరి ఏదోకొంత మేరకు కనిపిస్తుంది.

జాతివిముక్తినీ శ్రమదోపిడీనుండి విముక్తినీ విడదీయ నిరాకరించే విప్లవ జాతీయవాదాన్ని, శ్రమదోపిడీని సంరక్షించడం తన ముఖ్యకర్తవ్యంగాగల బూర్జువా జాతీయవాదం సహించలేదు. ఆశ్చర్యకరమయిన విషయమేమిటంటే, ఆ అసహనం అన్నిదేశాలలోనూ బూర్జువా జాతీయవాదం విప్లవజాతీయవాదాన్నీ, సోషలిజాన్నీ, 'దేశద్రోహం' అనే దూషించింది. గోల్వాల్కర్‌కూ అయెతుల్లా ఖొమైనీకీ వేరే ఏ విషయంలోనూ పొసగదుగానీ, ఇద్దరూగూడ తమదేశాలలోని వామపక్షభావాలుగల వాళ్ళను 'విదేశీతొత్తుల'నీ, 'దేశద్రోహుల'నీ వామపక్షభావాలను 'విజాతీయ' భావాలని 'విదేశీయులకుట్ర' అనీ దూషించారు. అమెరికాలోగూడ లెఫ్టిస్టు కార్యకలాపాలను అమెరికనేతర కార్యకలాపాల (un-American activities) కిందే నిషేధించారు. భారతదేశంనుండి ఇరాన్‌దాకా, ఇరాన్‌నుండి అమెరికాదాకా; మరొకరకంగా చెప్పాలంటే బ్రాహ్మణ గోల్వాల్కర్‌నుండి షియామతాధికారి ఖొమైనీదాకా, మతాధికారి ఖొమైనీనుండి 'ప్రజాస్వామిక' వాది మెకార్తీదాకా, అందరికీ వామపక్షభావాలు 'లాల్‌గులామీ' గానే కనబడాయంటే అది కాకతాళీయం కాదు. బూర్జువా జాతీయవాదానికి విప్లవజాతీయవాదాన్ని సోషలిజాన్ని వ్యతిరేకించడానికి ఇంతకుమించిన ఆయుధంలేదు.

ఏప్రిల్ థీసిస్!

అమరజిత్ చందన్

సంతోష సమయాల శిశువులం మేం
తిండిని ప్రేమించినంతగా స్వేచ్ఛను ప్రేమించిన వాళ్ళం
జీవితంలోకి దాని సమస్త జీవంతోటీ
వేళ్ళల్లా పాకి పోదలుచుకున్న వాళ్ళం మేం
కాని
మా చేతుల్లోకి వచ్చిందంతా
గ్రహణంపట్టిన సూర్యునిలాగ సగం సగం.
ఇప్పుడు మేం మీతో మాట్లాడదలచుకున్నాం
మా ఎన్‌కౌంటర్ల గురించి పత్రికల్లో చదివేవాళ్ళతో మాట్లాడదలచుకున్నాం
మా చావులపట్ల విచారించిన వాళ్ళతో మాట్లాడదలచుకున్నాం
ఇదంతా ఎక్కడ ముగిసిందో
అక్కడి నుంచి మొదలుపెడతాం

77 మార్చి 7న మానూకె నుంచి చనా[1] వార్తలు తీసుకొచ్చాడు
త్వరలోనే మరెన్నో వార్తలుంటాయనే వార్త తెచ్చాడు
కానీ మేం మరింక వార్తలకోసం ఎదురుచూడలేదు
వార్తలకోసం ఎదురుచూడడమంటే
ఇంకో కామ్రేడ్ చావుకోసం ఎదురుచూడడమే.
ఆ తర్వాత ఓరోజు భోజ్‌పూర్ నుంచి గంభీరా వచ్చాడు
ఆయన బట్టలనిండా రక్తంమరకలూ, వార్తలధూళీ.
ఆయనొచ్చాక మేమందరమూ కలిసి కూచున్నాం
చారుమజుందార్ చుట్టపీలుస్తూ ఏకాగ్రంగా కూచున్నాడు
(ఆయనింకా ఆక్సిజన్ సిలిండర్ తగిలించుకునే ఉన్నాడు)
బాబా భుజాసింగ్ అకాలీ తలపాగా చుట్టుకొని ఇంకా మారువేషంలోనే ఉన్నాడు
'నేను పోలీసుల కమ్ముడుపోయానని
ప్రచారం చేసిన ఆవెధవలెవరీ?' అని
ఆయన ప్రశ్నించాడు
అక్కడే ఓ కార్మికుడు కూడా చతికిలబడ్డాడు.
ఆయన ఒక్కమాటకూడా పొల్లుపోకుండా వింటున్నాడు

బహుశా మీకు గుర్తుండే ఉంటుంది.
ఆ కార్మికునికి సరిగ్గా 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనడం కూడా రాకపోయేది
ఎప్పుడూ ఇంఖిలాస్ జిందాబాగ్, జిందాబాగ్ అంటుండేవాడు
పరిస్థితులు అట్లాంటివి.
అతను ఓ మొహిత్‌సేనో, ఓ సంబూదిరిపాదో, ఓసత్యనారాయణసింగో కాదేటంగదా,
గంభీరా వివరించాక
ప్రతి ఒక్కళ్ళమూ ఆత్మవిమర్శ చేసుకున్నాం

2

మేం నిజంగానే పెటీబూర్జువా పిడివాద వామపక్ష సెక్టేరియన్ నియోట్రాట్స్కీయిట్ మూర్ఖులమే
మేం మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనావిధానాన్ని అర్థంచేసుకోలేకపోయాం
అందువల్లనే మేం అవకాశవాదాన్ని విప్లవ ఎత్తుగడగా మార్చలేకపోయాం
మేం నిజంగానే చాలా అసహనం ప్రదర్శించాం
మేం ఇంకో ఏడేళ్ళు ఆగి ఉంటే
భారత ప్రజానీకమంతా
కాశ్మీర్ నుంచి కన్యాకుమారిదాకా, పంజాబ్ నుంచి అస్సాందాకా
'ఢిల్లీచలో' అని ఎలుగెత్తి నినదిస్తూ
కామ్రేడ్ సత్యనారాయణసింగ్ నాయకత్వంలో కదిలేవారే[2]
సూర్యుడు తూర్పునే ఉదయిస్తాడని మేం మరిచిపోయాం
1977నుంచి సూర్యుడు పార్లమెంట్‌లో కూడా ఉదయిస్తాడని మాకుతెలియకపోయింది
శక్తినంతా కూడ దీసుకుని
చావుకేకలు వేసీ, చిట్టచివరిసారి నినాదాలు చేసీ
చీకట్ని పోగొడ్తామనుకోవడం మా సాహసికత్వమే
ఇప్పుడు మాకు అసలు నిజం తెలిపింది
చీకటి ఎన్నడో ఓనాడు పోతుంది
తొందర్లోనే కానీ, ఆలస్యంగా కానీ మొత్తానికి పోతుంది
మేం ఇంకో చైనాను తయారు చేయదలిచాం
మేం ఇంకో వియత్నాంను తయారు చేయదలిచాం
మేం ఇంకో కంబోడియాను తయారు చేయదలచాం
మేం ఇంకో భారతదేశాన్ని తయారు చేయలేకపోయాం

3

మా ఏకగ్రీవ నిర్ణయమేమంటే
మేం సత్యనారాయణ సింగ్ ఏప్రిల్ థీసిసు ఒప్పుకుంటున్నాం
అధికారం తుపాకి గొట్టంలోంచి రాదనీ,
బ్యాలట్ పెట్టెల్లోంచే వస్తుందనీ ఒప్పుకుంటున్నాం
ఇకమేం 11-029, లజపత్ నగర్, కొత్తఢిల్లీలో[3] ని స్థావరంగా చేసుకొని
దేశాన్ని చుట్టు ముడ్తాం.
మేం ఏప్రిల్ సూత్రీకరణను ఒప్పుకుంటున్నాం గనుక
మేమీ మృత్యువులాంటి జైల్లో
ఐదేళ్ళ కన్న ఎక్కువే గడిపాం గనుక
మేం కామ్రేడ్ సత్యనారాయణసింగ్‌కు ఓ విజ్ఞప్తి చేస్తున్నాం
మేం కామ్రేడ్ చరణ్ సింగ్‌కు ఓ విజ్ఞప్తిచేస్తున్నాం
మేమీ జైల్లోనుంచి బయటికి రాదలచుకున్నాం
మళ్ళీ ఓ సారి మేం
మా తల్లుల కాంతిహీనమైన కళ్ళలోకి రాదలచుకున్నాం
మా చిలిపి చెల్లెళ్ళ వేళాకోళాల్లోకి రాదలచుకున్నాం
మా నెచ్చెలుల శరీరాల వెచ్చదనంలోకి రాదలచుకున్నాం
మా భార్యల ఎండిపోయిన కన్నీళ్ళలోకి రాదలచుకున్నాం
నీళ్ళు నిండినకళ్ళలో నవ్వులు పూసే
మా పిల్లల బోసి నవ్వులోకి రాదలచుకున్నాం
మా స్నేహితుల్లోకి- మా చేతుల్లోకి రాదలచుకున్నాం
మళ్ళీ ఓ సారి మేం
మా ప్రజల నిరాశ నిండిన ఆశల్లోకి రాదలచుకున్నాం
మళ్ళీ ఓసారి ఇంకో భారతదేశాన్ని తయారుచేయడానికి
మేమీజైలునుంచి విడుదల కాదలచుకున్నాం
ఈ చారిత్రిక సంక్షోభ సమయాల్లో
మళ్ళీ ఓసారి మేం
మా జీవితాల్ని తుదికంటా జీవించదలచుకున్నాం

(31-8-77 న రాసిన ఈ కవితను పంజాబ్ పోస్టర్లుగా వేశారు)

---

1. ఒక నక్సలైట్ కార్యకర్త తమ్ముడు పంజాబ్ పోలీసులు చంపేశారు.
2. ఆగస్టు 1977లో న్యూఢిల్లీలో సత్యనారాయణసింగ్ ఇచ్చినఒకఉపన్యాసం
3. సత్యనారాయణసింగ్ ఇల్లు

ప్రజాపతులెవరు ?

టి. వి. శంకరం

"ఈ ఎన్నికలలో కాంగ్రెసు దేశాన్ని ఊడ్చేస్తుందని ముందుగానే జోస్యం చెప్పవచ్చు. అట్లా ఫలితాలు ముందుగానే తెలిసిపోయినప్పు ఎన్నికలు ప్రజాస్వామికంగా జరిగాయనవచ్చునా ? అనవచ్చు !"

ప్రస్తుతం మన దేశంలో జరిగే ఎన్నికలను గురించి ఒక అమెరికన్ పత్రికా వ్యాఖ్యానానికి పైమాటలు జ్ఞాపకానువాదం.

ప్రజాస్వామ్యం, ప్రజాతంత్రం, వోటింగుహక్కు, ప్రజాప్రభుత్వం. ఇటువంటి మాటలన్నీ వొట్టి హంబగ్ అని ఎవరైనా ఎలుగెత్తి అరిస్తే బాగుణ్ణు !

దీని శ్రార్థం పెట్ట ! ఈ ప్రపంచానకు కొన్ని ఊతపదాలు ఉండితీరాలి. రాగి డబ్బులాంటిది ప్రభుత్వ మింటులోంచి రాలేదని తోస్తే బిచ్చగాడు కూడా తిరగొట్టేస్తాడు. కాని ఈ కౌంటర్ ఫీట్ మాటలు చలామణీ కాకుండా ఆపగలవాడు కనబడడు.

ప్రజలు తమను తాము పరిపాలించుకోగలరా ? చచ్చినా పరిపాలించుకోలేరు ! కనీసం తమను ఎవరు పరిపాలిస్తే తమ జీవితం సాధ్యమైనంత సుఖంగా వెళ్ళిపోతుందో వాళ్ళకి తెలుసా ? చచ్చినా తెలీదు ! అథవా తెలిసినా అటువంటి వాళ్ళను వాళ్ల ఎన్నికలకు నిలబెట్టలేరు. అథవ ఒకరో ఇద్దరో నిలబడినా వాళ్ళు శాసనసభలకుపోయి ఏమీ చెయ్యలేరు.

ఈ దేశంలో గర్భదరిద్రులు నూటికి అధమం డెభ్భైయిమంది అయినా ఉంటారు. దేశమంతటా ఎన్నికలకు నిలబడేవారిలో ఒక్కడైనా గర్భదరిద్రుడుంటాడా? ఉండడు.

ఈ ఎన్నికలు పార్టీ నియంతృత్వం అమలు జరగటానికి ఏర్పాటైనవి. ఏ ప్రత్యేకప్రదేశంలోనైనా ఏక పార్టీ నియంతృత్వం సాధ్యంకాకపోతే, తెరవెనక భాగోతం జరిగి ఊళ్ళు పంచుకునే దొంగలు పదవులలోకి వస్తారు.

ప్రతి పార్టీ లోపలా మళ్ళీ నియంతలుంటారు; వాళ్ళు తాళ్లు లాగినప్పుడల్లా చేతులెత్తి కళ్ళనగాళ్ళు ఉంటారు. కొన్ని పార్టీలవెనక లంకెబిందెల వాళ్లుంటారు.

"ప్రజాస్వామికానికి" పట్టుగొమ్మలనదగిన పత్రికలలోనూ, ప్రజానాయకులమని చెప్పుకునేవాళ్ళనోటా వెలువడే కొన్ని ప్రవచనాలు చూస్తే వాంతి వస్తుంది.

"కాంగ్రెసును ఎన్నికలలో ఎదిరించేవాళ్ళు దేశద్రోహులు !"

"స్వతంత్రంగా నిలబడేవాళ్ళు దుష్టులు!" ఇక దేశభక్తులెవరు?

ఎన్నికలకు అభ్యర్థులను నిలబెట్టే అర్హతలేని కమ్యూనిస్టులు బహిరంగంగా బలపరిచే వాళ్లు!

"మా పార్టీ తరపున నిన్నటిదాకా దేశద్రోహుల పాత్ర నిర్వహించినవాళ్ళనూ, ప్రజాద్రోహులనూ, దోపిడీ ముఠాలవాళ్ళనూ నిలబెడుతున్నాం. మీరు వాళ్ళను చూసి వోటివ్వకండి. పార్టీని చూసి వోటివ్వండి! మీ ప్రతినిధి మీ భాషవాడు కాకపోవచ్చు, మీ దేశంవాడు కాకపోవచ్చు, అయినా పార్టీని చూసి వోటివ్వండి."

మాటలివికావుగాని, వైఖరి ఇదే!

మధ్యప్రదేశ్‌లో ఒక ముసలిది తన వోటును "నెహ్రూ కుమార్తెకు" వెయ్యటానికి నాలుగుమైళ్ళ దూరానఉన్న పోలింగ్ బూత్‌కు బయలుదేరిందట. "నెహ్రూ కూతురు" అభ్యర్థిగా నిలబడటంలేదని చెప్పారు; ముసలిది వోటు వెయ్యకుండా ఇంటికి తిరిగిపోయింది.

ఈ ముసలిదానికి తెలిసిన ప్రజాస్వామ్యం మీద నాకు చాలా గౌరవం ఉంది. తమకు కావలిసిన అభ్యర్థులులేని కారణంచేత ఉదయం ఎనిమిదిన్నరదాకా పోలింగ్ స్టేషనుకుపోని వోటర్లమీద నాకు గౌరవం ఉంది; అదే కారణంచేత అసలు వోటే వెయ్యని అసంఖ్యాకులకు ప్రజాస్వామ్యం తెలీదనటానికి ఎవరికీ అధికారం లేదు.

ఈ దేశంలో ప్రజాస్వామ్యం తలకిందికి పెట్టి కాళ్ళుపైకెత్తిన కారణంచేత అనేక విడ్డూరాలు జరుగుతున్నాయి.

జమీందార్లూ, రాజులూ, ధనికకామందులు, లంకెబిందెలవాళ్ళూ దేశంలో సోషలిస్టు వ్యవస్థ తెచ్చిపెట్టటానికి వీరకంకణంకట్టుకున్నారు; సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ సోషలిస్టు వ్యవస్థ స్థాపించటానికి బొత్తిగా పనికిరానివాళ్ళయిపోయారు!

ఒక్కొక్క పంచవర్షప్రణాళికే విజయం పొందుతున్న కొద్దీ విదేశీయుల లాభాలు పెరుగుతున్నాయి. విదేశీ పెట్టుబడి అంతకంతకూ హెచ్చుగా కావలిసి వస్తున్నది. ఒకవంక ధరలూ, ఇంకోవంక నిరుద్యోగమూ పెరుగుతున్నట్టుకనిపిస్తున్నది.

నామినేషన్లు ప్రజలనుంచేవచ్చి, ఎన్నికలలో ఓడిపోయినవాడికి ధరావతులు పోవటం, చేతిచమురు దండుగ కావటం మొదలైన అవమానాలు అవసరం లేకుండా

పోయి, ఎన్నికైన అన్ని పార్టీలవాళ్ళనూ పాలకవర్గంలో ఉండనిచ్చిన రోజున ఈ దేశంలో కొంత ప్రజాతంత్రం అమలుజరుగుతుంది.

(ఇంచుమించు ఇదే పద్ధతిలో ఆలోచనచేసిన ఇండొనీషియా అధ్యక్షుడి సూచనను తోసి అవతల పారేశారు!)

ఏ కారణాలవల్లనైనా మన దేశంలో పార్టీ నియంతృత్వమే తప్ప ప్రజాతంత్రం అమలు జరగటానికి వీలులేనిపక్షన ఆమాట స్పష్టంగా గుర్తించటం మంచిది.

"గులాబీకి ఇంకే పేరన్నాపెట్టు, దానివాసన కమ్మగానే ఉంటుంది." అన్నాడు షేక్స్పియరు. ఇంకేదో పువ్వును గులాబీ అన్నంత మాత్రాన అది గులాబీవాసన పుట్టుకుకొట్టదు.

ఇప్పుడు అమలులో ఉన్నదాన్ని ప్రజాతంత్రం అనవద్దు.

పార్టీ ప్రతినిధులను ప్రజాప్రతినిధులనవద్దు. నూటికి యాభైమంది వోటు చేస్తే అందులో ముప్ఫైమంది వోట్లు తెచ్చుకుని అఖండ విజయంతో నెగ్గినవాడు ఏ లెక్కన ప్రజాప్రతినిధిఅవుతాడు?

భవిష్యత్తులో ప్రజలకు ఏమి చెయ్యబోయేదీ చెప్పకుండా జరిగిన చరిత్ర ఆధారంమీద వోట్లు అర్థించేవాళ్ల వాగ్దానాలుచేసేదీ లేదు, వాటిని నిలబెట్టుకునేదిలేదు.

ఒక పార్టీ టిక్కెట్టుమీద ఎన్నికైనవాడు మళ్ళీ ఎన్నికలు జరిగేలోపల మూడు పార్టీలు మారడనిలేదు!

పదవికోసం చెయ్యరానిది లేదు అన్నవైఖరి అమలులో ఉండగా ప్రజాతంత్రం అమలులోకి రావటం సాధ్యంకాదు.

కాంగ్రెస్ పార్టీ నియంతృత్వంకూడా అవసరంలేదు. నెహ్రూ నియంతృత్వానికి అనుకూలంగానూ, ప్రతికూలంగానూ దేశమంతటా ప్రజలను వోట్లు వెయ్యమంటే అధికసంఖ్యలో ప్రజలు నెహ్రూకు అనుకూలంగా వోటు చెయ్యవచ్చు! అటువంటి పరిస్థితి దేశంలో లేదనటానికిలేదు.

ఈ సంగతి గుర్తించేకాబోలు మద్రాసులో ఒక కాంగ్రెస్ ఎన్నికల పోస్టరుమీద స్థానిక కాంగ్రెస్ అభ్యర్థుల బొమ్మలకుబదులు నెహ్రూ బొమ్మను వేశారు!

చాలామందికి బలమైన ప్రతిపక్షంలో విశ్వాసము ఉన్నట్లు కనబడుతుంది.

సిద్ధాంతం ప్రకారం పార్టీ నియంతృత్వం అదుపులో ఉంచటానికి బలమైన ప్రతి పక్షం ఉపకరిస్తుంది.

అయితే ఈ పుణ్యభూమిలో అటువంటి శషభిషలు పనికిరావు. కాంగ్రెస్ ప్రభుత్వాలు తెచ్చిపెట్టిన బిల్లులు తీవ్రమైన విమర్శలకు గురిఅయికూడా, ఆ విమర్శలలో కాంగ్రెస్ సభ్యులేపాల్గొని కూడా, పశుబలంతో (బ్రూట్ మెజారిటితో) బిల్లులు నెగ్గిన సందర్భాలున్నాయి.

"ఈ ఒక్కసారికి మమ్మల్ని స్వతంత్రంగా వోటు చెయ్యనివ్వండి," అని పార్లమెంటులో కాంగ్రెస్ సభ్యులు తమ నియంతలను వేడుకున్న సందర్భాలున్నాయి.. ఇదంతా అటువంటి దేశంలో ఒకరకమైన బ్లాక్‌మెయిల్ అమలులో ఉన్నది. నెహూ్రు పండితుడే అనేక ప్రాంతాల దేశంయొక్క ఐక్యత గురించి మాట్లాడాడు. అంటే ఆయన ఉద్దేశం; "మిగతా రాష్ట్రాల్లో మేమే గెలుస్తాం; మీరు ఇంకో పార్టీని గెలి పించకండి!" అనా?

నిజానికి రాష్ట్రాలలో ఏ పార్టీవాళ్ల గెలిచినా పార్లమెంటులో కాంగ్రెసుకు మెజారిటీ ఉన్నంతకాలం దేశంలో అన్ని ప్రాంతాల పరిపాలనా కాంగ్రెసుకు కావల సిన విధంగానే ఉంటుంది.

కొందరు ఇంకొక రకం దుష్ప్రచారం చేస్తున్నారు. "మన రాష్ట్రంలో కాంగ్రె నేతరులు గెలిచారో, మనకు కేంద్రం గ్రాంటు లివ్వదు, ప్రాజెక్టులు కట్టదు, ఏమీ చెయ్యదు!" అంటున్నారు; పూర్వం బ్రిటిషు వాళ్ళకు కోపం తెప్పించవద్దని చెప్పిన వాళ్ళ ధోరణిలోనే!

ఇటువంటి మాటలు నమ్మేవాళ్లు లేనిపక్షాన అనేవాళ్లున్నా అంత ఇబ్బంది ఉండదు. కాని నమ్మేవాళ్లుండబట్టే అనేవాళ్ల అసటంకూడా జరుగుతుంది.

అన్ని రాష్ట్రాలలోనూ ఒకే పార్టీ గెలవటం రాజ్యాంగంరీత్యా అవసరంకాదు. అందుచేత అన్ని రాష్ట్రాలలోను ఒక పార్టీ పదవులు నిర్వహించే ఐక్యత ఐచ్ఛికం.

పైగా అన్నిరకాల ఐక్యతా మంచిదేననుకోవటం పొరపాటు. ప్రజాభిప్రా యాన్ని తృణీకరించి మరాఠీ గుజరాతీ ప్రాంతాలను ఏకంచేశారు. ఈ ఐక్యత ఏమంత సుఖప్రదంగా కనబడటంలేదు.

[15-3-1957 'తెలుగు స్వతంత్ర' సౌజన్యంతో)

కథ :

వెలి

కాలువ మల్లయ్య

అంబటాళ్ళయింది. కైకిలోల్లనుతీసుకొని పటేలప్పలు సేండ్లల్లకు పోతన్రు. మక్క పెరండ్లల్ల కలుపుమొక్కలు దున్నటానికి కాపుదనపోళ్ళు నాగండ్లను కాండ్లకు తిర్రిమర్రిగట్టి ఎడ్లతోని నడిపించుకపోతన్రు. పసులపోరగాండ్లు గొడ్లను మేపుటానికి సెలుకల్లకు తోలుకపోతండ్రు. అచ్చేపోయే సందడిలో బజారంతా గడబిడగా ఉంది.

నుక్కల్లోసెందుర్రిల్లా చిన్నచిన్న పెంకుటిళ్ళసదుమ అటుకిదొర. సర్పంచు ఐన భూంరావ్‌గారి మేడ. ఆమేడచుట్టూ విశాలమైనస్థలం, దాంచుట్టూ పెద్దపహారీ గోడ. ఆ గోడవతల బజారు. ఆబజార్లో మూలగాఒకగద్దె. ఆగద్దెపై పరిచినచాపలో ఆసమయంలో దొరకూర్చున్నడు. అతనికి ఓపక్క పోలీసుపటేలు, ఓపక్క పటావారి కూసున్నరు. గద్దెమీదనే చాపబయట కొందరు ఊరిపెద్దలు కూసున్నరు. గద్దెకింద ముంగాళ్ళమీదకొందరు తెనుగోళ్ళు కూసున్నరు. గద్దెకిందనే గద్దెపట్టుకొని తెనుగోళ్ళ కులపెద్ద దొంగసూపులుసూత్తూ కూసున్నడు. గద్దె సుట్టుపక్కల పంచాయతీ వినడానికొచ్చిన జనంతోనిండిఉంది, గద్దెనానుకొనివున్న వేపచెట్టును పట్టుకొని నర్సయ్య విచారంగ నిల్చున్నడు. అతనిముఖంలో ఆందోళనఉంది. భయంఉంది. ఏమౌతుందోనన్న ఆతురతఉంది. దైన్యంతాండవిస్తుంది. అసహనంగా అటు ఇటు కదులుతూ, మాటిమాటికి దొరవైపుచూస్తూ నేలకు ముఖంవేలాడేసుకుంటూ, దొర మాటకై ఎదిరిచూస్తున్నడు, వేపచెట్టు సమీపంలోఉన్న కరెంటుస్తంభందగ్గర నర్సయ్య కూతురు మల్లవ్వ నాలెకుమొకమేసుకొని భూదేవిలో లీనమయినట్లుగాఉంది. ఆమెముఖంలో ఆవేశం, క్రోధం, దుఃఖం, అవమానంతోకలిసిన భావాలు ద్యోతకమౌతున్నయి. ఆమె ఏమీచేయలేని నిస్సహాయురాలివలెవుంది. మల్లవ్వ కొంగు పట్టుకొని ఆమె ఆరేళ్ళకొడుకు రాజేశం మట్టిపెళ్ళ చేతిలోకితీసుకొని అటు ఇటు తిప్పుతూ కూసున్నడు. వాడు మాటిమాటికీ గద్దెవైపు చూస్తూ బిక్కు బిక్కుమంటున్నడు. గద్దెకు ఇంకోపక్కన రాజయ్య నిర్లక్షంగా, పొగరుగా ఐదారుగురు స్నేహితులతో నిల్చున్నడు. అతనిముఖంలో చురుకుదనముంది. దేనినైనా సాధించవచ్చుననే ఆత్మవిశ్వాసముంది. తానేమాత్రం తప్పుచేయలేదన్న భావముంది. ఏమైనాసరే ఎదుర్కొగలనన్న ధీమావుంది.

దొర బర్కిలీసిగరెట్టు దమ్ములాగి సరాయించిండు. పెద్దమనుషులవైపు తేరిపార జూసిండు. సూపును నర్సయ్య దిక్కు తిప్పిండు. "నర్సిగా! నీమీద నీ కులపెద్ద పిర్యాద్జేసిండు. నీ బిడ్డజేసిన పనేందిర గిట్లెక్కన్నస్న ఉంటాదిర" అన్నడు. జనం, పెద్దమనుషులు నర్సయ్య దిక్కు జూసిండ్రు. నర్సయ్యేం మాట్లాడలేదు. ఇంతలో "ముండబొడ్డికి మొగడు గావల్సచ్చినాదిర. దీని కావురంగాక పోతె" అన్నడు పోలీసుపటేలు.

నర్సయ్య ఏం జవాబు చెప్పలేదు. ఏం జవాబు చెప్పన్నా అని ఆలోచిస్తుండు. మల్లవ్వ ముఖాన్ని మరింత నాలె కేసుకుని కూసున్నది. రాజయ్య కోరమీసాలను మెలిపెడుతూ నిల్చున్నడు.

"అయా! కలీగం మునిగిపొమ్మంటె మునిగిపోదా యిగ. ముండబొడ్లు కడుపుల్జేసుకుంటె అసలు గొట్టుమంటె ఎట్లగొడుతయ్. దొర గిదీనికి పెద్దశిచ్చే ఎయ్యాలె. లేపోతే అన్నాలమైపోతది." అన్నడు కులపెద్ద. అయినా నర్సయ్యజవాబు చెప్పలేదు. ఏం జవాబు చెప్పన్నా అని గుణాయించుకుంటున్నడు.

"ఏందిర నర్సిగ బెల్లంగొట్టిన రాయోలె మాట్లాడుతలేవు ఇనవత్తలేదుర." అన్నడు పట్వారి.

నర్సయ్యలేచి జవాబు చెపుతామని తయారౌతున్నడు. ఇంతలో మళ్ళీ దొరే అన్నడు.

"ఇంతమంది సెప్పినా ఇనవత్తలేదుర. నువ్వేం సమదసం సెప్పుకుంటవో సెప్పుకో"

నర్సయ్య నెత్తిమీది రుమాలుతీసి సేతిలపట్టుకున్నడు. దొర కెదురుగనిల్చున్నడు "ఏం జెప్పాలె బాంచెను" అన్నడు.

ఏం జెప్పన్నని సంసారోలె మాట్లాడుతున్నవేందిర. పోర్ని జెన్నకిడసిపెట్టి ఏమెరుగనట్టు మాట్లాడుతవేందిర" అన్నడొక పెద్దమనిషి.

"గట్లంటెట్లరో నువ్వేం జెప్పకుంటె మేం జెప్పిందాని కొప్పుకుంటావుర. మల్ల మాట్లాడద్దు మరి" అన్నడు పట్వారి.

"గట్లెట్లయిద్ది బాంచెన్. కాని గిండ్లేం తప్పుందో నాకయితెతెల్తలేదు". అన్నడు నర్సయ్య

"సెప్పులోని కొట్టనుండె గాడిదికొడుకుసు. నీ బిడ్డ సక్కటిపనే సేసిందని మాట్లాడుతున్నావుర" అన్నడు వేరొక పెద్దమనిషి.

"సక్కటిపని సేసిందని నేనంటన్నన బాంచెను. కాని దానీదెంత బాంచెను. మాందె ఇరువైరొండేండ్లు. సిన్నప్పుడే పోరడుపుట్టిండు. ఇరువయేండ్లకే ముండ మోసె. అప్పట్నుంచి బతికినన్నిగాలాలు అదట్లనే ఉండన్నా బాంచెను. సెప్పుండ్రి దొరా సెప్పుండ్రి" అన్నడు సర్వయ్య దీనంగా.

"గదేందిరో వీరేశలింగమోలె మాట్లాడుతవ్. బతుకంత గట్లనే ఉండుమని ఎవలన్నరు. కాని మొగన్లేకుండ కడుపుజేయించుకునుడేందిర. గిది తప్పుగాదుర" అన్నడు దొర.

దొర మాటలు ఒకలిద్దరు పెద్దమనుషులకు బాధగలిగించినయి. మల్లవ్వ కన్నీళ్ళు కార్చుకుంటూ కూసున్నది.

"తప్పేగావచ్చు బాంచెను. అయిసులున్నపోరి ఏదో కాల్జారింది. అదేంకులం గానోనితోని పోలేదుగద. యాడాదినుంచి దీన్ని రాజిగాని కిత్తమని అనుకోనేవత్తిమి. ఇది అందరికి తెల్విందేనాయె. ఆడుగూడ లగ్గంజేసుకుంటాననవట్టె. ఇంక పంచాతెందుకు బాంచెను. కావల్తె ఇక్కన్నే ఉన్నడుగద రాజిగాడు. అన్నడగిండ్రి." అన్నడు సర్వయ్య.

"నిజమే దొర మల్లిని రాజిగానికి మారుమానం ఇత్తమన్నదేనాయె. సర్విగాని కెళ్ళక లగ్గంసేయలేదు. ఇంతల్నే పోరగండ్లు కాల్జారిండ్లు. అళ్ళకళ్ళకు అంటగట్తె ఐపాయె." అన్నడొక పెద్దమనిషి.

దొర ఆ పెద్దమనిషి దిక్కు ఉరిమిచూసిండు. ఆ పెద్దమనిషి తలవంచుకొని నేలసూపులు సూడబట్టిండు.

రాజయ్యను సూత్తెనే దొరకు, దొరతాబేదార్లకుభయం. వానికోరమీసాలు, వాడిచూపులు, నిర్లక్ష్యం ఆ ఊళ్ళోని పెద్దోళ్ళకు కొరకరాని కొయ్యలాంటివి. మెదలేవాడు పొగరుబోతు. దానికితోడు పక్కవూళ్ళోనూ, అపుడపుడు ఆ వూళ్ళోకి వస్తూ దొరల దోపిడీగురించి, అన్యాయాలగురించి సంఘపోళ్ళు చెప్పేమాటలతో వాడు మరింత రాటుదేలుతున్నాడు. రాజిగాన్నేమన్నా అంటే కోడెగాళ్ళలాంటి సోపతిదార్లతో ఎదురుతిరుగుతడేమోనని దొర భయం. ముసుపటీలుగ హుకుంచెలాయించి బెదిరిత్తే ఇనేటట్టులేడు. అందుకనే మెత్తగున్నట్టేవుండి సర్విగాన్నే బెదిరించి వెలివేసి

దండుగ గుంజాలని దొర ఆలోచిస్తుండు. దొర నర్సిగాడు రాజిగాన్ని తగుపన్నాగాని రాజిగానిదిక్కు చూడనేలేదు. నర్సయ్యనుద్దేశించే అన్నడు.

"కండ్లునెత్తికెక్కినాయిర తెనుగోడ. కులకట్టని, నీతినియమాలని ఉండద్దుర. ఎవలిట్లమచ్చినట్లు ఆళ్ళ లగ్గంగాకముందు, ముండబొట్లయినంక కడుపుజ్జేసుకుంటె నాయమెక్కడుందిర, బాక్కావురమచ్చింది, దొంగ...." ఏవో బూతు మాటలు తిట్టిండు. కాని తోవెంటబోతున్న కైలికోడెవేసిన రంకెలో ఆతిట్లు కలిసిపోయినయి.

రాజయ్యకు ఆవేశం ఉరకలువేస్తుంది. మాటిమాటికీ ముందుకు పోతున్నవాన్ని స్నేహితులాపుతున్నారు. స్నేహితులను దొబ్బుకొని ముందుకుపోబోయిండు. కాని ఇంతలో నర్సయ్యే మాట్లాడిండు.

నర్సయ్యకు దొర తిట్లతో కొంచెం కోపమచ్చింది. తెగినబొక్కెన సూతిల్లాక మంచిగనే మాట్లాడాలనుకున్నడు.

"కాద్దొర నాకు తెలుపకడుగుత. మేమ్మేం గంగలవడిసత్తం. మేమ్మెకు పిరాజ్జెయ్య లేదుగద ఎందుకు బాంచెను మమ్ముల కాల్చుకతింటరు. మా సందాన మమ్ముల బతుకనియ్యరు. కడుపయ్యింది నా బిడ్డకు, కడుపుజేసినోనికి పెండ్లమే లేదాయె. ఆళ్ళిద్దరికి లగ్గంనిచ్చయమెలయె ఇంక గీళ్ళందరు, గీ పంచాతులన్నెందుకో సముజయిత లేదు".

"నర్సిగ బాగా దూరమె పోతున్నవేంరో బలుపార" పట్వారి అన్నడు.

"ఇట్లమున్నట్లు మాట్లాడుతన్నవ్. ఇది పంచాతా ఏంటిదిరగాడ్దికె" పోలీసు పటేలు అన్నడు.

"నువ్ పిరాజ్జెయ్యకుంటేందిర. నీ పెద్దకులపోడు జెప్పిండు. ఆదేకద మీ యవ్వారమంత చూసేది లం...కొడుక నీకు బాగమత్తచ్చింది." దొర ఆవేశంగా అన్నడు.

ఇక రాజిగానికెంత ఆపుకుందామన్నా ఆవేశం ఆగలేదు. దొర ముందు కచ్చిండు. కులపెద్దదిక్కు చూసిండు. దొరనుద్దేశించి "ఆ లంజెకొడుకెవడు మా సంగతుజ్జెప్పటానికి, తాగినోడుగట్టె తాళ్ళపన్నది మేం తప్పుజేసుకుంటె మేమ్మేం సూసుకుంటం. నడుమ గానికేందట" అన్నడు ఆవేశంగా.

రాజిగాని మాటలువిన్న దొర ఖంగుతిన్నడు. యువకులంతా చప్పట్లుగొట్టిన్రు. పట్వారి, పోలీసుపటేలు, కుల[illegible] లేకపోయేసరికి[illegible].

నక్కల్లాకూర్చున్నరు. ఒకరిద్దరు పెద్దమనుషులకు ఆ మాటలు సంతోషం కలిగించి నయ్. కాని వాళ్ళు దొరకెదురు మాట్లాడలేరు. తుదకు దొరే అన్నడు.

'రాజిగా ! నేను నీతోని మాట్లాడుతలేను' నువ్వు నప్పుదుజేకుండు" అని పెద్ద మనుషుల దిక్కు తిరిగి "నలుగురున్నకాడ నాయముండంటరు. మీరేంజెయ్యమంటె అజ్ఞేత్త సెప్పుండ్రి; అన్నడు.

"నర్సిగానింటికి సాకలోన్ని. మంగలోన్ని బందుజేయాలె" పోలీసుపటేలు.

"నర్సిగాన్ని కులంలనుంచి ఎల్లగొట్టాలె" పట్వారి,

"నర్సిగానికి దండుగెయ్యాలె" ఒక పెద్దమనిషి. నానా విధాలుగాచెప్పి తుది నిర్ణయాన్ని దొరకే వదిలిపెట్టిండ్రి.

"పెద్దమనుషులందరి నిర్ణయాన్నిబట్టి సెప్పుతున్న. దీని కందరు కట్టుబడి ఉండాలె. నర్సిగా ! ఇసోంటి యిడిసిపెడితె కట్టులేకుంటపోతది. నిన్ను కులంనుంచి వెలేస్తున్నం. నీ ఇంటికి సాకలోడు, మంగలోడు బందు. కులపోళ్ళుగూడరారు. అచ్చినోనికి ఇన్నూరురూపాయల దండుగ" అన్నడు దొర.

ఆ తీర్పు అక్కడున్న కొందరు దొర చంచగాళ్ళైన పెద్దమనుషులకు తప్ప చాలమందికి నచ్చలేదు. ఆ తీర్పు అన్యాయమని అందరికీ తెలుసు. ఇలాంటి తీర్పు లెన్నోవాళ్ళు చూసిండ్రి. నడిపించే వాళ్ళెవరైనా ఉంటే వాళ్ళెదిరించడానికి సిద్ధంగా ఉన్నరు.

రాజయ్య కళ్ళు చింతనిప్పులయినయి. వానిస్నేహితులుకూడా ఆవేశంగానే ఉన్నరు. ఐనా ఏంజరుగుద్దో చూద్దామని ఎదిరిచూస్తున్నరు. ఆవేశంతో ఏదోమాట్లాడ బోయిన రాజయ్యనాపి నర్సయ్య "నువ్వాగెర రాజిగ- నేమ్మాట్లాడుత, కట్టిరిసినట్లు మాట్లాడుతెట్లర" అని "దొరా గట్లయితెట్లబాంచెను. మీరే ఆదుకోవాలె, గులాపోన్ని" అని దొరకాళ్ళు, పట్వారి, పటేలు, కులపెద్దలకాళ్ళు పట్టుకున్నడు. తన యువ మిత్రులతో రాజిగాడు అండగాఉన్నా తరతరాల బానిసత్వం నర్సయ్యచే ఆ పనిని చేయించింది. దొరఆశించిందికూడా అదే. వాన్ని కులంనుంచి వెలేస్తె తనకే మొస్తుంగి ? ఈపేరున బెదిరించి దండుగగుంజాలని దొరపథకం. దొర తాబేదార్ల ప్లానుకూడాఅదే. ఎనుకటికాలమయితే రాజయ్య పొగరుబోతు మాటలకు పెద్దశిక్షేవేసే వాడు దొర, కాని కాలమెట్లనోఉన్నది. కాలంతో మారినట్లుమారి డబ్బుగుంజాలని దొరప్లాను. వచ్చినఅవకాశాన్ని విడువకూడదనుకున్నడు.

"సరేపోరా! నీవింత బతిమలాడుత్తున్నవని ఇడిసిపెడ్తున్నం. కులతప్పుకింద ఐదునూర్లు కులపోళ్ళకు, పంచాయితిబోర్డుకు ఐదునూర్లు మొత్తం వెయ్యిరూపాయల దండుగగట్టి కులంలకురా! అటెనుక మల్లిని రాజిగానికిచ్చి మారుమనం చెయ్యి" అన్నడు.

దొర తాబేదార్లు సంబరపడ్డరు.

ఇక రాజయ్యలో ఆవేశంఆగలేదు. నర్సయ్యను ఎనుకకుగుంజిండు, "మామ! అట్లాగు. నేమ్మాట్లాడుత. ఎందుకుదొర దండుగగట్టాలె, ఐదునూర్లు పెద్దమనుషులకు, ఐదునూర్లతోని కులపోల్లు కల్లుదాగుతె పోయినకులమెట్లత్తది? కల్లులోని అచ్చేకులం పోతేందుంటేంది? ఏం తప్పుజేసినమని ఎయ్యిరూపాయలియ్యాలె ఎవడో నీ బాంచెగాడు మాకుతెలువకుంట పిర్యాజ్జేత్తె మాకేంది? ఆన్నెకట్టుమను దండుగ. మేమేం తప్పుజేయలేదు" అన్నడు ఆవేశంగా.

పరిజల్లో కలకలం బయల్దేరింది,

"రాజిగాడుసెప్పింది నిజమే. ఏం తప్పుసేయనపుడు దండుగెందుకు గట్టాలె?"

"అది ఆడు పెండ్లిజేసుకుంటనన్నంక నడుమ గీ దొరేంది?"

"రాజిగాడు భలే మాట్లాడిండు" నానావిధాలుగా పరిజలనుకోబట్టిండ్రు. దొర మొకం నల్లవడ్డది. వేపచెట్టుకొమ్మపైనుంచి గండుచీమొకటి దొర మెడలపైబడి కసిక్కున కొరికింది. చీమను దొరకబట్టబోయిండు. కాని అది తప్పించుకొని అంగి లోపలకుజొచ్చి వీపులకుట్టింది. చేసేదిలేక బనీనువదులుచేసి దులిపేసిండు. రాజయ్యకు అనుకూలంగా పరిజలనుండి వచ్చేమాటలనువిని దొర దిక్కులుచూసిండు. తన చేతికిందబతికే సుంకరోళ్ళుకూడా సంతోషంగనే ఉన్నరు. దొర ఆళ్ళమొఖంకేసి చూసేవరకు విచారంగ మొకంపెట్టి నాలెకుమొకమేసిండ్రు. పెద్దమనుషుల మొకాల్లో రక్తంలేదు. వానితోటిపెట్టుకుంటె యువకులతోని ఎగబడుతడు. కాలంమంచిగలేదు. గాలికిపొయ్యేకంపను ఎందుకు తలుగబెట్టుకోవాలె అని మౌనంగున్నరు. దొరకు కూడ లోపల భయంగనేఉన్నది. మేకపోతుగాంభీర్యంతో "....వళ్లచ్చినాయిర రాజిగ. సిన్నపెద్దభేదంలేద! నాయం అన్నాయం సూడద్ద?" అన్నడు.

రాజయ్య కొదమసింగంలా ముందుకొచ్చిండు. "నాయం, అన్నాయం! పరిజలను గొర్లంజేసి ఎన్నేండ్లేలుతరురాజ్జెం. దొంగనాకొడుకు కులపెద్దనుగబైకొని దండుగలుపెట్టిత్తమంటె ఇక్కడెవ్వల్లేరు ఇచ్చుటానికి. సరే నాతప్పే, కాని పెండ్లి గాకముందే బొత్తసేసుకొని దిగదాగిన నీబిడ్డకు ఏం దండుగగట్టినవ్? ముండమోసి ఇంట్లుండి పాలేర్తోని సాటుమాటుగ రంకుజేస్తున్న పట్వారి బిడ్డసంగతేంది? మీరు

జేత్తెనేమొ తప్పుగాదు, మేంజేత్తెతప్పా? మీకులాలు మీదగ్గర్నే ఉంచుకోండ్రి, రెక్కలకట్టంమీద బతికేమాకు ఏకులమైతేంది? ఏఊరైతేంది? ఏకులంలున్నా, ఏ ఊళ్ళున్నా, ఏపట్నంలున్నా మేం రెక్కలనమ్ముకొనే బతుకాలె. గట్లాంటప్పుడు నీకు దండగట్టి కులంలకు అచ్చుడెందుకు? ఈ ఊరుగాకుంటె ఇంకోఊరు, ఎక్కడున్నా మాకట్టంమాదే. ఐనా ఇక్కన్నే, ఈవూళ్ళనే తలకాయెగిరేసుకుంట బతుకుతఎవ్వలడ్డమత్తరో, ఎవ్వలెలేత్తరొసూత్త" అని నర్సయ్యదిక్కు తిరిగి "రా మామా! అణిగి మణిగిఉన్నకొద్దీ గిట్లనే సవారిజేత్తరు, కులంకులమని ఇడిపోతే మనండ్ల మనకే కొట్లాటపెడ్తరు. కట్టపడి బతికెటోళ్ళది, కూలోల్లది అంతాఒకటేకులం" అని ఒకసారి అందరిదిక్కు చూషింది. చాలామంది జనంనుంచి తనకు అనుకూలతే కనబడింది.

మల్లిదగ్గరికొచ్చింది "రాయే మల్లి. ఎందుకు భయపడ్తున్నవు? ఏం తప్పజేసిన్నని నాలెకు మొకమేసినవు? నాతోరా! నిన్నులగ్గంజేసుకుంట. నీకొడుకును నాకొడుకోలె సూసుకుంట"అని రాజేశంను వంకలెత్తుకొని, మల్లవ్వనొకచేత్తో పట్టుకొని దర్పంగా, పొగరుగా అడుగులేస్తూ పోసాగాడు రాజయ్య. ప్రజలందరూ అతడితో పాటే లేచి ఇండ్లకుబయలుదేరిండ్రు.

చెట్టుపై ఉడుత కిచకిచమన్నది. దొర, దొరచెంచాల ముఖాలు కందెనమసి పూసినట్టుగా తయారయినయి. చాలాసేపటికి తేలుకుట్టిన దొంగల్లా నెత్తిపై బట్టలేసుకొని ఇంటిదారి పట్టిండ్రు.

హిందీ కవిత

బుద్ధి జీవుల గీతం

గోరఖ్ పాండే

గాలి వాలు ఎలా వుందో మాకు తెలుసు
మేం దానికెందుకు పీఠమేస్తామో
ఎందుకని దానికి మా వెన్ను చూపుతామో మాకు తెలుసు
నెత్తురు అర్థం మేమర్థం చేసుకోగలం
డబ్బు విలువను మేమర్థం చేసుకోగలం
స్వపక్షంలో ఏముందో మాకు తెలుసు
ప్రతిపక్షంలో ఏముందో మాకు తెలుసు
మాకెంత తెలుసంటే తెలుసుకోవడం అంటేనే మాకు భయం
అందుకే మేం మవునంగా వుంటాం
మవునంగా వుండడంలోని ఆంతర్యంగూడా మాకు తెలుసు
ఒకవేళ మాట్లాడితే
ముందువెనుకలు చూసుకుని మాట్లాడుతాం
వాక్స్వాతంత్ర్యం ఆంతర్యం ఏమిటో మాకు తెలుసు

చిల్లరమల్లర నౌకరీల కోసం
స్వాతంత్ర్యం అమ్ముకోవడంలోని ఆంతర్యమూ మాకు తెలుసు
కాని మేమేం చేయగలం
ఒకవేళ నిరుద్యోగం అన్యాయం అని తీవ్రపడి ముందుకుపోతే
స్వాతంత్ర్యం నిరుద్యోగం వాటి అపాయం మేమర్థంచేసుకోగలం
మేం అనుక్షణం అపాయాలనుండి తప్పించుకుంటాం
మాకు తెలుసు
మేమిందుకిలా తప్పించుకుంటామో అదికూడా మాకు తెలుసు

ఒకవేళ ఈశ్వరుడన్నది కల్పన కాకపోతే
మేం ఈశ్వరున్నించీ దుఃఖపడతాం
మేం ప్రభుత్వం నుంచీ దుఃఖపడతాం
ఎందుకని అర్థంచేసుకోరూ
మేం ప్రజల నుండీ దుఃఖపడతాం

మేం మొత్తం ప్రపంచంలోని దుఃఖాన్ని చూసి దుఃఖపడతాం
కాని మేమెంత దుఃఖపడతామో మాకు తెలుసు

ఇక్కడ విరోధి పాదమెంత బలంగావుందో
మేం అర్థంచేసుకుంటాం
మేం అడుగడుగునా రాజీపడతాం
అర్థంచేసుకుంటాం
మేం ప్రతీ ఒక్క రాజీని తర్కబద్ధంచేస్తాం
ప్రతీ తర్కాన్ని
మసిబూసి మారేడుకాయజేసే మాటల్లో ముందుంటాం
మాకు తెలుసు
ఈ మారేడుకాయ మాటల తర్కం మాకు తెలుసు
అట్లాగే మమ్మలను మేం
ఎవరి కంటే తక్కువనుకోం
మాకు బుద్ధి విలువ తెలుసు
మేం నలుపును తెలుపూ తెలుపును నలుపూ చేయగలం
మేం టీకప్పులో తుఫాను నిలబెట్టగలం
చేయడానికైతే మేం విప్లవం గూడా చేయగలం.
మరి ప్రభుత్వం బలహీనంగా వుండీ
ప్రజలు ఆలోచనా పరులయితేనే

కాని మేమేమీ చేయలేం
మేమేమీ ఎందుకు చేయలేమో కూడా మాకు బాగా తెలుసు

నా గురువు

రగల్

తల్లి గర్భం నుండి
బయటపడి
పురటినెత్తుటి తడి ఆరకముందు
వేసిన "కేర్" మన్నకేక
నా ఉనికికి చిహ్నం

నా భాధల్ని, నా భావాల్ని, కోరికల్ని
నాకన్న తల్లి దండ్రులకైనా
మాటల ద్వారా
చెప్పకోలేని నాడు
ఏడుపును ఆశ్రయించాను
నా బాధల్ని గుర్తించకపోతె
నా కోరికల్ని నెరవేర్చకపోతే
గొంతుతడారే వరకు
గుక్క తిప్పుకోకుండా ఏడ్చాను
నన్ను ఓదార్చాలని ప్రయత్నించినపుడు
ఏడ్పుమానకుంటే
నన్నర్థంచేసుకోలేక
చీదరించుకున్నారు
బూచి అని బెదిరించారు
అప్పటికి
బాధతగ్గో శోషవచ్చో
వెక్కిళ్ళతో అశక్తునిగా ఉండిపోతే

అది అదనుగా
ప్రతి నిముషం

బూచి అని బెదిరించేవారు
మాటాడ నేర్చుకున్నాడు
నా బుల్లి బుల్లి మాటలతో
ఆనందంతో పరవశించిన వాళ్ళు
నా అవసరం కోసం
ప్రశ్నిస్తే
"గడుగ్గాయని"
గుడ్లెర్రజేసి చేయెత్తి
బెదిరించి ఓడించారు
నా ఓటమి
నా మంచితనానికి కితాబునిస్తే
నా భయం
నా భక్తికి కితాబునిచ్చింది.
ఆ చీకటిలో
యాంత్రికంగా కొట్టుకపోతున్నాను
తూర్పురేఖల అరుణిమకు
బెదురుతూ చీకటి
చెట్లచాటుకు ఇండ్లమాటుకు
నక్కడం చూశాను.
భయం భయంగానే
ఎరుపురేఖలకాహ్వానంపలికాను
చీకటి స్వభావంతెలిపి
సమాజం కళ్ళనుచూపించి

చీకటి వెలుగులమధ్య
నిరంతరం జరుగుతున్న
పోరాటాన్ని వివరించి
అనుభవ జ్ఞానాన్నిపంచి
వెలుగుకోసం జరిగేపోరాటం
అనివార్యమని నిరూపించి
భయాన్ని పోగొట్టి
పోరాడ నేర్పినవాళ్ళు
"రాడికల్స్"
ప్రజలకోసం
పోరాడుతున్నవారిని
"నక్సలైట్లని బెదిరింపులు
లాఠీచార్జీలు, ఎదురుకాల్పులుచేస్తూ
నాలో"భయాన్ని"
పెంచాలని చూస్తున్నారు పాలకులు
రక్తసంబంధాన్నిచూపి
నన్నుబంధించాలనుకుంటున్నారు
కాని
ఈరోజు నేను అశక్తున్నికాదు
ఒంటరివాణ్ణి అసలేకాదు
నావర్గం ఏదో నామార్గంఏదో
తెలుసుకున్నవాణ్ణి
"రక్తసంబంధంకన్న
వర్గ సంబంధంమిన్న"అని
పాఠంనేర్పిన
పోరాటం నా గురువు

జోహార్లు దేవన్నకు

"గద్దర్"

జోహార్లు జోహారులు దేవన్న
అందుకో జోహారులు
కోటాను జనులంతను దేవన్న
కొలిసి నీకు మ్రొక్కేరురా

ఏతల్లి నినుగన్నదో దేవన్న
ఏపాలునీకిచ్చెనో
ఉక్కుగుండె నీదిరా దేవన్న
చెయ్యెత్తి మొక్కేమురా ॥జో॥

సుక్కల్లో సుక్కయితివో దేవన్న
సూర్యునిలో ఎరుపయితివో
మెరుపులో మెరుపయితివో దేవన్న
ఎరుపుల్లో ఎరుపయితివో ॥జో॥

నాటులో పాటయితివో దేవన్న
పాటలో పదమైతివో
పాటలో పదమైతివో దేవన్న
పోరాట బాటయితివో ॥జో॥

పేదోల్ల పెన్నిదివే దేవన్న
బీదోల్లబిడ్డయితివో
రణపుల కొడుకయితివో దేవన్న
రాడికల్ గుర్తువన్నా ॥జో॥

నినుగాల్చి చంపేసిన దేవన్న
నీచున్ని మేమొదలము
ప్రజలంత ఒక్కటయ్యి దేవన్న
పండేసి తొక్కుతాము ॥జో॥

(నోట్ ; జోలపాట బాణిలో)

పల్లెల్లో లక్ష్మీరాజ్యం

ఢండార్

డీలు - డీలు - డీలు డీలో ఎత్తినబోనాలో
ఏమిటమ్మా ఎర్రిడీలో ఎత్తినబోనాలో

ఏములాడ తాలూకాన ఎత్తినబోనాలో
ఎలుగు తిమ్మాపూరమందూ "
మల్లమ్మ కడుపు పంటా "
అన్న లక్ష్మీరాజమన్నా "
పేదోనిగ బుట్టినాడే "
పెద్దసదువు సదివినాడే "
సదువులకు స్వస్తిచెప్పి "
సాహసించి సాగినాడే " ॥ డీలు ॥

మార్క్సిజం చదివినాడే "
లెనిన్‌బాట నడిచినాడే "
రేనోల్ల కలిసినాడే "
రేవుమాని తట్టినాడే "
రాటుదేలిన కమ్యూనిస్టై "
రాడికల్లు కల్సినాడే "
కూలి నాలిని కూడగట్టి "
కూలి సంఘాల్ బెట్టినాడే " ॥ డీలు ॥

ఊరు ఊరు తిరిగినాడే "
పూసలెన్నో చెప్పినాడే "
పల్లె పల్లె తిరిగినాడే "
పాటలెన్నో పాడినాడే " ॥ డీలు ॥

మరిగడ్డ మర్రికింద "
ఎర్రిదండు లెక్కడీయే "
కమ్యూనిస్టు లక్ష్మీరాజం "
నిలిపినట్టి ఎర్రిదండే "
రామన్నపేటలోనా "

ఎర్రజెండ లెక్కడీయే ,,
కామ్రేడు లక్ష్మీరాజం ,,
ఎగరేసినెర్రజెండే ,, ॥డీలు॥

మల్యాల మలుపుకాడ ,,
మంచిమాట లెన్నోచెప్పి ,,
మస్ల దోచె దొరలపట్టి ,,
మక్కెలిరగ దన్నుమానె ,,
ఆశిరెడ్డి పల్లెప్రజకు ,,
అండదండ లెన్నోఇచ్చి ,,
అన్నగాడై నిలిచినాడే ,,
ఆశాజ్యోతి అయ్యినాడే ,, ॥డీలు॥

దుద్రింగి రైతులాకు ,,
భద్రిమాని చెప్పినాడే ,,
దొర్ల దోపిడీని గూల్చ ,,
దుమ్రిడయ్యి నిలిచినాడే ,,
చందుర్తి చెట్ల నీడకు ,,
అందర్ని చేరదీసీ ,,
బతుకూలు బాగుకానూ ,,
బరిగీసి నిలువుమానె ,, ॥డీలు॥

సూరంపేట చుట్టుపట్లా ,,
సూరునోలె తిరిగినాడే ,,
సూరుడంటె సూరుడమ్మా ,,
సుక్కలోలె మెరిసెనమ్మా ,,
మానాల గ్రామ ప్రజలకు ,,
మావో సూక్తుల్ తెల్పినాడే ,,
ముద్దు ముద్దు మాటలల్లో ,,
దొరల గుట్టు చూపినాడే ,, ॥డీలు॥

ఎల్లరెడ్డిపేటలోనా ,,
ఎర్రజెండ లెక్కడీయే ,,

మా అన్న లక్ష్మిరాజం "
ఎత్తినాడే ఎర్రిజెండా "
బుచ్చన్న పేరుతోనా "
బుద్ధులెన్నో చెప్పినట్టి "
అక్కపెల్లి అక్కలారా "
అన్నజాడ లెక్కడమ్మా " ||డీలు||

తిమ్మాపూరు పల్లెలోన "
తిరుగుబాటు లేపినాడే "
అక్కలాను కూడగట్టి "
అగ్గిపాటల్ పాడినాడె "
బతుకమ్మ పండ్గనాడు "
భంగమేమొ చేసెనానీ "
పెద్దపండ్గ దసర్రినాడు "
దసరిపిల్లను గొట్టైనాని " ||డీలు||

తిమ్మాపూరు దొరగాడు "
వాసమ్మ కడుపుగాల "
గుండగాల్ల బిల్చినాడే "
పండుగేమొ చేసినాడే "
కల్లుసార దాగినారే "
కదిలినారె కత్తులాతో "
పొద్దుపోయి సందరోలె "
సద్దుమనిగి వున్నవూర్లె " ||డీలు||

గుండా లందరొక్కసారే "
అన్నమీదికురికినారే "
దెబ్బలెన్నో గొట్టినారే "
అన్నపానం తీసినారే " ||డీలు||

అన్న అడుగుజాడలల్లో "
ముసుముందు కేగుతాము "
బందూకు లందుకోని "
పోరుచేయ కదులుదాము " ||డీలు||

సాంస్కృతిక నిర్బంధం - సృజనాత్మక కళల కర్తవ్యాలు

సర్వేశ్వర్ దయాళ్ సక్సేనా

సంస్కృతి అంటే ఏమిటి? విముక్త స్వతంత్రి, ఆలోచనల వ్యక్తీకరణ. అందుకే స్వేచ్ఛ అంటే భయపడేవాళ్ళు దీన్ని ప్రమాదంగా భావిస్తారు. వాళ్ళు అన్నిటికన్నా ముందు ఈ స్వరాన్ని విరిచేయాలని, అణచేయాలని ప్రయత్నిస్తారు. ఇది యుగయుగాలుగా జరుగుతున్నది. అధికారమే సాంస్కృతిక స్వరాన్ని అణచివేయడంతో నిలబెట్టబడుతున్నది. మన అస్థిత్వానికి అన్నిటికన్నా అత్యవసరమైన గుర్తింపు అయిన ఈ విముక్త స్వతంత్రి స్వరాన్ని పోల్చుకొని మన మేంజేస్తాం. చిస్తాం. సౌందర్యాన్ని రచిస్తాం. ఎందుకంటే ఈ సౌందర్యరచన మనందరితో ఏకంచేస్తుంది. ఈ మాధ్యమం ద్వారానే మనమందరం సమానస్థాయికి చేరుకుంటాం. నిలబడతాం. సుఖాన్ని పొందడానికి, పోరాడడానికి, ఇతరులతో సంఘీభావం ప్రకటించడానికి మనకిందులో నుంచే శక్తి వస్తుంది.

సంస్కృతి మనకొక వేదికను కల్పిస్తుంది. ఒకరి కంఠం అందరి కంఠంతో, ఒకరి కదలిక అందరి కదలికతో, ఒకరి దారి అందరి దారిగా ఎట్లా సమ్మేళనమవుతాయో మనకు నేర్పుతుంది. అందుకే అధికారం ఎప్పుడూ దీన్నిచూసి భయపడుతుంది. చాలా బలహీనంగా ఉన్న అధికారం సంస్కృతిని చూసి మరింత భయపడుతుంది. స్వేచ్ఛా స్వరాన్ని విరిచేయడంలోనే తన ఉనికి ఉందని కలలుకనే అధికారం సాంస్కృతిక వ్యక్తి స్వతంత్రి స్వరాన్ని లాగివేయడానికి, అణచివేయడానికి ప్రయత్నం మరింత ఎక్కువగా చేస్తుంది. సంస్కృతి మీద పడుతున్న ప్రభావాన్ని బట్టే వ్యవస్థ చరిత్ర నిరూపింపబడ్తుంది, నిరూపింపబడుతున్నది.

ఇవాళ ఈ అణచివేత హద్దులులేకుండా పెరిగిపోయింది. పెరిగిపోతున్నది. ఇవాళ అధికారానికి ఒక సమానాంతర ఛద్మసంస్కృతిని తయారుచేసి నిలబెట్టేబలం వచ్చింది. ఇదివరకు రాజులు తమ బాహువులు చాచినంత మేరకు సంస్కృతిని అణచివేయగలిగేవారు. అంతేగాని సమాంతరంగా నాటకమో, సాహిత్యమో రచించగలిగేవాళ్ళు కాదు. ఒకవేళ వాళ్ళ వందిమాగధులు ఏదైనా రచించినా దానికి లోకంలో వ్యాపించేశక్తి ఉండేదికాదు. అది రాజాస్థానాలకు దర్బారులకు, మాత్రమే పరిమితమై ఉండేది. కాని ఇవాళ రేడియో సినిమా టెలివిజన్ అన్నీ ఈ వ్యవస్థా పంజరం అందాన్ని సహృదయతనూ వర్ణిస్తూ దేశం ఈ మూలనుంచి ఆమూలవరకు ప్రతీఇంటికీ చేరే సామర్థ్యాన్ని తెచ్చుకున్నది. ఈ సాధనాలద్వారా స్వేచ్ఛా స్వరాన్ని

నొక్కి వేయడానికి ముందుకు కదులుతున్నది. అంతేకాదు. ఇది ఎంత మాయా సంస్కృతి అని వ్యక్తీకరించగలదంటే స్వేచ్ఛాస్వరాన్ని అధికారం నొక్కివేసే చప్పుళ్ళను సాహిత్యమనీ, కళలనీ ప్రచారం చేయగలదు. ఈ సంస్కృతి నిన్ను ఎంత మొద్దుబారజేస్తుందంటే నిన్నది అణచివేస్తుందన్న సంగతే నీకు తెలియదు. ఆబాధే నీకు తెలియదు. ఒకవైపు సంస్కృతిమీద సినిమా, రేడియో, టెలివిజన్ల దాడి జరుగుతుంటే మరొకవైపు పెట్టుబడిదారుల గొలుసు పత్రికలదాడి జరుగుతున్నది. ఇవి మనను అబద్ధపు యుద్ధంలో ప్రవేశపెడ్తున్నవి. లేదా మనచేతికి అబద్ధపు ఆయుధాల నందిస్తున్నది. లేదా అసలు యుద్ధమే లేదని మనకుచెప్తున్నది. వీళ్ళకొరకు జీవిత ప్రయోజనం సినిమాల్లో చూపించేలాంటి ప్రేమ స్వప్నాలు కనడం. అసలైన సవాళ్ళను పోల్చుకొనడం తుడిచేయబడి, అబద్ధపు సవాళ్ళ జాతరలో మనను ముంచేస్తున్నారు.

ఇటువంటిస్థితిలో విముక్త స్వతంత్ర స్వరాలను వినడం కళాకారులకు చాలా కష్టమయిపోతున్నది. పైనమీద నిలబెట్టబడ్డ ఈ సార్వజనీన ప్రసార మాధ్యమాల మీద వీళ్ళకు అధికారంలేదు. వీటన్నిటిపై అధికారానికే అధికారంఉంది. ఈ వ్యవస్థ ఎంతసమర్థవంతమైందంటే సాంస్కృతికవ్యక్తిని ఒకపెట్టెలోపెట్టి మూత పెట్టి తానే ఒకలౌడ్‌స్పీకర్‌ని పట్టుకొని తిరుగుతున్నది. మీరు చిన్నచిన్న సభలు చేసుకోవచ్చు. చిన్నచిన్న పత్రికలు ప్రచురించవచ్చు. బులెటిన్‌లు తీయవచ్చు. చిన్న చిన్న వీధినాటకాలు వేయవచ్చు. రేడియో, టెలివిజన్‌లలో మీస్వరాన్ని వినిపించలేరు. సినిమాలు తీయలేరు. కాని ఇటువంటి పెట్టెల్లో బందుపెట్టికూడా వాళ్ళు తృప్తిపడటం లేదు. వాళ్ళకింకా భయమేవున్నది. లక్కఇళ్ళల్లో నివసించేవాళ్ళకు చిన్న నిప్పు రవ్వనుచూసినా భయమేవేస్తుందిమరి. ఈ చిన్నపత్రికలను, చిన్నచిన్న కళారూపాలనుకూడా వాళ్ళు తమ పాదాలదగ్గరకు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు. బిస్త్రీలో, గాజీపూర్‌లో కళాకారులయెడల పోలీసులప్రవర్తన ఇందుకు నిదర్శనం. బీహార్, ఉత్తరప్రదేశ్, ఆంధ్ర, బెంగాల్ - అంతటా స్వతంత్ర స్వరాలను తుంచేయడానికి ఏమేంచేశారో, ఏమేంచేస్తున్నారో మనందరికీ తెలుసు. సంస్కృతిపై ఇంకొకనిర్బంధం యుగయుగాలనుంచి భూస్వామ్య సంస్కృతి తెచ్చి పెడ్తున్న రూపవాదం. దీనినే బూర్జువాసంస్కృతికూడా ప్రోత్సహిస్తున్నది. కవిత, నాటకం, అన్నికళాప్రక్రియల విషయంలో భూస్వామ్య, బూర్జువా సభ్యత ఏ మూసలో తయారుచేసిందో అవేఇంకా కొనసాగుతున్నాయి. నూతన సౌందర్య

బిందువు ఈ రాయికింద అణగిపోతున్నది. మీరు ప్రజలకోసం కవిత్వంరాసినా దానిరూపం పరిమితవర్గాల మూసలోఉంటే అది ప్రజలదాకావెళ్ళదు. ఇదేస్థితి నాటకాల విషయంలోనూ ఇతర కళారూపాల్లోనూఉంది. ప్రజలకొరకు రాసిననాటకం, కథ, నవల, కవిత ఎప్పటిదాకా ప్రజలదాకా వెళ్ళవో అప్పటిదాకా అవి ప్రజా ప్రయోజనాల్ని నెరవేర్చవు. ప్రజలదాకావెళ్తున్న సాహిత్యాన్నీ కళలనూ, సహజంగానే ఈ అధికార సంస్కృతి సంస్కృతిగా గుర్తించదు.

ఈవిధంగా విముక్త స్వతంత్ర సంస్కృతీస్వరం ఒకవైపు అధికార మాధ్యమాలహోరులో, ప్రచారంలో చరిత్రహీనమైన పైమెరుగులో అడుగునబడిపోతున్నది. ఇంకొకవైపు రూపవాదచట్రంనుంచి బయటకు రాలేకపోతున్నది. మరొకవైపు వ్యవస్థకాళ్ళకింద అణచివేయబడి బందూకులకు, బయనెట్లకూ ఎర అవుతున్నది.

ఈఅణచివేతనుంచి సంస్కృతిని కాపాడడమెట్లా? ఈప్రశ్నకు జవాబు సులభమైందేమీకాదు. రోజురోజుకూ మరింత కఠినమవుతున్నది. ఎన్నోయుగాలనుంచి చెప్పబడుతున్నదే అయినా ఒకకఠోరసత్యమేమిటంటే కళాకారులు తమస్వేచ్ఛ స్వరాలను కాపాడుకోవడానికి తమస్వరాలు హెచ్చించాలి. నిర్భయంగా రచించాలి. ఏది నిజమనుకుంటారో అదిచెప్పాలి. పరిణామాలను లెక్కపెట్టవద్దు. సత్యమైనస్వరం తాను అణగారికూడా ఎక్కడోఅక్కడ ఏదోఒకరూపంలో నివురుగప్పిన నిప్పులాగా జీవించి ఉంటుంది. తుఫానులు రాగానే బూడిదలోంచిలేచి విస్తరిస్తుంది. అన్యాయ అరణ్యాలకు నిప్పుపెడ్తుంది. కనుక ఇది ఆత్మహత్యకాదు, సత్యాన్ని రక్షించడానికి కళాకారులు తమనుతాము నిలబెట్టుకోవడం. దీనితోపాటు మనతోసమానభావాలు కల వారితో కలిసి మన మీ యుద్ధం చేయాల్సిఉన్నది. మన భావాలవంటి భావాలుకల వారితో కలవాలనేది సులభమేకాని వాళ్ళనుపోల్చుకోవడం అంతసులభమేమీకాదు. వాళ్ళను పోల్చుకోవాలి. వాళ్ళతోకలసి ఎవరువెంబడొస్తే వాళ్ళతోకలసి ఈ వ్యవస్థ నెదుర్కోవాలి. స్వేచ్ఛాస్వరమున్నందుకు ఎవరెవరు, ఎక్కడెక్కడ మూల్యం చెల్లించాల్సివస్తున్నదో ఏరూపంలోనైనాసరే వాళ్ళవెంట మనముండాలి. వాళ్ళు ఒంటరిగా లేరనేవిశ్వాసం మనమివ్వాలి. మిగతాపని రాజకీయసంస్థలు చూసుకుంటాయి. మనమంతా స్వేచ్ఛాస్వరాలను రక్షించడంకోసం మన సమానాంతర వేదికను తయారు చేసుకోగలిగితే చేసుకోవాలి. కలిసిపోవాలె. ఒకవేళ ఆవేదిక మనభావాల్ని వ్యక్తీకరిస్తుందనుకుంటే సాంస్కృతిక వ్యక్తులు తమచేతులుఅందించి సంఘీభావాన్ని ప్రకటించి దానితో కలిసిపోరాడాలి.

కవిత్వం సాహిత్యపు రూపవాదసంకెళ్ళను తెంచుకొని ఈ నిరక్షరాస్య దేశ ప్రజల కంఠాల్లో చోటుచేసుకోవడానికి పాటలరూపంలో రావాలి. వాటిలోసామర్థ్యం ఉంటే అవిసాహిత్యంలో భాగమవుతాయి. ఒకనూతన సౌందర్య అవగాహనకొరకు చేసే అన్వేషణలో అవిమనకు తోడుంటాయి. సినిమా, రేడియో, టెలివిజన్లమార్గాలు మనకులేవు. నాటకమొక్కటే మనకు తెలిసిఉన్నది. ఈ అణచివేతకు వ్యతిరేకంగా అణచివేసే శక్తుల ముసుగులను తొలగించడానికి నాటకాలు రచింపబడాలి. స్థానిక సాంస్కృతిక నాటకసంస్థలకు ప్రోత్సాహాన్నివ్వాలి. ఇంత విస్తృతదేశంలో సాంస్కృతిక వ్యక్తి తనస్వతంత్రస్వరాన్ని కాపాడుకోవడానికి ఏయేపోరాటాలు ఎంతగా చేస్తున్నాడో, ఎన్నిఅణచివేతలకు గురిఅవుతున్నాడో చెప్పడంకష్టం. అధిక ప్రచారం గల పెద్దపత్రికలు ఈ విషయాన్ని చెప్పడంలేదు. ఎక్కడికక్కడ చిన్నచిన్న సాధనాలద్వారానే వాటినిమనం ముందుకుతేవాలి ప్రజలకు పరిచయం చేయాలి.

చివరకు ఒకమాట తప్పకుండా చెప్పాలి. మూతపెట్టబడిన పెట్టెలోఉండి తుఫానునెదిరించడంకన్న బయటపడి తుఫానుగామారి తుఫానునెదుర్కోవాలి. ఈసంక్షోభాన్ని తొలగించి ఈ సమాజాన్ని సాంస్కృతిక అణచివేతనుంచి విముక్తం చేయాలి. ఎందుకంటే సాంస్కృతిక అణచివేత జీవితపు పునాదులపైననే చాలాగట్టి ప్రభావాన్ని వేస్తుంది. దానిని విముక్తంచేయడమంటే జీవితానికి స్వేచ్ఛనివ్వడమే. ఇంట్లోనిప్పంటుకుంటే అరవడంతప్పదు. కప్పులేఎగిరిపోతాయో గోడలే పగిలిపోతాయో కానీ మంటలుఆర్పడానికి ప్రతి సంఘటిత ప్రయత్నంలోనూ మనం దూకి తీరాలి.

(ప్రజాతంత్ర హక్కుల ప్రజాసంఘం పి. యు. డీ. ఆర్ ఢిల్లీ వార్షికచర్చా వేదికలో 4-11-81న చేసిన ప్రసంగవ్యాసం.)

విస్తరణాకాంక్ష!

సుఖాపేక్ష పోరాటకాంక్ష కాదు
పోరాట విస్తరణాకాంక్ష
ప్రజాపోరాటాల్లోగానీ వ్యక్తంకాదు
కామ్రేడ్
ఆయుధం ఏదీ ఎప్పుడూ అస్పృశ్యం కాదు
కానీ
సమాజానికో చరిత్ర ఉంది
పడుతూ లేస్తూ నడచిన ముళ్ళబాట ఉంది
అరణ్యవాసం నుంచి కమ్యూన్ జీవితాలకు ఎదుగుతున్న వెలుగుబాట ఉంది
రేపటి విజయోత్సవానికి నింగీ నేలా కలిపిన వేదిక ఉన్నది

ఆయుధాలకో చరిత్ర ఉంది
మళ్ళీ నువ్విప్పుడు ఆదిమమానవునివి కాలేవు
నీ అమ్ములపొది ఇప్పుడెందుకూ పనికిరాదు
యుగధర్మం మనమడ్డుకుంటే ఆగేదికాదు
రమ్మనగానే వచ్చేదీకాదు

వర్తమానం మీద పరుచుకునే గతం నీడ కాదు
వర్తమానానికి పటంపెట్టే గతం కాంతి చూడు
రాతికొన నుంచి అణ్వాయుధందాకా
ఎదిగిన క్రమం చూడు
'చీడపట్టిపోతున్న ఎర్రనిప్పం' కాదు
'మోటుపాదాల మొండిత్యాగాలు'
నిర్దేశించిన కర్తవ్యం చూడు
వాళ్ళ నెత్తురుపేర్లని
విప్పారుతున్న పుష్పాన్ని కందించాలిగాని,
దేశం దేశమంతా కల్లోల సముద్రమైనప్పుడు
ఆ త్యాగాల్ని నింగి నిండుకునే ఎర్రజెండాలు చెయ్యాలిగాని
గతం త్యాగాలు వర్తమాన కుషన్ సీట్లు కావద్దు

ఆకర్షణ అగాధంలో పడనంతవరకూ భ్రమిస్తాం మనం
ఆ తర్వాత మన రంగులకలల్లో మనమే పరిభ్రమిస్తూ
అసెంబ్లీ లాబీల్లో 'గుడుగుడు గుంచాలు' తిరుగుతూ

జనానికి భ్రమలున్నాయంటాం, 'శూన్యంమీద నీళ్ళు ప్రవహిస్తాయ'ని కలలుకంటాం
ఇదేమీ కొత్తకాదు

పార్లమెంట్లు 'మురికికూపాలు' మాత్రమే కాదు
'అసహ్యించుకునే స్థలాలు' మాత్రమే కాదు
అక్కడ 'చెప్పులూ రాళ్ళూ' మాత్రమే విసిరేసుకోరు
పార్లమెంటంటే
మన ఆనవాలు లేకుండా, మనకు సోయిలేకుండా మనల్ని అదృశ్యంచేసే యాసిడ్
పార్లమెంటంటే
రక్తమంతాపీల్చి, గాజుకళ్ళు మాత్రమే మిగిల్చి
దేశంమీద మనసు ప్రదర్శించే ఉరికొయ్య
పార్లమెంటంటే
చాప కింద నీరు
పార్లమెంటంటే 'నీళ్లోచేపల'కి ఎర
పార్లమెంటంటే
నువ్వూ నేనూ కొట్టుకుపోయే ఆకర్షణల జడి

ఎంఎల్ఏ క్వార్టర్స్ నుంచో బార్‌లోనుంచో
అసెంబ్లీకి నిన్ను సూపర్ డీలక్స్ బస్సులు తీసుకుపోతాయి
బెల్లపురంగు అద్దాల్లోంచి
లోకం నీ కళ్ళముందు సజావుగా సాగిపోతుంది
ముళ్ళల్లో, రాళ్ళల్లో, తుప్పల్లో నడిచీ నడిచీ
అలిసిపోయిన నీ మోటుపాదాలు
ఎయిర్ కండిషన్డ్ హాల్లో నిద్రలో జోగుతాయి
ఎప్పుడైనా లేచి ఉండి
చెప్పులో, రాళ్ళో విసిరితే ఏదో ఓ బోర్డు చైర్మన్‌వవుతావు
ఒకప్పుడు మైక్ పర్మిషన్ కోసం
చిత్రహింసలనుభవించిన నీ ముందు
విరగ్గొట్టమని మైక్ పెడతాడు వాడు
ఎంత సౌఖ్యం!
ప్రజాపోరాటాల పతాకాలను
ప్రజలకు దూరంగా
బాతఖానీ క్లబ్బులో
పాతేయాలని చూడడం ఎంత లౌక్యం

రంగుల వల

తెలుగు సినిమా రాజకీయార్థిక పరిచయం

సురా

పరిచయం

1977-78 నుండి తెలుగు సినీప్రపంచంలో ఒకకొత్తగాలి నెమ్మదిగా ప్రవేశించింది. దాన్ని 'సమస్యాత్మక సినిమా' అనీ, 'ప్రయోగాత్మక సినిమా' అనీ, 'సమాంతర సినిమా' అనీ, 'వ్యాపారేతర సినిమా' అనీ, 'విప్లవసినిమా' అనీ, రకరకాల పేర్లతో పిలుస్తున్నారు. (ఈ సినిమాలనే సినిమాలవాళ్ళు 'బడ్జెట్ సినిమా' అనికూడా పిలుస్తుంటారు. అక్కడికి మిగతాసినిమాలకు బడ్జెట్ లేనట్టు). ఈ రకం సినిమాలు ఆదివారం ఉదయంఆటలకో ఫిల్మ్ సొసైటీ నెలవారీ ప్రదర్శనలకో పరిమితం కాకుండా సాధారణ ప్రేక్షకులలో హిట్ అవ్వడంకూడా మొదలెట్టాయి. దాంతో ఐదేళ్ళక్రితం నెమ్మదిగా ప్రవేశించిన గాలికాస్తా పెద్దదుమారం అయికూచుంది. ఇవి నిర్మాతలకు డబ్బుచేయడమే కాకుండా కాస్తోకూస్తో చర్చలనుకూడా లేవనెత్తాయి. చివరికి సినిమా ఒకప్రక్రియగా ప్రజలకు, వాళ్ళపోరాటాలకు పనికొస్తుందా, రాదా అనే మౌలికమయిన చర్చకూడా వచ్చింది. ఈ రకంచర్చ 50 లలో ఓసారివచ్చిన చర్చే. అయితే ఇప్పుడు కన్పిస్తున్నంత బలంగా అప్పుడు చర్చసాగినట్టు సాక్ష్యాధారాలు లేవు. ఈ మధ్యకాలంలో మన జీవితాల్లోనూ, సమాజంలోనూ సినిమా పాత్ర, ప్రభావం పెరగడమే బహుశా అందుకు కారణంకావచ్చు.

జీవితంలో సినిమా

సినిమా నిస్సందేహంగా ఇవ్వాళ మనకున్న కళలన్నింటిలోనూ బలవత్తరమయిన కళ. అందులోనృత్యం, సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, ఛాయాచిత్రణ మొదలయిన మనమెరిగిన కళలన్నీ మిళితమవుతాయి. అభివృద్ధిచెందిన సాంకేతిక విజ్ఞానంతో ఈ కళలన్నింటిమధ్య సమన్వయం చేయగలశక్తి దానికుంది. అందుకేకాబోలు ఇవ్వాళ మనదేశంలో ఈ కళకున్నంత ప్రాచుర్యం మరేఇతర కళకులేదు. రోజూ మధ్యాహ్నం 3 గంటలకి రాత్రి 12 గంటలకిమధ్య కొన్నిలక్షల మంది సినిమాచూస్తుంటారు. సినిమాను ప్రజాప్రయోజనాలకి వాడుకోగలమని నమ్మే వాళ్ళంతా సినిమాకున్న ఈ ప్రాచుర్యంవల్లే తమప్రయోగాలు చేస్తున్నారు. ఎక్కువమందికి లాభించేభావాలు ఎక్కువమందికి చేరాలన్నదే వాళ్ళకున్న (సద్)ఉద్దేశం.

అయితే దీన్ని వ్యతిరేకిస్తున్నవాళ్ళు లేకుండాపోలేదు. వీళ్ళంతా సినిమాతీయడానికి పెద్దపెట్టుబడి కావాల్సిరావడం ఒక అభ్యంతరంగా చెప్తారు. అంతేకాకుండా ప్రభుత్వం నియమించే సెన్సారు కత్తెరఅంచుల్ని తప్పించుకొని ప్రజోపకారకమయిన సినిమా తీయలేంఅని వాదిస్తుంటారు. ఈ వాద ప్రతివాదనలు సాగనీసి మనం అటోఇటో తేల్చుకోవడం సాధ్యమనితోచదు. అందుకని వీళ్ళిద్దర్ని ఇక్కడ కొంత సేపు వదిలి మనం మనజీవితాల్లోకి. తెలుగుసినిమా చరిత్రలోకివెళ్దాం.

మన దేశంలో వర్గ, కుల, మత, సాంఘిక, రాజకీయ, ప్రాంతీయ విభజనలతో నిమిత్తం లేకుండా అందరూ సినిమాలు చూస్తుంటారు. ఇందులో విడుదలయిన ప్రతీ సినిమాచూసే వెర్రివాళ్ళ నుండి కేవలం ఎన్నికచేసిన మంచి సినిమాలు మాత్రమే చూసే మేధావుల దాకా అందరూ ఉన్నారు. రోజువారి జీవితంలో మనం ఏమూలకెళ్ళినా ఏదో ఓ రూపంలో సినిమా మనకు సాక్షాత్కరిస్తుంటుంది. వివిధభారతి వాణిజ్య ప్రసారాల మధ్య పాటలు, హోటళ్ళలో గ్రాంఫోన్ రికార్డులు ఇటీవలకాలంలో టేప్‌రికార్డర్లు మనల్ని పొద్దస్తమానూ హోరెత్తిస్తుంటాయి. పెద్ద పెద్ద పల్లెలనుండి మహానగరాలదాకా ఇంచుమించు అన్ని ప్రాంతాలలోనూ ప్రతిసందులో, గొందులో సినిమా పోస్టర్లు గోడమీదనుండి తొంగిచూస్తుంటాయి. రకరకాల సినిమా పత్రికలు. తారలపడకగది వ్యవహారాలతోసహా సినిమారంగానికి సంబంధించిన అన్నికబుర్లు మనం అడక్కుండానే ఆసక్తికరంగా చెప్తుంటాయి. మహాత్మగాంధీ పేరు వినని వాళ్ళయినా కన్పిస్తారేమోగాని అక్కినేని, ఎన్టీఆర్ ముఖాలుతెలియని తెలుగువాళ్ళు కన్పించరు. సినిమాలకు ప్రేక్షకుల్ని వాళ్ళప్రపంచంనుండి దూరం తీసుకెళ్ళగల శక్తివుంది. కథకు నాటకీయతనుచేర్చి జీవితవాస్తవికతనుండి వేరుచేసి ప్రదర్శించడం వాటిసాధారణలక్షణం. సామాన్యజనం లేకపోవడంకాదు, వాళ్ళెవరూ సామాన్యజనంలా ప్రవర్తించక పోవడమే వాటిప్రత్యేకత (ఈ విషయంలో మామూలు సినిమాకు 'సమాంతరసినిమా'కు పెద్దతేడావున్నట్టు కన్పించదు). జీవితంలో భాగంకాని సాంకేతికపరికరాల సహాయంలేకుండా జీవితాన్ని చూపించలేకపోవడం సినిమా ప్రక్రియకున్న బలహీనత. అదే ఈ కృత్రిమత్వానికి దారితీస్తుందేమో. (కలం, కాయితం ప్రజాజీవితంలో లేవుకదా! మరి వాటితో జీవితవాస్తవికతను సాహిత్యంలో ప్రదర్శించవచ్చుగదా అని సందేహం రావచ్చు. అప్పుడు లిఖిత, మౌఖిక సాహిత్య సాంప్రదాయాలలో ఏది ప్రజలకు దగ్గరగా ఉండగలదో పరిశీలించాలి) అయితేనేం, కళగా సినిమా బలవత్తరమయినది. సమ్మోహపరచే ఈ

సాంస్కృతిక ప్రదర్శన వెనకాల కళ్ళకుకన్పడో, కన్పడకుండానో మన జీవిత వాస్తవికత ఉంది. ఈ వాస్తవికతలో మన వ్యవస్థ అనివార్యం చేస్తున్న భయంకర మయిన మొనాటనీ ఉంది. మనలో అత్యధిక భాగం సినిమాకెళ్తే ఈ మొనాటనీని మర్చిపోవడానికే వెళ్తాం. సినిమా మనం డబ్బులుపెట్టి మూడు గంటల కోసం కొను క్కునే పగటికల. మన రాష్ట్రంలోనే ప్రస్తుతం ప్రతిరోజు నల్బై లక్షల మంది సినిమా చూస్తున్నారు (లెక్కల్లో చెప్పుకోవాలంటే నగటున మూడువారాలకోసారి రాష్ట్రం మొత్తం సినిమా చూస్తున్నారు!). మనకు అవసరమో, అనివార్యమో అవుతున్న ఈ మూడుగంటలు సినిమాలు తీసేవాళ్ళకు, చూపించేవాళ్ళకు ఏరకం ప్రయోజనాల్ని తీరుస్తుందో పరిశీలిద్దాం. వాళ్ళ చరిత్ర ఇవప్పుడుకాదు, ఏభయ్యేళ్ల క్రితమే ఆరంభమయింది.

చరిత్రలో సినిమా

1913లో దాదాసాహెబ్ ఫాల్కే అనే ఓ పెద్దమనిషి 'హరిశ్చంద్ర' అని ఓ సినిమాతీసాడు, అప్పట్లో సినిమాలు మూకీలేగాని టాకీలుగావు. అందుకే అక్కడ భాషాసమస్యలేదు. ఆ కారణంగా తెలుగు సినిమాచరిత్ర మనం తెల్చుకోదల్చుకుంటే అది టాకీ తెలుగుసినిమాతోనే మొదలవుతుంది. అంతకుముందు రఘుపతివెంకయ్య ('భీష్మ') సి. పుల్లయ్య ('మార్కండేయ') సినిమాలుతీసినా, 1931లో విడుద లయిన హెచ్. ఎం. రెడ్డి 'భక్తప్రహ్లాద'అనే టాకీతోనే తెలుగుసినిమా చరిత్ర మొదలయిందని మనంచెప్పుకోవచ్చు.

అయితే అంతకుముందే సినిమా ప్రదర్శనవిభాగం ఆరంభమయింది. 1919 లోనే కాకినాడలో ఒక టూరింగ్ సినిమాహాలు మొదలయింది, 1921లో బెజవాడ లో నిర్మించిన మారుతిహాలు మనకు మొదటి పర్మనెంటు సినిమాహాలు. క్రమ క్రమంగా సర్కారుజిల్లాలలో సినిమాహాళ్ళు రావడం మొదలెట్టాయి. ఇవ్వాల్టికీ మన రాష్ట్రంలోఉన్న సినిమాహాళ్ళల్లో అత్యధికభాగం (35 శాతం) కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి జిల్లాలోనే ఉన్నాయి. అన్నిటికన్న తక్కువయిన ఆదిలాబాద్ జిల్లాలో 25 సినిమాహాళ్ళుకూడా లేవు.

స్టూడియోలనిర్మాణం 1936లో రాజమండ్రిలో (దుర్గా సినీటోన్)తో మొద లయింది. 1937లో విశాఖలో మరో స్టుడియో (ఆంధ్ర సినీటోన్) నిర్మాణం అయింది. అయితే కొద్దికాలంలోనే ఇవి మూతపడ్డాయి. 40ల నాటినుండి మద్రాసు

లోనే స్టుడియోలు కేంద్రీకృతంకావడం మొదలయింది. తిరిగి ఇటీవలకాలంలో హైదరాబాద్‌లో స్టుడియోలు నిర్మాణం మొదలయ్యేదాకా మనకు మద్రాసు సినిమాకు మరోపేరు.

1934లో జి. కె. మంగరాజు మొదటి తెలుగు సినీపంపిణీ సంస్థను ప్రారంభించారు. 1953కే పంపిణీసంస్థలు 58 దాకా పెరిగిపోయాయి. మొదట్లో పంపిణీ ప్రాంతాలవారిగా జరిగేది. ఇటీవలికాలంలో జిల్లాలవారీ పంపిణీ, నగరహక్కుదార్లు, వారపు అద్దెదార్లుఅంటూ పంపిణీ వికేంద్రీకరణకు గురిఅయింది. పంపిణీసంస్థల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. 1953 లోనే పరిశ్రమ ప్రయోజనాన్ని రక్షించుకొని అభివృద్ధి చేసుకోవడంకోసం ఆంధ్రా ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పడింది. తర్వాతకాలంలో సినిమా నిర్మాణంలోనూ, కొంతవరకు ప్రదర్శనలోనూ సాంకేతికంగా చాలాపెద్ద మార్పులొచ్చాయి. గ్రాంఫోన్ రికార్డులు పాపులర్‌కావడం సినిమాకో పెద్ద మైలురాయి. 1963లో వచ్చిన మొదటి రంగులసినిమా (లవకుశ) నాటినుండి కలర్ చిత్రాలసంఖ్య పెరిగిపోయింది. స్థూలంగా చెప్పుకోవాలంటే 1919లో ఒక్క సినిమాహాలుతో ఆరంభమయిన ప్రదర్శన 1980లో 1900 సినిమాహాళ్ళకు చేరుకుంది. 30లలో దశాబ్దకాలంలో 75 తెలుగుసినిమాలు విడుదలయితే 70లలో దశాబ్దకాలంలో 895 సినిమాలు విడుదలయ్యాయి, 60లలో 11 కలర్ సినిమాలువస్తే 70లలో 482 కలర్ సినిమాలొచ్చాయి. 1934లో ఒక్క పంపిణీసంస్థ 1980లో చిన్నా పెద్దా అన్నీకలుపుకొని 500 సంస్థలయ్యాయి. లెక్కల్లో చెప్పుకోవాలంటే తెలుగు సినిమా నిర్మాణంలో 1000 శాతంమించి, ప్రదర్శనలో 1500 శాతం మించి పెరిగిందని చెప్పుకోవచ్చు. గడిచిన 50 ఏళ్ళల్లో ఇంతఅభివృద్ధి మన వ్యవసాయరంగానికిలేదు, పారిశ్రామిక రంగానికిలేదు. ఈ అభివృద్ధి వెనకాల కోట్లాదిరూపాయల పెట్టుబడిఉంది. అయితే పెట్టుబడి ఎక్కడ ప్రవేశించినా కొన్ని రాజకీయార్థిక సూత్రాలననుసరించే ప్రవర్తిస్తుంటుంది.

పెట్టుబడి

ఏవస్తువయినా ఉత్పత్తి స్థూలంగా రెంటికోసం జరుగుతుంది. మొదటిది ఉపయోగపు విలువకోసం. అంటే ఉత్పత్తి, ఉత్పత్తిదారుడో మరెవడో ఉపయోగించడం కోసమే జరిగేఉత్పత్తి. రెండవది మారకపువిలువకోసం. ఈ రకంఉత్పత్తి వస్తువులోఉండే ఉపయోగపువిలువను ఆధారంచేసుకొని దాన్నిఉత్పత్తిచేసి, మారకం

చేసి, అదనపువిలువను సంపాదించడంకోసం జరిగేఉత్పత్తి, ఈరకంగా ఉత్పత్తి అయ్యే వస్తువులని సరుకులు (Commodities) అంటారు. ఏ రంగంలోఅయినా పెట్టుబడి ప్రవేశిస్తే ఈ సరుకుల ఉత్పత్తే జరుగుతుంది. ఇక్కడ పెట్టుబడి అంటే కేవలం మదుపుకాదు. దోపిడీ ఉత్పత్తి సంబంధాలద్వారా అదనపువిలువను సృష్టించే ఒకక్రమం. పెట్టుబడిఅంటే ఒక సాంఘికసంబంధం. పెట్టుబడిదారుడు ముడిసరుకుని, సాంకేతికపరికరాల్ని, పరిజ్ఞానాన్ని, శ్రమశక్తిని కొనుక్కొని సరుకుని (దాంతోపాటే అదనపువిలువని) ఉత్పత్తిచేసి, ఆసరుకుని మార్కెట్లోఅమ్మి, తను సృష్టించిన అదనపువిలువను గ్రహించడం- ఈ క్రమంలో ప్రధానాంశాలు. అదనపు విలువను ఎక్కువచేసుకోవడం కోసమే పెట్టుబడి నిరంతరం సాంకేతికాభివృద్ధిని ప్రోత్సహిస్తుంటుంది. ఒకోసారి పెట్టుబడి ఉత్పత్తిచేసిన సరుకుని అమ్ముకోలేక తాను సృష్టించిన అదనపువిలువను తానేగ్రహించకుండా మిగిలిపోతుంది. దాన్నే 'గ్రహింపు సంక్షోభం' (Realisation crisis) అంటారు. పెట్టుబడి కళారంగాన్ని ప్రవేశించినప్పుడు కొన్ని ప్రత్యేకలక్షణాలుండటం మనం గమనించవచ్చు. ఇక్కడ ఉత్పత్తికి, వ్యాపారానికి స్పష్టమయిన సరిహద్దులు అన్నిసమయాలలోనూ కన్పడవు. పెట్టుబడి అదనపువిలువను ఉత్పత్తిచేసేక్రమం ఇక్కడ ఖచ్చితంగా అంచనావేయలేంకూడా. అంతేకాక ఉత్పత్తిచేసే సరుకులో వైవిధ్యం, ఆ వైవిధ్యంలో త్వరగా జరిగేమార్పులు సాధించలేకపోతే కళారంగంలో సరుకుని మార్కెట్లో అమ్మలేక పెట్టుబడి "గ్రహింపుసంక్షోభానికి" గురిఅవుతుంది. ఈ విషయాల్ని గుర్తుపెట్టుకొని మనం తెలుగుసినిమాలో పెట్టుబడిని పరిశీలిద్దాం.

పెట్టుబడిగా తెలుగుసినిమా

ఈ పెట్టుబడి తెలుగు సినిమాకు ఎక్కడనుండి వస్తోంది ?

తెలుగుదేశంలో కొన్ని ప్రాంతాలలో వ్యవసాయ వ్యాపారీకరణ ఈ శతాబ్దం ఆరంభం నాటికే బలపడసాగింది. మొదట్లో డెల్టాజిల్లాలలోనూ, తర్వాత ఇతర ప్రాంతాలలోనూ వ్యవసాయరంగంలో లాభాలురావడం మొదలుపెట్టాయి. ఈ లాభాలు కొత్తదారులు తొక్కడం ఆరంభమయింది. మన దేశంలో చెప్పుకోదగ్గ పరిశ్రమ లన్నింటిలోనూ సామ్రాజ్యవాదులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తిష్ట వేసుక్కూచున్నారు. ఆ పెద్ద చేపల చెరువులోకి వెళ్ళడానికి మన డెల్టాజిల్లా చిన్న చేపలకి భయం. పైగా పెద్దపరిశ్రమలలో పెట్టిన మదుపు త్వరగా తిరిగిరాదు. అందు

కని మన వ్యవసాయరంగ లాభాలు హోటళ్ళకి, బ్రాందీ షాపులకి, సాంస్కృతిక రంగానికి ప్రవహించాయి. మన రాష్ట్రంలో స్థిరపడ్డ భూస్వాములకి, సినిమాలకి మధ్య సంబంధాన్ని మనం సులువుగానే రుజువుచేయవచ్చు.

సినిమా పరిశ్రమలో ఉత్పత్తికి, వ్యాపారానికి స్పష్టమయిన సరిహద్దులులేవు. మన సినిమా పరిశ్రమలో నిర్మాతలు, పంపిణీదార్లు కలిసే పెట్టుబడి పెడ్తుంటారు. వీళ్ళకితోడు సినిమాల వాళ్ళకు వడ్డీలకు అప్పులిచ్చే ఫైనాన్సియర్స్ కూడా ఉంటారు. ఖచ్చితంగా చెప్పుకోవాలంటే తెలుగు సినిమాకు ఈ ముగ్గురూ నిర్మాతలే. (ఇంగ్లీషులో ప్రొడ్యూసర్ అనే పదానికి తెలుగులో 'నిర్మాత' అని అనువదించిన వాడెవడో తెలివయినవాడు) ఇటీవల కాలంలో ప్రభుత్వం నాలుగో భాగస్వామి అవుతోంది కూడా. వీళ్ళుకాక కేవలం సినిమాహాళ్ళ నిర్మాణానికి మాత్రమే పెట్టుబడిపెట్టే వాళ్ళుకూడా ఉన్నారు. (ప్రస్తుతం ఒక సినిమాహాలు నిర్మాణానికి సగటున 20 లక్షలు ఖర్చవుతుందని ఒక అంచనా). నిర్మాతలు ఈ పెట్టుబడితో ముడిసరుకుని, సాంకేతిక పరికరాలని, శ్రమశక్తిని కొనుక్కుంటారు. మనదేశంలో నిర్మించే సినిమాలన్నింటికి ముడిఫిల్మ్ విదేశీ కంపెనీల నుండి కొనుక్కోవాల్సిందే. ఇటీవలకాలంలో ప్రభుత్వయాజమాన్యంలోఉన్న హిందూస్తాన్ ఫోటో కంపెనీ (ఇందూ) ముడిఫిల్మ్ తయారీని తీవ్రతరం చేస్తోంది. అయితే ఆఫిల్మ్ తయారీకి కావాల్సిన రసాయనిక పదార్థాలన్నీ దిగుమతి చేసుకోవాల్సిందే. ఇవికాక కెమెరా (ముప్పయి వేల రూపాయలనుండి ఇరవైలక్షలదాకా ఖరీదుచేసే రకరకాల కెమెరాలున్నాయి), ప్రొసెసింగ్ పరికరాలు, ఎడిటింగ్ పరికరాలు (ఎడిటింగ్ టేబిల్ అని వాళ్ళు దీన్ని పిలుస్తుంటారు) వగయిరాలన్నీ విదేశాలనుండే దిగుమతి అవుతుంటాయి. ఇందులో అత్యధిక భాగం పశ్చిమదేశాల కంపెనీలే (కొన్ని బహుళ జాతి కార్పొరేషన్లుకూడా). ఇటీవలకాలంలో ఎడిటింగ్ టేబిల్‌లో సోవియట్ రష్యా, చెకొస్లోవేకియా కంపెనీల ప్రాబల్యం పెరుగుతోంది. తర్వాత నిర్మాతలు రకరకాల శ్రమశక్తిని కొనుక్కుంటారు. ఇందులో దర్శకులు, రచయితలు, నటీనటులు వగయిరా కళాకారుల 'సృజనాత్మక శ్రమశక్తి' సాంకేతికనిపుణుల శ్రమశక్తి, సాధారణ కూలీల శ్రమశక్తి- అందరి శ్రమశక్తిని కొనుక్కోవాల్సిందే. ఈశ్రమ సమన్వయఫలితమే సినిమా. అధికార అంచనాల ప్రకారం 1971 లో సగటు తెలుగు సినిమా నిర్మాణానికి 5 లక్షల ఖర్చయితే 1981 లో 19 లక్షల రూపాయలు ఖర్చయింది. ఏటా సుమారు 30 కోట్ల రూపాయల పెట్టుబడి సినిమారంగంలోకి ప్రవేశిస్తోందని అధికార అంచనా. అయితే

సినిమా రంగంలో ఉన్నంతగా (స్మగ్లింగ్ మినహాయించి) మరే ఇతర రంగంలోనూ నల్లధనం లేదనేది మనందరికి తెలిసిన విషయమే. అసలు ఎన్నికోట్లు ఉంటుందో మనం ఊహించుకోవాల్సిన విషయమే.

తెలుగు సినిమా రంగంలో పెట్టుబడి ఇలా నిర్ణయాత్మకమయిన పాత్రని నిర్వహిస్తూ, సరుకుల్ని (అదనపువిలువని) ఉత్పత్తిచేసి మనకు అమ్ముతోంది. ఆ క్రమంలోనే కథలో, కథనంలో వైవిధ్యానికి ప్రోత్సాహాన్నిస్తుంది. ఇవ్వకపోతే అమ్మడం కష్టం. అమ్మకపోతే అదనపు విలువని గ్రహించడం కష్టం. తెలుగు సినిమా కథలో వైవిధ్యాన్ని, అందులోవస్తున్న మార్పులని మనం సులభంగానే చూడవచ్చు.

కథావస్తువు

కథావస్తు రీత్యా తెలుగు సినిమాను పౌరాణికాలు, జానపదాలు, క్రైం చిత్రాలు, సాంఘికాలు వగయిరా ఐదారు రకాలుగా విభజించవచ్చు. ఈ కథలోనూ, అది చెప్పే పద్ధతిలోనూ అనేక భావాలు, దృక్పథాలు, ధోరణులు, విలువలు మనం గమనించవచ్చు. వాటిపై విదేశీ చిత్రాలనుండి స్థానిక భూస్వామ్యభావజాలం దాకా అనేక ప్రభావాలు కన్పడుతుంటాయి. అయితే ప్రస్తుతం భావాల్ని పక్కకుపెట్టి కేవలం కథావస్తువులో వస్తున్న ప్రధానమయిన మార్పులని మాత్రమే తీసుకుందాం.

తెలుగు సినిమాచరిత్ర పౌరాణికాలతో మొదలయింది. 'భక్తప్రహ్లాద'నుండి మొదటి ఏడెనిమిదిసంవత్సరాలు కేవలం పౌరాణికాలు మాత్రమేవచ్చాయి. ఈదశలో తెలుగు నాటకరంగమే తెలుగుసినిమాకు కళాకారుల్నిచ్చింది. 1938లో 'మాలపిల్ల' సినిమానాటినుండి అడపాదడపా సాంఘికసినిమాలు రావడంమొదలయింది. అప్పట్లో ఈధోరణిమీద సంఘసంస్కరణోద్యమం, స్వాతంత్ర్యోద్యమం, రైతాంగఉద్యమం ప్రభావం మనంగమనించవచ్చు. అస్పృశ్యతా నివారణమీద 'మాలపిల్ల' (1938), మద్యపాననిషేధంమీద 'గృహలక్ష్మి' (1938), వితంతు వివాహసమస్యమీద 'మళ్ళీపెళ్ళి', (1939) వరకట్న సమస్య మీద 'వరవిక్రయం' (1939), జమీందారీ సమస్య మీద 'రైతు బిడ్డ' (1939) అందుకుదాహరణలు. ఒకరకంగా దీన్నితెలుగులో 'సమాంతర సినిమా' మొదటిఅలగా వర్ణించవచ్చు. క్రమక్రమంగా సాంఘికచిత్రాల సంఖ్య పెరిగిపోయింది. 1937 దాకా వచ్చిన 40 సినిమాలు పౌరాణికాలే అయితే 1950లో వచ్చిన 17 చిత్రాలలో 11 చిత్రాలు సాంఘికాలే.

40 ల చివరి రోజుల నుండే మొత్తం మన కళారంగాలన్నింటిమీద ప్రజా పోరాట ప్రభావం క్షీణించడం మొదలయింది. ఈలోగా సినిమాలు తీసేవాళ్ళక్కూడా కొత్త కథావస్తువు కోసం వెతకాల్సిన అవసరం ఏర్పడింది. 1948, 49 లలో మొదటిసారిగా రెండు జానపద సినిమాలు హిట్‌గావడంతో (బాలరాజు, కీలుగుర్రం) జానపద సినిమాల ధోరణి నెమ్మదిగా ప్రవేశించింది. అయినా మొత్తంగా సాంఘి కాలదే పైచేయి. అయితే ఈ సాంఘికాలు అభ్యుదయాంశని పూర్తిగావదిలేసిన మెలోడ్రామాలు మాత్రమే.

1953 నుండి అరసం, ప్రజానాట్యమండలి, కమ్యూనిస్టు పార్టీలనుండి కళా కారులు సినీరంగంలోకి వెళ్ళడం మొదలుపెట్టారు. వీళ్ళప్రభావంతోనే జానపద బాణీలు సినిమా పాటలయ్యాయి. సామాజిక సమస్యలచుట్టూ అల్లిన కథావస్తువు సినిమాకు వస్తువయింది (పెద్దమనుషులు, ఎం.ఎల్.ఎ వగయిరాలు). వీటీవీటని ఈ గాలిని మనం తెలుగులో 'సమాంతర సినిమా' రెండో అలగావర్ణించవచ్చు. ఈ గాలి ఎక్కువకాలం నిలువలేదుగాని, ఈ గాలితో మద్రాసుకొట్టుకుపోయిన అభ్యు దయ కళాకారులు మాత్రం నిలదొక్కుకున్నారు. 60 ల మొదటి భాగమంతా సాంఘిక చిత్రాలే ఎక్కువగా విడుదలయినా, విఠలాచార్య పైపు జానపద సినిమాలు ('కనక దుర్గపూజామహిమ', 1960) హిట్ గావడం మొదలెట్టాయి. ఇవికాక కేవలం తమ సాంకేతిక శక్తితో పౌరాణికాలుకూడా ఒకటీ అరా హిట్ అయ్యాయి (మొదటి కలర్ సినిమా లవకుశ, 1963 అందుకో ఉదాహరణ).

60ల రెండోభాగంనుండి క్రైంచిత్రాలు రావడం మొదలయింది (మొదటి హిట్ 'గూఢచారి 116', 1967) అప్పటినుండి క్రైం, సెక్స్, సస్పెన్స్ చిత్రాలు పెరగడం ఆరంభించి తర్వాతకాలంలో ప్రతిసినిమాలోనూ (చివరికి పౌరాణికాల్లో కూడా) ఈ ధోరణులు విడదీయరాని భాగమయిపోయాయి. ఒకరకంగా ఆధోరణే ఇంకా కొనసాగుతున్నట్లెక్క.

70 లలో బాగా ప్రచారంపొందిన సీరియల్‌నవలలు సినిమాలుగా రావడం మొదలెట్టాయి. కోడూరి కౌసల్యాదేవి, యద్దనపూడి సులోచనారాణి మొదలయిన సీరియల్ నవలారచయితులు సినీప్రవేశంచేశారు. (70 లలో సీరియల్ నవలగా సినీరంగానికి పోయిన కథావస్తువు, 80ల నాటికి రూపంమార్చుకొని తిరిగొచ్చి సీరి యల్ నవలలమీద తనప్రభావం చూపించిందిగాని, అదివేరేకథ), క్రమక్రమంగా

క్రైంసినిమాఅయినా, సాంఘికసినిమాఅయినా, సెక్స్‌సినిమాఅయినా. అన్నీ ప్రజాదరణని కోల్పోవడం మొదలెట్టాయి. కొన్నాళ్ళపాటు ఇవన్నీ సమపాళ్ళలో కలిసిన సినిమాలే హిట్ అయ్యాయి. చివరికి ఇవికూడా మూసలోపోసినట్టు తయారయి ప్రేక్షకుల్ని విసిగించడం మొదలెట్టాయి. వీటికి భిన్నంగావచ్చిన సినిమాలు సూపర్ హిట్ అయ్యాయి (అందుకో ఉదాహరణ : శంకరాభరణం). 1975కి 1980కి మధ్య విడుదలయిన సినిమాలలో అత్యధికభాగం విఫలమయిన సినిమాలే. ఇది పెట్టుబడికి మరో 'గ్రహింపుసంక్షోభం' (రియలైజేషన్ క్రైసిస్). అమ్మకశక్తిగల కథావస్తువుకోసం పెట్టుబడి మరో అన్వేషణ చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఆరకంగా చూస్తే సినిమారంగంలో పెట్టుబడి సంక్షోభంలో పడుతున్నప్పుడల్లా ఏదోఓరూపంలో 'సమాంతరసినిమా' వస్తూనేఉందని మనంచెప్పుకోవచ్చు. కథావస్తువుకి అదనపు విలువకుఉన్న ఈ సంక్షోభసంబంధం ఒక విషవృత్తం. ఆకర్షణీయమైన ఈ వృత్త పరిధి పరిభ్రమణంలోకి వెళ్ళినవాళ్ళంతా అక్కడే చిక్కడిపోయారు. (తిరిగొచ్చిన వాళ్ళు విఫలులయి వెనక్కివచ్చారుగాని ఆ వృత్త రాజకీయ స్వభావాన్ని అర్థంచేసుకొనికాదు). అంచుకు మనం మద్రాసుపోయిన అభ్యుదయ కళాకారుల్నే ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు.

అభ్యుదయ సినిమా

1951 లో తెలంగాణాలో సాయుధ పోరాట విరమణ తర్వాత కమ్యూనిస్టుపార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా సమాజంలో విప్లవాత్మక మార్పులు సాధించవచ్చునే సిద్ధాంతాన్ని చేపట్టింది. అందుకు కొద్దిగా అటో ఇటో కమ్యూనిస్టుపార్టీ సభ్యులో, ప్రజాసంఘాలలో సభ్యులో, అభిమానులో అయిన కళాకారులు కూడా మద్రాసు సినిమా ద్వారా విప్లవభావప్రచారం చెయ్యవచ్చునని నమ్మడం మొదలెట్టారు. 1952 లో ఎన్నికలు జరిగిన ఏడాదికల్లా ప్రజానాట్యమండలిని నిర్మించి, నడిపించిన కళాకారుడు డాక్టర్ గరికపాటి రాజారావుగారు సినీరంగ ప్రవేశం చేసారు. క్రమక్రమంగా అభ్యుదయ దర్శకులు, రచయితలు, నటీనటులు, నిర్మాతలు సినిమాల్లోకి వెళ్ళిపోయారు. ఈ వలస వెనక ఒక సిద్ధాంతమూ ఉంది, దానికో ఆచరణాఉంది. సైద్ధాంతికంగా పాలకవర్గ సంస్థలను ప్రజాపోరాటాలకు ఉపయోగించుకోవచ్చునే వాదన భారతకమ్యూనిస్టు ఉద్యమంలో ఏదో ఓ రూపంలో మొదటనుంచీ ఉంది. 1952 నుండి అది ఒక నిర్దిష్టరూపం తీసుకొంది. ఈ వాదన వర్గపోరాటంలో ఉన్న ఒక

కీలకసూత్రాన్ని చెప్పకుండానే నిరాకరిస్తుంది. అది రాజ్యాంగయంత్రంపై (State) స్పష్టమయిన దృక్పథం. ప్రతి సామాజిక వ్యవస్థకు దానికనుగుణమయిన రాజ్యాంగ యంత్రం ఉంటుంది. ఆ రాజ్యాంగ యంత్రంపై ఆయాపాలకవర్గాలు అధికారాన్ని చలాయిస్తాయి. రాజ్యాంగయంత్రం తన అజమాయిషీలోనే వ్యవస్థలో అన్నిరంగాలలోనూ పాలకవర్గ ప్రయోజనాల్ని కాపాడుతుంది. ఈ రాజ్యాంగ యంత్రంలో అధికారంలోఉన్న పాలకవర్గాల మార్పు విప్లవంలో ప్రధానాంశం. కీలకమయిన ఈ చారిత్రిక భౌతికవాద సిద్ధాంతాన్ని గాలికివదిలేసి పాలకవర్గ సంస్థలలో, పాల్గొనడం ద్వారా, దోపిడీ ఉత్పత్తిసంబంధాలలో సాధనాల యాజమాన్యంలో క్రమక్రమమయిన మార్పుల ద్వారా సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చనడం సారాంశంలో వర్గపోరాటాన్నీ, సమాజ పరిణామక్రమంలో దానిపాత్రనీ నిరాకరించడమే. ఈ భావనాక్రమం మన దేశంలో ఆత్మవంచనగా మొదలయి పరవంచనకు దారితీసింది.

ఈ సిద్ధాంతమే తెలిసో, తెలియకో కళాకారుల్లో కూడా ప్రతిఫలిస్తుంటుంది. ఎక్కువమందికి చేరవచ్చుననే వాదనతో వ్యాపార ప్రచారసాధనాల్ని అభ్యుదయ వాదులు వాడుకోవడం దీని ప్రభావమే. పేరుకి ఎక్కువ మందికి చేరినా, వ్యాపార ప్రక్రియలద్వారా పోరాట చైతన్యాన్ని ప్రజలలో కలిగించడం అసాధ్యం. ఆ ప్రక్రియలద్వారా చేరేభావాలు పోరాటచైతన్యంలో భాగం కాలేవు. విప్లవాచరణలో భాగంకాని విషయ పరిజ్ఞానం వర్గపోరాటానికి ఏరకమయిన బలాన్ని చేకూర్చలేదు. కళారంగంలో ఈ వాదన స్పష్టంగా ఒక సిద్ధాంతరూపాన్ని తీసుకోకపోయినా, అక్కడ కూడా దాని క్రమం మొదట్లో అమాయక ఆత్మవంచన, తర్వాత పరవంచన.

తెలుగుసినిమాలో ప్రవేశించిన అభ్యుదయ కళాకారులందరు మొదట్లో తమ తమ సినిమాలలో అభ్యుదయాంశని దృష్టిలోపెట్టుకొనే పాల్గొన్నారు. క్రమక్రమంగా దాన్నికోల్పోయి ఫక్తు వ్యాపారసినిమాలు నిర్మించారు. అభ్యుదయకవుల విషయంలో ఇదికొట్టొచ్చినట్టు కన్పడుతుంది. సాంప్రదాయ కవిత్వంపై, భావకవిత్వంపై తిరుగుబాటుగా అభ్యుదయ కవితాఉద్యమం వచ్చింది. ఆ ఉద్యమబలంతోనే కవులయి, వాళ్ళంతా మద్రాసు చేరుకోగలిగారు. కొద్దికాలంలోనే హీరో హీరోయిన్లు చెట్లచుట్టూ తిరుగుతూ పాడుకునేందుకు అనువయిన వరుస చచ్చు భావకవిత్వపాటలు రాసారు. అభ్యుదయకవుల సినిమాపాటలు వాళ్ళ అభ్యుదయ రాహిత్యానికేకాదు, ప్రతిభా విహీనతకుకూడా సాక్ష్యమయిపోయాయి. (సినిమాకు పోయింతర్వాతకూడా కొందరు

ప్రజాకవిత్వం రాయగల్గినా, అది సినిమాల బయటే). సినిమాలలో పెట్టుబడి వాళ్ళ పోరాటదీక్షనేకాదు, సృజనాత్మక శక్తినికూడా పీల్చిపిప్పిచేసి తనఅవసరాలకు వాడుకుంది. ఈ సారహీనక్రమమే అభ్యుదయ కళాకారుల ఆచరణ.

భావజాలంగా సినిమా

అయితే సినిమాలో అభ్యుదయాంశో, ప్రతిఘటనాంశో ఉండేఅవకాశాలు పూర్తిగా లేకుండాపోలేదు. అదికూడా సినిమాలద్వారా ప్రచారంఅవుతున్న భావాలలో అడపాదడపా కన్పించేఒకభాగం. భావాలుగా, భావజాలంగా సినిమాకు వేరేచరిత్ర ఉంది. వాటిపై రెండు ప్రధానధోరణుల ప్రభావాన్ని మనంగమనించవచ్చు. మొదటిది విదేశీభావజాలం, రెండవది భూస్వామ్య భావజాలం. మొదటినుండీ విదేశీ సినిమా, ముఖ్యంగా అమెరికన్, బ్రిటిష్ సినిమా మనసినిమాలలో కథనీ, అది చెప్పేపద్ధతినీ ప్రభావంచేస్తూనే వస్తోంది. సాధారణంగా మనం పాశ్చాత్యనాగరికతలో భాగంగా గుర్తించే క్రైం, ఫైటింగ్. సెక్స్ వగయిరా ధోరణులన్నీ అలావచ్చినవే. (నిజానికి ఈ ధోరణులు ఆ దేశాల పాలకవర్గ సంస్కృతికి చెందినవేకాని, ప్రజల సంస్కృతికి చెందినవికావు). అయితే మనసినిమాలలో ప్రధానమయిన ధోరణి భూస్వామ్య భావజాలమే. భగవంతుడు, రాజు, దొర, పురుషుడు - ఈ నల్గురి సాంఘికాధిపత్యాన్ని సమర్థిస్తూ, వారికి సంబద్ధతని (Legitimacy) సాధించడమే భూస్వామ్య భావజాలసారాంశం. ఈ నాలుగు సాంఘికశక్తుల ఆధిపత్యాన్ని బలపరుస్తూ ఏర్పడిన నీతులు, నియమాలు, సాంప్రదాయాలవిలువలు ఈ భావజాలంలో ప్రధానభాగం. సినిమాలలో ఆకర్షణకోసం ఇవి ఆధునిక వేషంవేసుకున్నా (దొర బదులు ఒకసంపన్నుడు) సారాంశంలో ఇవి భూస్వామ్య భావజాలానికి చెందినవే. నిజానికిమనం పాశ్చాత్య నాగరికత ప్రభావానికి గురిఅయినవిగా భావించే సినిమాల్లో కూడా అంతిమపరిశీలనలో ఈ భావజాల ఆధిక్యతే స్పష్టంగా గమనించవచ్చు. అభివృద్ధి చెందిన పెట్టుబడి, సాంకేతికపరిజ్ఞానం ఈ భూస్వామ్య భావజాలాన్ని బలంగా ప్రచారంచేయడం విచిత్రం. ఈ వ్యవస్థని పాలిస్తున్న భూస్వాముల, సామ్రాజ్యవాదుల ఖిలాఖతుకి ఇదొక మంచిఉదాహరణ,

ఈ భావజాల పరిమితులలోనే అప్పుడప్పుడు ప్రతిఘటనాంశ అకస్మాత్తుగా ప్రవేశిస్తుంది. ఈ ప్రతిఘటనాంశనుచూసి మనం భ్రమపడనవసరంలేదు. తనకు అదనపు విలువను సృష్టించి, గ్రహించేశక్తి ఉన్నంతకాలం పెట్టుబడికి ప్రతిఘట

నతో పేచీలేదు. పెట్టుబడికి సేవచేయడమే ఈ ప్రతిఘటనాంశంపై అది విధించే షరతు (నోట్లో ఎముకముక్క పెట్టుకున్న కుక్క మొరగలేదని ఒక యూదుసామెత). సాధారణంగా ప్రజాపోరాటాల ప్రభావంతోనే ఈ ప్రతిఘటనాత్మకకళ రూపం తీసుకుంటుంది. ఆ పోరాటం విరమించినా, కుంటుపడినా, ఈరకంకళని పెట్టుబడి మరెంతగా ప్రోత్సహిస్తుంది (రెండవ ప్రపంచ యుద్ధానంతరం పశ్చిమ యూరప్‌లో కార్మికవర్గ ఉద్యమం కుంటుపడింతర్వాతేకదా పాశ్చాత్య ప్రచురణకర్తలు విజృంభించి మార్క్సిస్ట్ సాహిత్యాన్ని అమ్ముకోవడం మొదలెట్టింది). అయితే త్వరపడి కొంతమంది కళాకారులు పోరాటం కొనసాగుతుండగానే ఏవోట భ్రమలతో పెట్టుబడి సేవలోకి వెళ్ళిపోతుంటారు. వాళ్ళు లాభాలుసృష్టించగలరో, లేరో అనిశ్చితంగాని, ప్రజాపోరాటాలనుండి దూరమయి వేరుపడటంమాత్రం నిశ్చితమే.

ఇదికాక 'ప్రతిఘటనాంశ' సంక్షోభంలోపడిన పెట్టుబడికి అవసరం కూడా అవుతుందని మనం ఇంతకుముందే చెప్పుకొన్నాం. ప్రస్తుతం తెలుగు సినిమాలో వీస్తున్న కొత్తగాలి పెట్టుబడిని సంక్షోభం నుండి రక్షించడానికి జరుగుతున్న ప్రయత్నంలో ఒకభాగం. అందుకోసం ఇతరత్రాగూడ ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందుకు ప్రభుత్వరాయితీలు ఒక ఉదాహరణ. పూర్తిగా మన రాష్ట్రంలోనే నిర్మింపబడే చిత్రాలకు ప్రభుత్వం లక్షన్నర రూపాయలదాకా సబ్సిడీనిస్తోంది. ఈప్రభుత్వ సబ్సిడీలు మన ఆర్థిక వ్యవస్థలో అన్నిరంగాలలోనూ ఉల్లిపాయలనుండి బట్టలమిల్లుల దాకా విజృంభిస్తున్నాయి. 1972లో కేంద్ర బడ్జెట్‌లో మూడుకోట్లున్న ఈ సబ్సిడీలు ప్రస్తుతం మూడొందలకోట్లు దాటిపోయాయి. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సినిమాను ఒక పరిశ్రమగా గుర్తించింది. ఈ గుర్తింపువల్లయినా సినిమా రంగంలో పనిచేస్తున్న వాళ్ళల్లో ట్రేడ్‌యూనియన్ ఉద్యమం రూపం తీసుకుంటుందో లేదో ఇప్పుడే చెప్పడం కష్టం. కాని నిర్మాతలకు దీనివల్ల గొప్పఅవకాశమే వాళ్ళు ప్రైవేటు ఫైనాన్సియర్స్ బెడద వదిలించుకొని ప్రభుత్వబ్యాంకులు, పారిశ్రామిక ఆర్థిక సహాయ సంస్థలు మొదలయిన వాటన్నిటినుండి చిన్న చిన్న వడ్డీలకు పెద్ద పెద్ద అప్పులు తీసుకోవచ్చు.

ప్రక్రియగా సినిమా

అయితే సినిమా ఒక ప్రక్రియగా ప్రజాపోరాటాలకు పనికిరాదా?

ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే మనం సిద్ధాంతాన్ని పరిశీలించాలి,

ఆచరణనీ చూడాలి. మనం ముందు చెప్పుకున్న రాజకీయార్థిక పరిభాషలో ఈరకం సినిమాలను మారకపువిలువకోసం కాక, ఉపయోగపువిలువకోసం ఉత్పత్తి చేసే సినిమాలుగా చెప్పుకోవాలి. "పెట్టుబడి - శ్రమ - అదనపువిలువ" అనే చట్రం బయట విప్లవ ప్రయోజనాలకోసం సినిమాలు తీయగల్గితే వాటిని మనం 'ప్రజాసినిమా' గా గుర్తించొచ్చు. ఇందుకు రెండురకాల ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మొదటిది మదుపు, రెండవది ప్రదర్శన. సినిమా టెక్నాలజీ గతంలో కంటే ఎక్కువగా అందుబాటులో ఉంది. ఆత్యయిక పరిస్థితిపై వచ్చిన మూడు ముఖ్యమయిన డాక్యుమెంటరీలు (40 నిమిషాల ప్రదర్శనాకాలం) 20 వేలరూపాయల కంటే ఎక్కువ ఖర్చులేకాదు. (ఆనంద్ పట్‌వర్ధన్: వేవ్స్ ఆఫ్ రివల్యూషన్, ప్రిజనర్స్ ఆఫ్ కాన్సెన్స్; స్మృతుకొఠారీ: వాయిసెస్ ఆఫ్ ది పీపుల్స్). ఈ రకం సినిమాలు తీసి 16 మి.మి. ప్రొజెక్టర్‌తో రహస్యంగా ప్రదర్శించడం సాధ్యమే అని ఆత్యయిక పరిస్థితి మనకు చెప్పింది. ఇక్కడ లాటిన్ అమెరికా 'అజ్ఞాత సినిమాలు' మనకు మంచి ఉదాహరణ. చిలీలో అలెండీ మరణం తర్వాత మిలటరీ ప్రభుత్వం అధికారంలోకివచ్చి అన్ని కళలమీద ఫాసిస్టునిర్బంధాన్ని అమలుపరిచింది. పలుగురు దొత్సాహికులయిన కళాకారులు ఆ నిర్బంధాన్ని గురించి మూడు సంవత్సరాలపాటు అజ్ఞాత జీవితంలో ఉంటూనే శ్రమించి నిరంతర నిర్బంధం మధ్య సినిమా తీసారు. సినిమా పూర్తవుతున్న దశలో దర్శకుడు పాట్రిషియోగుజ్మేన్‌ని మిలటరీ కాల్చిచంపివేసింది. ఎప్పటికప్పుడు ఫిల్మ్‌ని స్మగుల్ చేయడంవలన సినిమాను వాళ్ళు రక్షించుకోగలిగారు. మూడుగంటలసేపుసాగే ఈ విప్లవ సినిమాను చివరికి 1980 లో 'బాటిల్ ఆఫ్ చిలీ' అనే పేరుతో విడుదలచేసారు. చిలీబయటేకాదు, అది విప్లవోద్యమ సహకారంతో చిలీలోకూడా వందలాది అజ్ఞాత ప్రదర్శనలతో చిలీ ప్రజలకు చూపించగలిగారు. ఈ రకం సినిమాలని మనం ప్రజాపోరాట సినిమాగా గుర్తించవచ్చు.

అయితే సినిమా తీయడానికి కావాల్సిన మదుపు, చూపించడానికి కావాల్సిన నిర్మాణం ఇప్పుడు మన విప్లవోద్యమానికి లేవుగదా అని ఎవరయినా ప్రశ్నించవచ్చు. విప్లవ సినిమాను తీసి రక్షించుకొని, ప్రదర్శించుకొనే విప్లవోద్యమాన్ని నిర్మించడంలో (వాళ్ళు కోరుకునే సినిమా కోసమే అయినా!) తోడ్పడాలిగాని, అప్పటిదాకా పెట్టుబడితో సయ్యాటలాడటం దానికి సమానం కాదనిచెప్పాలి. అప్పుడే సినిమా దోపిడీచట్రం అవల, ప్రభుత్వాన్ని గుర్తించకుండా, విప్లవ ఉద్యమబలంమీద ఆధారపడి, విప్లవంకోసం తీసేసినిమా అవుతుంది. దాన్ని మనం విప్లవ సినిమా అని పిలుచుకోవచ్చు.

ముగింపు

అంచేత, మన సినిమాలో రెండు అంశాలున్నాయి. ఒకటి: భావజాలంగా, ప్రక్రియగా దానిబలం, పరిమితి. రెండు: పెట్టుబడిగా అది ఉత్పత్తిచేస్తున్న అదనపువిలువ. ఈ రెంటి పూర్వరంగం మీద నిలబడే మనం సినిమా మంచిచెడుల గురించి వాదప్రతివాదనలు సాగించవచ్చు. ఇవ్వాళ తెలుగులో ఈ వాదప్రతివాదనలుచేస్తున్న వాళ్ళు ఈ పూర్వరంగాన్ని దృష్టిలోపెట్టుకొనే తమతమ వాదనలు కొనసాగించుతారని, తీర్పు మాత్రం విప్లవానికి, చరిత్రకు వదిలేద్దాం.

అనుబంధం

I నిర్మాణం:

కాలం :	1931-40	1941-50	1951-60	1961-70	1971-80
విడుదలైన చిత్రాలు* :	75	92	318	543	895
కలర్ చిత్రాలు :	-	-	-	11	482

(* అనువాద చిత్రాలు, కలర్ చిత్రాలతో కలిపి)

II పంపిణీ :

సంవత్సరం :	1931	1953	1957	1980
సంస్థల సంఖ్య :	1	58	126	500

III ప్రదర్శన :

సంవత్సరం :	1921	1958	1970	1980
సినిమాహాళ్ళసంఖ్య :	1	546	892	1900

(వ్యాసంలోనూ, అనుబంధంలోనూ ఇప్పటివరకు ఇచ్చిన వివరాలన్నిటికీ ఆధారం : 'ది ఆంధ్ర ఫిలిం చాంబర్ జర్నల్', డిసెంబర్, 1976, ఫిలిం చాంబర్ తెలుగు సినిమాలపై వార్షిక నివేదికలు 1977-1980. ప్రచురణకర్తలు : ఆంధ్ర ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్, గాంధీనగర్, విజయవాడ - 3).

తెలుగు సినిమాలో 'అభ్యుదయ' వాదులు

1. కమ్యూనిస్టుపార్టీ

పేరు	పని
కె. ప్రత్యగాత్మ	దర్శకుడు
రావి దుర్గారావు	నిర్మాత
గొళ్ళపూడి రాధాకృష్ణమూర్తి (రాష్ట్ర కమిటీ సభ్యుడు)	"
కొసరాజు సుబ్బారావు	నిర్మాణ నిర్వాహకుడు
పి.వి. సుబ్బారావు	" "
అట్లూరిపూర్ణచంద్రరావు	" "

2. యువజన సంఘం

పేరు	పని
తాతినేని ప్రకాశరావు	దర్శకుడు
వీరమాచనేని మధుసూదనరావు	"
కె.బి. తిలక్	"
తాతినేని రామారావు	"
గుత్తా రామినీడు	"

3. విద్యార్థి ఫెడరేషన్

పేరు	పని
గుమ్మడి	నటుడు
చలసాని ప్రసాద్	నిర్మాణనిర్వాహకుడు
టి. వేణుగోపాలరావు	" "
కె. హరిసర్వోత్తమరావు	" " సహాయ దర్శకుడు

4. అభ్యుదయ రచయితల సంఘం

పేరు	పని
శ్రీశ్రీ	రచయిత
ఆరుద్ర	"
సుంకర	"
వాసిరెడ్డి	"
ఆత్రేయ	"
బొల్లిముంత శివరామకృష్ణ	"
అనిసెట్టి	"
మా. గోఖలే	కళాదర్శకుడు

5. ప్రజానాట్యమండలి

పేరు	పని
గరికపాటి రాజారావు	దర్శకుడు
మాగంటి గోపాలకృష్ణయ్య	"
తాతినేని చలపతిరావు	సంగీత దర్శకుడు
మోహన్ దాస్	" "
బి. గోపాలం	" "
జమున	నటి
కోడూరు అచ్చయ్య	నటుడు
పెరుమాళ్ళు	"
చదలవాడ కుటుంబరావు	"
అల్లు రామలింగయ్య	"
మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి	"
రామకోటి	"
వల్లం నరసింహారావు	"
నాగభూషణం	"
టి.వి. రమణారెడ్డి	"

అనువాద వ్యాసం

పుస్తక పరిచయం

పుస్తక సమీక్ష

సాహిత్య లేఖ

చర్చ

యదార్థ జీవితదృశ్యాలు

రచయిత	శీర్షిక	సంచిక	పేజీ
	కలంయోధుడు చెరబండరాజు		
	జులై వీరతెలంగాణ వారస్వతం		
130	ఆగస్టు స్వాతంత్ర్యం		
131	సెప్టెంబర్ పత్రికాస్వాతంత్ర్యం		
132	అక్టోబర్ తెలంగాణ అన్వేషణ		
133/134	నవంబర్/డిసెంబర్ 'బాతాఖానీ' క్లబ్బుఎన్నికల్లో సినిమారబ్బు		

1982లో సృజన ప్రచురణలు

ప్రచురణ 28 - ఉప్పెన - రెండోభాగం చౌ.లిపో.- మే రు. 6.00

8 - నాకుటుంబం - టాప్‌చెంగ్ రెండవముద్రణ ఏప్రిల్ రు. 4.00

ఈ సూచికలో రామకృష్ణారెడ్డి కవిత, చెరబండరాజుపాట, ఓపోలీసన్నపాట, ఆళ్వారుస్వామి కథ పునర్ముద్రణలు.

(72 వ పేజీ తరువాయి)

9. '71-'80 (ఈ తరం యుద్ధకవిత): ప్రచురణ : ఉస్మానియా యూనివర్సిటీ రైటర్స్ సర్కిల్, హైదరాబాద్; పేజీలు: viii + 72; వెల : 6 రూ.లు ప్రతులకు : 1, మాధురీ పబ్లికేషన్స్, 1-1-694/2/A, గాంధీనగర్, హైదరాబాద్ 500 380: 2, నవయుగ బుక్‌హౌస్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్; 3, పీస్‌బుక్ సెంటర్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్.

10. ప్రసారిత (ఆధునిక సాహిత్యవేదిక) సంపాదకులు : నమలికొండ బాలకిషన్‌రావు; సాలుచందా : 10 రూ.లు; వివరాలకు : యన్. బాలకిషన్‌రావు, ఇంటి నెం. 6-7-2/ఎ, రాగన్నదర్వాజ, హన్మకొండ - 506 011.

పుస్తకస్వీకారం

1. దారితప్పిన నది - నవల - డాక్టర్ నరేంద్ర, 96+vi పేజీలు, 1/8 క్రౌన్, ఐదు రూపాయలు, ప్రతులకు : ఎపిబుక్ డిస్ట్రిబ్యూటర్స్, సిఎల్ఎస్ బుక్ షాప్, దేశీబుక్‌షాప్ హైదరాబాద్.

2. బలిరక్కసి - కవితలు - ఐ. యస్ గిరి, సుమన్ పబ్లిషర్స్ (నవంబర్ 1982) 44+vi పేజీలు, 1/8 డెమీ, రెండు రూపాయలు, ప్రతులకు : సుమన్ పబ్లిషర్స్, సాల్మన్ సెంటర్, చీరాల 523 155.

3. నిరసన - అద్వయంభైకో ప్రచురణ : ఎండా వానాకాలంలో అచ్చు (1982) వెల అపారం, 12 పేజీల ఫోల్డర్, ప్రతులకు : లేదు.

4. ఆలోచనాలోచనాలు (కవితాసంపుటి) శ్రీనాటూరి శేషగిరిరావు (డిసెంబర్ 1982), పేజీలు, 24, డెమీసైజు, వెల : 3 రూ.లు, ప్రతులకు : సాహితీసుధ, డోర్ నెం. 9-139, నాయుడుగూడెం రోడ్డు, పెదపాడు - 534 437, ఆంధ్రప్రదేశ్

5, మనిషొక్కడే (కవితలు) - శ్రీ "కాట్రగడ్డ": పేజీలు : 24, డెమీసైజు వెల : 3 రూ.లు; ప్రతులకు : సాహితీసుధ, డోర్ నెం. 9-139, నాయుడు గూడెంరోడ్డు, పెదపాడు - 534 437, ప.గో. జిల్లా, ఆంధ్రప్రదేశ్

6. రాకెట్టు కథ - డాక్టర్ మహీధర నళినీమోహన్; పేజీలు : 194; వెల రూ. 9-00: ప్రతులకు : హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, రోడ్డు నెం. 11, 3-6-694 హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029

7. నక్సల్బరీ వెలుగులో (భారతదేశ నక్సలైటు ఉద్యమచరిత్ర) - ఆం మూలం : సుమంతాబెనర్జీ, తెలుగు : కృష్ణమూర్తి; పేజీలు : XX+504; వెల రూ. 24; ప్రతులకు : సామ్యవాదసాహితి, 16-2-145/8/3, జడ్జస్‌కాలనీవెను న్యూమలక్‌పేట, హైదరాబాదు - 500 036.

8. Fourth World Dynamics: Jharkhand - Edited by: Nirma Sengupta; pp xxiv+260, Price: Rs. 80, For copies: Smt. Pushpa Authors Guild Publications, A1/275-A, Lawrence Road, Del 110 035.

(మిగతా 71 వ పేజీలో

ప్రియమైన పాఠకులారా !

గత మూడేళ్ళుగా మేము విదేశ భాషల్లోని ఉత్తమగ్రంథాలను తెలుగులో సులువుగా అర్థమయ్యే అనువాదాలను ప్రచురిస్తున్నాం. అయితే తెలుగులో మౌలిక రచనలను కూడా ప్రచురించాలని మా అభిలాష. అట్టి రచనలు పంపవలసిందిగా రచయితలను కోరినాము. కాని ఇంతవరకు మాకు అందిన రచనల సంఖ్య చాలా తక్కువ. ఇటీవల మేం ప్రకటించిన నవలల పోటీలో మాకు చేరిన ఇరవయి పైచిలుకురచనల్లో దేనినీ మేము ప్రచురించలేకపోతున్నాం.

తెలుగులో మౌలికరచనలను (original wriring) ప్రచురించడానికి ఇకముందుకూడా మా ప్రయత్నం కొనసాగుతుంది. ఇలాంటి పుస్తకాలలో రచనాశైలిలో లోపాలుంటే తరువాత మెరుగుపరచుకోవచ్చు. కానీ విషయం మాత్రం ఉన్నత ప్రమాణాలలో ఉండాలి. ఈనాటి జీవనసత్యాలను, ప్రజా సమస్యలను, ఆకాంక్షలను, వివిధరకాలుగా నిరంతరంగా కొనసాగుతున్న పోరాటాలను ప్రతిబింబించేట్లుగా ఈ రచనలు ఉండాలి.

మేము వెలువరించిన 'కార్టూన్‌లలో మార్క్స్' పుస్తకాన్ని మీలో చాలామంది చదివేఉంటారు. లెనిన్, మావోలపై కూడా అలాంటి పుస్తకాలు త్వరలో ప్రచురిస్తున్నాం. భారతదేశంలో ప్రజాఉద్యమాలు, నాయకుల గురించి కూడా ఇటువంటి పుస్తకాలు ప్రచురించడానికి మీ సహకారం కోరుతున్నాం. ఉదాహరణకు అల్లూరి సీతారామరాజు గురించి ఇలాంటి బొమ్మల పుస్తకం ప్రచురించవచ్చు. అటువంటి వ్యక్తుల వ్యక్తిగత రాజకీయ జీవిత విశేషాల గురించి, అతని జీవితకాలంలో పరిస్థితులు, సమస్యలు అతడు కలిసిజీవించిన వ్యక్తుల వివరాల గురించి రచయితలు క్షుణ్ణంగా పరిశోధించాల్సిఉంటుంది. పరిశోధనకు అవసరమైన పుస్తకాలు సేకరణలో, రచన పూర్తి అయిన తరువాత దానికి అవసరమయిన బొమ్మలు గీయించడంలో మేం తోడ్పడగలం.

సీతారామరాజు, భగత్‌సింగ్ వంటి ప్రజానాయకులు, 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం, తెలంగాణా విమోచనోద్యమం వంటి పోరాటాల గురించి రచనా కార్యక్రమాలను రచయితలు చేపట్టవచ్చు. వ్యక్తుల గురించి రాసినపుడు మానవాతీతులుగా అతిశయోక్తులతో చిత్రించడం కాకుండా ఆయాకాలాల్లోని సామాజిక ఆర్థిక పరిస్థితుల్లో వారు ఆ సమస్యలను స్వయంగా ఎదుర్కొని తమ ప్రజలను పోరాటానికి పురికొల్పినతీరు చారిత్రక సత్యాలను యథాతథంగా పొందుపరుస్తూ చిత్రించాలని కోరుతున్నాం.

ఇటీవలికాలంలో జరిగిన సంఘటనలు, ఉద్యమాల గురించి కూడా ఇట్టి రచనలు చేయవచ్చు. స్త్రీలపై అత్యాచారాలు, వారి సమస్యలూ, పౌరహక్కుల ఉద్యమాలు మొదలైన వాటిని రచనా వస్తువులుగా తీసుకోవాలని రచయితలకు సూచిస్తున్నాం.

హైదరాబాద్ బుక్‌ట్రస్ట్

3-6-694 హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029

SRJANA Telugu Monthly January 83 H/WL-10
Regd. No. with Registrar of NewSpapers 1095/67².

సృజన దగ్గర కొత్తపుస్తకాలు

1.	మెడికల్ గైడ్	4.00
2.	ఊరు (నవల) - అల్లం రాజయ్య	4.00
3.	పంట (నవల) - యే.జు	6.00
4.	జననాట్యమండలి పాటలు	2.50
5.	పాణిగ్రాహి	3.00
5.	నాకుటుంబం (నవల) - చాలిపో	4.00
7.	Nationality Question in India- Seminar Papers	10.00
8,	A Critique of Soviet Economics	10.00
9.	The other Face of Asiad '82	3.00
10.	వ్యవసాయ విప్లవం	2.50
11.	లాల్‌బనో గులామీ ఛోడో, బోలో వందేమాతరం - ఎన్‌కె	1.00

కావలసిన పుస్తకాల వెల ఎం. ఓ. ద్వారా పంపించాలి. ఎం.ఓ. కూపన్ పై విడివిడి అక్షరాలలో వివరంగా రాయాలి.

SRJANA
Hanamkonda-506001

Single copy Rs. 2-00
Yearly Subscription Rs. 20-00